
‘సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 188

బుధవారం 28-9-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఫాల్కే పారేఖ్

సుప్రసిద్ధ నటి ఆశా పారేఖ్‌కు సినీ రంగానికి సంబంధించిన అత్యున్నత పురస్కారమైన ‘దాదాసాహెబ్ ఫాల్కే’ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2020కి గాను ఈ పురస్కారం ఇస్తున్నట్లు కేంద్ర సమాచార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు.


- వివరాలు 12లో



రాజస్తాన్ రగడపై నివేదిక

రాజస్తాన్ కాంగ్రెస్‌లో చెలరేగిన రగడపై ఆ పార్టీ పరిశీలకులు మంగళవారం సోనియాకు నివేదికిచ్చారు.

వివరాలు 6లో



‘సుప్రీం’ విచారణ లైవ్

సుప్రీంకోర్టు చరిత్రలోనే మొదటిసారిగా విచారణను యూ ట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేశారు.

వివరాలు 6లో



పీఎఫ్ఐపై మళ్లీ దాడులు

పలు రాష్ట్రాల్లోని పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా సభ్యుల నివాసాల్లో దర్యాప్తు సంస్థలు మళ్లీ సోదాలు చేశాయి.

వివరాలు 6లో

శ్రీవారి సేవలో సీఎం

బ్రహ్మాండ నాయకుడికి పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్



తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న సీఎం వైఎస్ జగన్. చిత్రంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు, మంత్రులు, టీటీడీ ఈవో తదితరులు

ధ్వజారోహణతో ప్రారంభమైన తిరుమల బ్రహ్మోత్సవాలు

- పెద్దశేషవాహన సేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- అంతకుముందు సంప్రదాయబద్ధంగా తిరుపతి గంగమ్మకు సారె..
- తిరుపతి–తిరుమల విద్యుత్ బస్సులకు పచ్చజెండా

సాక్షి ప్రతినిధి, తిరుపతి/తిరుమల/సాక్షి నెట్‌వర్క్: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రతిఏటా నిర్వహించే శ్రీవారి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించటం ఆనవాయితీ. అందులో భాగంగా ధ్వజారోహణతో మంగళవారం ప్రారంభమైన బ్రహ్మోత్సవాల తొలి రోజున ఆయన తిరునామం పెట్టుకుని.. పంచెకట్టు, కండువాతో శ్రీవారికి పట్టు వస్త్రాలను తీసుకొచ్చారు. సీఎం హోదాలో వైఎస్ జగన్ ఇలా శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం ఇది నాలుగవసారి. అంతకుముందు బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్న అనంతరం.. అక్కడ అర్చకులు ఆలయ సంప్రదాయం మేరకు సీఎం తలకు పరివట్టం చుట్టారు. పట్టువస్త్రాలను తలపై పెట్టుకున్న ముఖ్యమంత్రి

మిగతా 2వ పేజీలో ▶

ఫ్యామిలీ డాక్టర్‌లా క్యాటిల్ డాక్టర్

- గ్రామాల్లోనే పశువులకు సమగ్ర వైద్య పరీక్షలు: సీఎం జగన్
- ఆరోగ్య వివరాలు ఎప్పటికప్పుడు యానిమల్ హెల్త్‌కార్డుల్లో నమోదు
- ఖాళీగా ఉన్న 5,160 పశు సంవర్ధక సహాయకుల పోస్టుల భర్తీ
- పశువుల బీమాకు అక్టోబర్‌లో శ్రీకారం.. 80 శాతం భారం ప్రభుత్వానిదే
- నాడు–నేడు తరహాలో పశు వైద్యశాలలకు కొత్త శోభ

2లో

ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలకు సీఎం శ్రీకారం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం వరల్డ్ టూరిజం డే వేడుకలను ప్రారంభించారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధిలో భాగంగా విజిట్ ఆంధ్ర ప్రదేశ్–2023 క్యాంపెయిన్ బ్రోచర్లను ఆవిష్కరించారు.

2లో

వాన్‌పిక్ భూములకు విముక్తి!

జగన్ కంపెనీల్లో పెట్టుబడులపై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు

- 1,416 ఎకరాలను జప్తు నుంచి విడుదల చేయాలని ఈడీకి ఆదేశం
- భూముల విడుదలకు ప్రత్యేక కోర్టుకెళ్లాలన్న ట్రిబ్యునల్ ఉత్తర్వులు సరికాదు
- ఈడీ, అడ్జ్యుడికేటింగ్ అథారిటీ ఉత్తర్వులను తప్పుబడుతూ మళ్లీ ప్రత్యేక కోర్టుకెళ్లమనడం ఏమిటి?
- అలా చేయడం ద్వారా ఈడీ చట్ట విరుద్ధ చర్యలను కొనసాగించినట్లైంది
- అప్పిలేట్ ట్రిబ్యునల్ ఉత్తర్వులు ఘోర తప్పిదమే
- తెలంగాణ హైకోర్టు సీజే జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం తీర్పు
- 11,804 ఎకరాల జప్తు వ్యవహారంలో విచారణ నవంబర్ 14కి వాయిదా



సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంపెనీల్లో పెట్టుబడులకు సంబంధించి తెలంగాణ హైకోర్టు మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో వాడరేవు నిజాంపట్నం పోర్ట్స్ అండ్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్ట్ (వాన్‌పిక్) కోసం సేకరించిన 1,416.91 ఎకరాల పట్టా భూమిని జప్తు నుంచి వెంటనే విడుదల చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని ఆదేశించింది. వాన్‌పిక్ పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన 561.19 ఎకరాలు..

మిగతా 8వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ప్రపంచమంతా తిరిగి రాజధాని ఎలా కట్టాలో తెలుసుకోవడానికి ఆ ఖర్చు చేశారట సార్!

షీలా కమిటీ సిఫార్సులే దిక్సూచి

ఆ మేరకు విభజించుకుందాం



- షెడ్యూల్ 9 సంస్థలపై ప్రతిపాదించిన ఏపీ ప్రభుత్వం
- విముఖత వ్యక్తం చేసిన తెలంగాణ సర్కారు
- పదో షెడ్యూల్ ఆస్తుల పంపిణీపై సుప్రీం తీర్పునకు విరుద్ధంగా కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు.. ఉపసంహరించుకోవాలని కోరిన ఏపీ
- నూతన రాజధానికి శివరామకృష్ణన్ కమిటీ లెక్క రూ.25 వేల కోట్లు
- మీరిచ్చే రూ.2,500 కోట్లు ఏ మూలకూ సరిపోవు
- కమిటీ చెప్పి చాలా ఏళ్లైంది.. ఇప్పుడు ఇంకా పెరుగుతుంది
- ఏపీ భవన్ ఆస్తులను ఇరు రాష్ట్రాలకు త్వరగా పంచాలి
- విభజన సమస్యలపై తెలుగు రాష్ట్రాలతో కేంద్ర హోంశాఖ భేటీ

16లో



ఏపీ మద్యం విధానం సరైనదే

- కాంపిటిషన్ చట్టానికి లోబడే ఉంది
- స్పష్టం చేసిన ‘కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా’
- స్పిరిట్స్–వైన్స్ అసోసియేషన్ అభ్యంతరాలు హేతుబద్ధంగా లేవని వెల్లడి
- ఆ సంఘం వేసిన కేసును మూసివేస్తున్నట్లు ప్రకటన
- సంఘం ఆరోపణలను సమర్థంగా తిప్పికొట్టిన బెవరేజస్ కార్పొరేషన్
- కొత్త మద్యం విధానం చట్ట నిబంధనలకు లోబడే ఉందని స్పష్టీకరణ
- రాష్ట్రంలో మద్యం అమ్మకాలు తగ్గాయని గణాంకాలతో సహా వివరణ

2లో

క్లుప్తంగా

మధ్యవర్తిత్వం లేని ప్రయాణాలకు 'జీఐఎస్'

పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌భార్గవ వెల్లడి

సాక్షి, అమరావతి: సాంకేతిక సాయంతో అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడంతో పాటు టూరిజం ఆదాయాన్ని పెంచనున్నట్లు పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ చెప్పారు. ప్రపంచ మార్కెట్‌లో మధ్యవర్తిత్వం లేని ప్రయాణాలకు బాటలు వేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్) వెబ్ పోర్టల్‌ను అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. జీఐఎస్ ద్వారా ఏపీలోని మొత్తం పర్యాటక ఆస్తులు, పర్యాటక ప్రాంతాల వివరాలను మ్యాపింగ్ చేసినట్లు పేర్కొన్నారు. ప్రదేశాల మధ్య దూరం, ఎంపికలు, వసతి సమాచారంతో పర్యాటకులు తమ టూర్‌ను మెరుగ్గా ప్లాన్ చేసుకోవచ్చన్నారు. కొత్త గమ్య స్థానాల సమాచారం ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటుందన్నారు. సందర్శకుల తాకిడి, వారి ప్రయాణ విధానాలను అంచనా వేసి దానికి అనుగుణంగా మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించనున్నట్టు వివరించారు. విజిట్ ఆంధ్ర-2023 నినాదంతో జాతీయ, అంతర్జాతీయంగా విస్తృత ప్రచారం కల్పించనున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగానే పర్యాటక శాఖ కొత్తగా టూరిజం సర్క్యూట్లను ప్రోత్సహిస్తోందన్నారు. హోటల్, ట్రావెల్ అసోసియేషన్ల భాగస్వామ్యంతో దేశ వ్యాప్తంగా రోడ్ షోల ద్వారా ఏపీ పర్యాటక విశిష్టతను చాటుతామన్నారు. సాంప్రదాయ, సామాజిక మాధ్యమాల కేంద్రంగా ఈ ప్రచారం కొనసాగుతుందన్నారు.

అత్యుత్తమ పర్యాటక ప్రాంతంగా ఏపీ

- పర్యాటకుల అభిరుచికి అనుగుణంగా అభివృద్ధి
- ప్రపంచ పర్యాటక దినోత్సవంలో మంత్రి రోజా



ట్రావెల్ ఐక్యూ గ్లోబల్ సొల్యూషన్స్ సంస్థకు అవార్డును అందజేస్తున్న మంత్రి రోజా

తిరుచానూరు: దేశంలోనే అత్యుత్తమ పర్యాటక ప్రాంతంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా చెప్పారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా తిరుచానూరులోని శిల్పారామంలో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ 2023వ సంవత్సరాన్ని విజిట్ ఆంధ్రప్రదేశ్‌గా ప్రకటించారని చెప్పారు. ప్రజల అభిరుచికి అనుగుణంగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో రూ.2,310 కోట్ల పెట్టుబడితో 5 మెగా ఫైవ్ స్టార్ హోటళ్లు ఏర్పాటు కాబోతున్నాయని.. తద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. తిరుపతి, గండికోట, విశాఖ, హార్సిలీహిల్స్ తదితర ప్రాంతాల్లో రిసార్ట్ విల్లాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతిలో టెంపుల్ టూరిజం, విశాఖలో ప్రకృతి పర్యాటకంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఎకో టూరిజం, బుద్ధిస్ట్ సర్క్యూట్‌లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా బీచ్‌లను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన పర్యాటక రంగ అనుబంధ హోటళ్లు, చెఫ్‌లు, టూరిజం సంస్థలకు మంత్రి రోజా అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి, ఏపీటీడీసీ చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి, ఎండీ కన్నబాబు, డిప్యూటీ సీఈవో రాములు, కలెక్టర్ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పర్యాటకం'లో ఏపీకి 3 జాతీయ అవార్డులు



ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఏపీటీడీసీ ఈడీ

సాక్షి, అమరావతి: పర్యాటక రంగంలో రాష్ట్రానికి జాతీయ స్థాయిలో మూడు ప్రతిష్టాత్మక అవార్డులు లభించాయి. దేశంలోనే ఉత్తమ సమగ్రాభివృద్ధి పర్యాటక రాష్ట్రంగా ఏపీ నిలిచింది. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఢిల్లీలో జాతీయ పర్యాటక అవార్డులను ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రదానం చేశారు. రష్యన్ భాషలో ముద్రించి 'సీసైడ్', స్పానిష్, జర్మన్ భాషల్లో తయారు చేసిన 'హ్యాండీ క్రాఫ్ట్స్‌కు' సంబంధించిన కాఫీ టేబుల్ పుస్తకాలకు ఉత్తమ విదేశీ భాషల ముద్రణ, సీసైడ్‌కు (జాయింట్ విన్నర్) ఉత్తమ ఆంగ్ల భాష ముద్రణ అవార్డులు దక్కాయి. ఉప రాష్ట్రపతి చేతుల మీదుగా ఏపీటీడీసీ ఈడీ గోవిందరావు అవార్డులను అందుకున్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌లా క్యాటిల్ డాక్టర్

గ్రామాల్లోనే పశువులకు సమగ్ర వైద్య పరీక్షలు: సీఎం వైఎస్ జగన్

- ప్రతి ఆర్బీకేలో పాడి రైతులకు అందుబాటులో యంత్రపరికరాలు
- ఆర్గానిక్ పాల ఉత్పత్తులపై దృష్టి
- లంపీ స్కిన్ వ్యాధి పట్ల అప్రమత్తం



పశుసంవర్ధక శాఖపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

> గ్రామ స్థాయిలో రైతుల ముంగిటే పశువులకు క్రమం తప్పకుండా అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య వివరాలను యానిమల్ హెల్త్ కార్డుల్లో నమోదు చేయాలి. వీటిని ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేయాలి. తద్వారా పశువు ఆరోగ్యం ఎలా ఉంది? టీకాలు ఎప్పుడివ్వాలి? చూలు సమయం ఎప్పుడు? లాంటి వివరాలన్నీ తెలుసుకోవచ్చు. ఆర్బీకేల ద్వారా పశువులకు ఆరోగ్య సేవలను బలోపేతం చేయాలి. ఫ్యామిలీ డాక్టర్ తరహాలో గ్రామాల్లో పశువులకు వైద్యసేవల కోసం క్యాటిల్ డాక్టర్ వ్యవస్థ తెచ్చేందుకు మండలం యూనిట్‌గా కార్యాచరణ రూపొందించాలి. - ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ప్రతి ఆర్బీకేలో పశు సంవర్ధక శాఖ సహాయకులను నియమించి ఖాళీగా ఉన్న 5,160 పోస్టులను భర్తీ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. వెటర్నరీ డాక్టర్లుగా పట్టాలు పొంది 1,200 మంది నిరీక్షిస్తున్న నేపథ్యంలో ప్రతి గ్రామంలో పశు వైద్యుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల, జిల్లా, డివిజన్ స్థాయిలో స్టాఫింగ్ ప్యాట్రన్ ఒకే రీతిలో ఉండేలా రేషనలైజేషన్ చేయాలన్నారు. వచ్చే సమావేశం నాటికి తగిన కార్యాచరణతో తనకు నివేదించాలని అధికార యంత్రాంగానికి నిర్దేశించారు. పశుసంవర్ధక శాఖపై సీఎం జగన్ మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. ఆ వివరాలివీ..

సేంద్రీయ పాల ఉత్పత్తులు

పురుగు మందులు, రసాయనాలను మితిమీరి వాడటంతో ఆహారం ద్వారా జంతువుల్లో చేరుతున్నాయి. పాలల్లో వాటి అవశేషాల కారణంగా క్యాన్సర్ లాంటి దీర్ఘకాలిక రోగాల బారిన పడుతున్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే స్వచ్ఛమైన పాల ఉత్పత్తులపై రైతులను చైతన్యం చేయాలి. స్వచ్ఛమైన, నాణ్యమైన పాల ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తేవాలి. ప్రధానంగా సేంద్రీయ పాల ఉత్పత్తులపై దృష్టి పెట్టాలి. తక్కువ పెట్టుబడితో సేంద్రీయ పద్ధతుల్లో స్వచ్ఛమైన పాల ఉత్పత్తి సాధించడంపై విస్తృత పరిశోధనలు జరగాలి. ఆ ఫలితాలను రైతులకు అందించే చర్యలు చేపట్టాలి. అమూల్ ద్వారా పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయాలి.

భావి తరాల కోసం..

పాలు, గుడ్లు తీసుకుంటే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని వాటిని వినియోగిస్తాం. కానీ పాలల్లో రసాయన అవశేషాల కారణంగా పిల్లల ఆరోగ్యం దెబ్బతింటున్న పరిస్థితులను చూస్తున్నాం. ఆరోగ్యవంతమైన పిల్లల ద్వారానే మంచి భావి తరాలు నిర్మాణం అవుతాయి. ఇందుకోసం నాణ్యమైన, స్వచ్ఛమైన పాల ఉత్పత్తులను అందించాలి. ఆ దిశగా పశు యాజమాన్యంలో ఉత్తమ పద్ధతులు పాటించేలా అమూల్ ద్వారా రైతులకు నిరంతర అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలి. పశువులకు పౌష్టికాహారం అందించే విషయంలో గ్రామ స్థాయిల్లో రైతులను చైతన్యపర్చాలి.

అక్టోబర్‌లో పశువుల బీమా పథకం

పశువులన్నింటికీ బీమా సదుపాయం కల్పించాలి. ఇందుకోసం ప్రత్యేక పథకానికి అక్టోబర్ నుంచి శ్రీకారం చుట్టబోతున్నాం. ప్రమాదవశాత్తూ, రోగాల వల్ల పశువులు చనిపోతే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అలాంటి సమయంలో వారికి అండగా నిలిచేందుకు ఈ పథకం ఎంతగానో తోడ్పడుతుంది. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాల ద్వారా పశువులను కొనుగోలు చేస్తున్నారు. ఆ పశువులన్నింటికీ బీమా ఉందా? లేదా? అనేది మరోసారి పర్యవేక్షించాలి. ఆడిట్ చేసి అక్టోబరులో పథకం ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి. బీమా ప్రీమియంలో 80 శాతం మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుంది.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం

పశుపోషణ ద్వారా రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయం లభించేలా చూడాలి. పశుపోషణ విషయంలో వారికి అండగా నిలవాలి. దీనివల్ల వ్యవసాయంతో పాటు పశుపోషణ ద్వారా అదనపు ఆదాయం ఆర్జించే అవకాశం కలుగుతుంది. తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది. వైఎస్సార్ ఆసరా, చేయూత లబ్ధిదారులైన మహిళలకు పశువుల పెంపకం విషయంలో తోడుగా నిలవాలి. బ్యాంకర్లతో మాట్లాడి వారికి ఉదారంగా రుణాలిచ్చేలా కృషి చేయాలి. ప్రతి ఆర్బీకేలో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లలో పశుపోషణకు సంబంధించిన పరికరాలను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలి.

'లంపీ స్కిన్'పై జాగ్రత్త

తాజాగా పశువుల్లో లంపీ స్కిన్ వ్యాధి వ్యాపిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి. అడ్డుకట్ట వేసేలా పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలి. ఆరోగ్యకరమైన పశువులకు ఈ వైరస్ సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సరిపడా మందులు, వ్యాక్సిన్లను అందుబాటులో ఉంచాలి. అవసరమైన మేరకు టీకాలివ్వాలి.

సమీక్షలో పశు సంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, పశుసంవర్ధక శాఖ స్పెషల్ సీఎస్ డాక్టర్ పూనం మాలకొండయ్య, సహకార, మార్కెటింగ్ శాఖ ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరి, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ ఆర్.అమరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాడు - నేడుతో పశువుల ఆస్పత్రుల రూపురేఖలు మార్చాలి

పశువుల ఆస్పత్రుల రూపురేఖలను సమూలంగా మార్చేయాలి. పాఠశాలలు, పీహెచ్‌సీల తరహాలోనే నాడు-నేడు కార్యక్రమం కింద వీటిని చేపట్టాలి. ప్రతి పశువుల ఆస్పత్రిలో అత్యాధునిక సౌకర్యాలు కల్పించాలి. అధునాతన పరికరాలు అందుబాటులోకి తేవాలి. మండలం యూనిట్‌గా ప్రతి చోటా వెటర్నరీ వైద్య సదుపాయాలు ఉండేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలి. వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలపై నిరంతరం సమీక్ష చేయాలి. రెండో విడతలో మంజూరు చేసిన వాహనాలను అక్టోబరులో ప్రారంభానికి సిద్ధం చేయాలి.

ఏపీ మద్యం విధానం సరైనదే

- స్పష్టం చేసిన 'కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా'
- ఆ సంఘం వేసిన కేసును మూసివేస్తున్నట్లు ప్రకటన
- సంఘం ఆరోపణలను సమర్థంగా తిప్పికొట్టిన బెవరేజస్ కార్పొరేషన్
- కొత్త మద్యం విధానం చట్ట నిబంధనలకు లోబడే ఉందని స్పష్టీకరణ
- రాష్ట్రంలో మద్యం అమ్మకాలు తగ్గాయని గణాంకాలతో సహా వివరణ



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మద్యం విధానం పూర్తి సహేతుకమైనదని కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఏక స్వామ్య విధానాలను నిరోధించేందుకు ఉద్దేశించిన 'కాంపిటీషన్ యాక్ట్ – 2002'కు అనుగుణంగానే ఉందని కూడా తేల్చి చెబుతూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దశలవారీ మద్య నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాన్ని దేశంలో ప్రముఖ విదేశీ మద్యం తయారీ కంపెనీలు వ్యతిరేకించాయి. 8 పెద్ద కార్పొరేట్ మద్యం కంపెనీలు సభ్యులుగా ఉన్న 'ఇంటర్నేషనల్ స్పిరిట్స్ – వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని 'కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా'ను ఆశ్రయించింది. ఏపీ ప్రభుత్వం మద్యం దుకాణాలను ఏపీ బెవరేజస్ కార్పొరేషన్ ద్వారా నిర్వహించడాన్ని ఆ సంఘం వ్యతిరేకించింది. మద్యం కొనుగోలు, అమ్మకాలు పూర్తిగా బెవరేజస్ కార్పొరేషన్ నిర్వహించడం కాంపిటీషన్ యాక్ట్‌కు విరుద్ధమని వాదించింది. కొత్త విధానం అమల్లోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో మద్యం విక్రయాలు తగ్గాయన్న బెవరేజస్ కార్పొరేషన్ వాదన సరికాదని కూడా చెప్పుకొచ్చాయి. ఆ సంఘం ఆరోపణలను రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్ సమర్థంగా తిప్పికొట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త మద్యం విధానం పూర్తిగా చట్ట నిబంధనలకు లోబడే ఉందని స్పష్టం చేసింది. కంపెనీల నుంచి మద్యం కొనుగోలు చేయడంతో పాటు మద్యం దుకాణాలను నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్న విధానాన్ని కూడా వివరించింది. ఈ విధానం వల్ల రాష్ట్రంలో మద్యం అమ్మకాలు తగ్గాయని గణాంకాలతో సహా వివరించింది. అన్ని కంపెనీల మద్యం బ్రాండ్లను కొంటున్నామని, వాటికి చెల్లింపులు కూడా సకాలంలో చేస్తున్నామని రికార్డులతో సహా వెల్లడించింది. బెవరేజస్ కార్పొరేషన్ బకాయిలు పెడుతోందన్న కొన్ని మద్యం కంపెనీల వాదనలో నిజం లేదని వివరించింది. ఇరు పక్షాల వాదనలను విన్న కాంపిటీషన్ కమిషన్ తన తీర్పును వెలువరించింది. ఏపీ ప్రభుత్వం, రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్ అనుసరిస్తున్న మద్యం విధానం చట్ట నిబంధనలకు అనుగుణంగానే ఉందని తీర్పులో స్పష్టం చేసింది. బెవరేజస్ కార్పొరేషన్ చేసుకున్న మద్యం సరఫరా ఒప్పందాలు అన్నీ చట్టానికి లోబడే ఉన్నాయని చెప్పింది. బెవరేజస్ కార్పొరేషన్ మద్యం డిమాండ్‌ను కృత్రిమంగా సృష్టిస్తోందన్న అభియోగాలు నిరాధారమని వెల్లడించింది. 'ఇంటర్నేషనల్ స్పిరిట్స్ – వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' లేవనెత్తిన అభ్యంతరాలు హేతుబద్ధంగా లేవని చెప్పింది. అందువల్ల ఈ కేసును మూసివేస్తున్నట్టు ప్రకటించింది.

వరల్డ్ టూరిజం డే వేడుకలను ప్రారంభించిన సీఎం



క్యాంపు కార్యాలయంలో విజిట్ ఆంధ్రప్రదేశ్ - 2023 బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి,అమరావతి: వరల్డ్ టూరిజం డే-2022 వేడుకలను మంగళవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధిలో భాగంగా విజిట్ ఆంధ్ర ప్రదేశ్-2023 క్యాంపెయిన్‌ను ప్రారంభించిన అనంతరం క్యాంపెయిన్ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఏపీలో సులువుగా పర్యాటక ప్రదేశాలను గుర్తించేందుకు వీలుగా రూపొందించిన జీఐఎస్ వెబ్‌పోర్టల్‌నూ సీఎం ప్రారంభించారు. అరకు నుంచి వచ్చిన గిరిజన ధింసా నృత్య కళాకారులతో ముచ్చటించారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



గంగమ్మ తల్లి దేవాలయంలో హారతి తీసుకుంటున్న సీఎం జగన్. చిత్రంలో ఎమ్మెల్యే భూమన



తిరుమలలో అర్చకుల ఆశీర్వాదాలు అందుకుంటున్న సీఎం జగన్. చిత్రంలో డిప్యూటీ సీఎం కొట్టు



భక్తిశ్రద్ధలతో స్వామివారికి నమస్కరిస్తున్న సీఎం

శ్రీవారి సేవలో సీఎం

▶ మొదటి పేజీ తరువాయి

వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, అశ్వ, గజరాజులు వెంటరాగా ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. బలిపీఠానికి, ధ్వజస్తంభానికి మొక్కుకుని వెండివాకిలి మీదుగా బంగారువాకిలి చేరుకుని గరుడాళ్వార్‌ను దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి సన్నిధిలో అర్చకులకు పట్టువస్త్రాలను అందజేసి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు స్వామి వైభవాన్ని తెలియజేయగా జీయర్లు శేషవస్త్రంతో సీఎంను సత్కరించారు. అనంతరం వకుళమాతను దర్శించుకున్న ముఖ్యమంత్రి ప్రదక్షిణగా ఆనందనిలయంపై ఉన్న విమాన వేంకటేశ్వరస్వామిని, సబేరా, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామిని దర్శించుకున్నారు. హుండీలో కానుకలు సమర్పించి రంగనాయకుల మండపానికి చేరుకున్న ఆయనకు వేదపండితులు చతుర్వేద ఆశీర్వచనం అందజేశారు. టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి.. శ్రీవారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీవారి ఆలయంలో బియ్యాన్ని తులాభారంగా సమర్పించారు. 2023 శ్రీవారి కేలండర్, డైరీ, టేబుల్ కేలండర్లను, అగ్గిపెట్టెలో పెట్టిన చీరను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. తరువాత శ్రీవారి వాహన మండపానికి చేరుకున్న సీఎం.. పెద్దశేష వాహన సేవలో పాల్గొన్నారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని దర్శించుకున్నారు. అనంతరం పద్మావతి అతిథిగృహానికి చేరుకున్నారు.

అభిమానం.. అభివాదం

శ్రీవారి దర్శనానంతరం ఆలయం వెలుపలకు చేరుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వాహన మండపానికి వెళ్తున్న సమయంలో అక్కడ ఉన్న వారికి అభివాదం చేశారు. కొందరు భక్తులు సీఎంను చూసిన ఆనందంలో సీఎం సార్, సీఎం సార్ అంటూ కేకలు వేశారు. వారందరికీ అదే అభిమానంతో రెండుచేతులతో నమస్కరిస్తూ ఆయన ముందుకు సాగారు.



తిరుమలలో బియ్యాన్ని తులాభారంగా సమర్పిస్తున్న సీఎం జగన్. చిత్రంలో సుబ్బారెడ్డి, మంత్రి రోజా

ముందు తిరుపతి గంగమ్మను దర్శించుకున్న సీఎం

ఆచారాలు, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 400 ఏళ్ల ప్రాచీన సంప్రదాయాన్ని పునరుద్ధరించారు. తిరుమల శ్రీవారికి చెల్లెలుగా భావించే తిరుపతిలోని శ్రీతాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్న తర్వాతే భక్తులు తిరుమల శ్రీవారిని దర్శించుకునే సంప్రదాయం 900 ఏళ్లుగా ఉన్నట్లు చరిత్ర ఉంది. కాలక్రమేణా 400 ఏళ్ల నుంచి ఈ సంప్రదాయం కనుమరుగైంది. ఈ విషయాన్ని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ముఖ్యమంత్రికి వివరించారు. ఘనచరిత్ర కలిగిన అమ్మవారి ఆలయ సంప్రదాయాన్ని పునరుద్ధరించేందుకు సీఎం శ్రీకారం చుట్టారు. శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు తిరుమల వెళుతూ ముందుగా శ్రీతాతయ్యగుంట గంగమ్మ దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అఖిలాండం వద్ద కొబ్బరికాయ కొట్టి అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమతో కూడిన సారెను సమర్పించారు. దర్శనానంతరం అర్చకులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ సందర్శన పుస్తకంలో సీఎం సంతకం చేశారు.

సీఎం జగన్‌కు ఘన స్వాగతం

తిరుమల శ్రీవారికి పట్టువస్త్రాలను సమర్పించేందుకు తిరుపతి చేరుకున్న సీఎం వైఎస్ జగన్‌కు రేణిగుంట విమానాశ్రయం, తాతయ్యగుంట గంగమ్మ ఆలయం, అలిపిరి, తిరుమల పద్మావతి అతిథిగృహం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన వారిలో టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, లోక్‌సభ ప్యానల్ స్పీకర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎంపీలు గురుమూర్తి, రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, డీసీసీబీ చైర్మన్ రెడ్డమ్మ, ఎమ్మెల్యేలు భూమన కరుణాకర రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆదిమూలం, మేడా మల్లికార్జునరెడ్డి, కిలివేటి సంజీవయ్య, వరప్రసాద్, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, టీటీడీ జేఈవో సదాభార్గవి, ఆర్టీసీ ఈడీలు గోపీనాథరెడ్డి, కృష్ణమోహన్, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్ర నారాయణ, కమిషనర్ అనుపమ అంజలి, తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, జిల్లా దేవదాయశాఖ అధికారి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిరుమలలో మోకాళ్లపై కూర్చుని ధ్వజస్తంభానికి మొక్కుతున్న సీఎం వైఎస్ జగన్

ఎలక్ట్రికల్ బస్సులు ప్రారంభం

అనంతరం తిరుపతి-తిరుమల మధ్య నడిపే పది ఎలక్ట్రికల్ బస్సులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అలిపిరిలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రిక్ బస్సు ప్రత్యేకతలను ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు, చైర్మన్ మల్లికార్జునరెడ్డి సీఎంకు వివరించారు. ఒలెక్ట్రా కంపెనీ నుంచి వంద ఎలక్ట్రికల్ బస్సులు రానున్నాయని తెలిపారు. 50 బస్సులను తిరుపతి-తిరుమల, 14 బస్సులను రేణిగుంట-తిరుమల, 12 బస్సులను తిరుపతి-మదనపల్లి, 12 బస్సులను తిరుపతి-కడప, 12 బస్సులను తిరుపతి-నెల్లూరు మధ్య నడపనున్నట్టు చెప్పారు.



తిరుపతి-తిరుమల మధ్య నడిపే ఎలక్ట్రికల్ బస్సులను అలిపిరిలో జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం జగన్


THE RAMCO CEMENTS LIMITED
RAMCO
ప్రారంభోత్సవం
రామ్‌కో వారి అత్యాధునిక
కొలిమిగుండ్ల సిమెంట్ ప్లాంట్
శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారు
గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
ప్రారంభిస్తారు
శ్రీ. పి.ఆర్. వెంకట్రామ రాజా గారు
మేనేజింగ్ డైరెక్టర్, రామ్‌కో సిమెంట్స్ లిమిటెడ్
సమక్షంలో
28 సెప్టెంబర్ 2022 ఉదయం 10.30 గంటలకు
కల్వటాల గ్రామం, కొలిమిగుండ్ల మండలం,
నంద్యాల జిల్లా, ఆంధ్రప్రదేశ్.
జయంతిపురం ఇంటిగ్రేటెడ్ సిమెంట్ ప్లాంట్ 30 లక్షల టన్నులు
విశాఖపట్నం గ్రైండింగ్ యూనిట్ 20 లక్షల టన్నులు
కొలిమిగుండ్ల ఇంటిగ్రేటెడ్ సిమెంట్ ప్లాంట్ 30 లక్షల టన్నులు
ఆంధ్రప్రదేశ్‌లో, మొత్తం సామర్థ్యం 80 లక్షల టన్నులు
రామ్‌కో సిఎస్ఆర్ కార్యకలాపాలు రాష్ట్ర అభివృద్ధికి అనుబంధంగా నిలుస్తాయి
ఆంధ్రప్రదేశ్‌కి
ధన్యవాదములు!
RAMCO
CEMENT



మూర్ఖులతో సాంగత్యం తగదు. వృద్ధులు, స్వార్థపరులు, కలహ స్వభావం ఉన్నవారితో కలిసి నడవటం కంటే ఒంటరిగా జీవితాన్ని సాగించడమే మంచిది.

– గౌతమ బుద్ధుడు

సాక్షి

బుధవారం, సెప్టెంబర్, 28

సెల్ఫ్‌గోల్ రాజకీయం!

రౌతు మెత్తనైతే గుర్రం మూడు కాళ్ళ మీద పరిగెడుతుంది! కాంగ్రెస్‌లో పరిస్థితి ఇప్పుడు అదే! కొన్నేళ్ళుగా రాష్ట్రం వెంట రాష్ట్రంగా అధికారం చేజార్చుకుంటూ, దేశ రాజకీయ పటంపై పట్టు కోల్పోతున్న పార్టీలో ఇప్పుడు అధిష్ఠానంపై అనుయాయుల ధిక్కార స్వరం గట్టిగా వినపడుతోంది. ఆదివారం రాజస్థాన్‌లో 90 మందికి పైగా అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామా అస్త్రంతో అధిష్ఠానాన్ని బెదిరించినంత పనిచేయడం అందుకు తాజా ఉదాహరణ. ఆ రాష్ట్ర సీఎం అశోక్ గెహ్లోత్‌ను జైపూర్ నుంచి తప్పించి, ఢిల్లీలో పార్టీ అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టి కథ నడపాలనుకున్న అధినేత్రి సోనియా గాంధీ పరివారానికి ఇది అనూహ్య పరిణామం. నలభయ్యేళ్ళుగా నమ్మినబంటు అనుకున్న వ్యక్తి జైపూర్ నుంచి ఢిల్లీకి రావడానికి తలాయించడం ఒక ఎత్తైతే, అధిష్ఠానం అనుకుంటున్న సచిన్ పైలట్ వద్దనీ, తమ వాడే కొత్త సీఎం కావాలనీ అతని అనుయాయులే 'క్రమశిక్షణా రాహిత్యం'తో ప్రవర్తించడం మరో ఎత్తు. రానున్న పార్టీ ప్రెసిడెంట్ ఎన్నికలపై దృష్టి పెట్టాల్సిన పెద్దలు తీరా షోకాజ్ నోటీసులతో ధిక్కార తుపానును నియంత్రించే పనిలో పడాల్సి వచ్చింది.

కొన్నేళ్ళుగా దేశరాజకీయాల్లో తన ఉనికినీ, ప్రాసంగికతనూ నిలబెట్టుకోవడం కోసం కిందా మీదా పడుతున్న కాంగ్రెస్‌కు ఇది కష్టకాలం. కాంగ్రెస్ ఇప్పుడు ఒంటరిగా పాలిస్తున్న రాష్ట్రాలు రెండే – రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్. అక్కడ కూడా క్షేత్రస్థాయిలో ఆ పార్టీకి బోలెడన్ని సమస్యలున్నాయని తాజా ఉదంతం మరోసారి స్పష్టం చేసింది. చిత్రం ఏమిటంటే – ప్రతిచోటా ప్రత్యర్థుల కన్నా స్వపక్షీయులతోనే కాంగ్రెస్ కకావికలవుతోంది. ప్రతిసారీ తన వేలితోనే తన కళ్ళు పొడుచుకుంటోంది. దశాబ్దాలుగా పార్టీలో అనేక హోదాలు అనుభవించి, క్లిష్టసమయంలో పార్టీ జాతీయ అధ్యక్ష పగ్గాలు పట్టుకొమ్మంటే, తానింకా రాజస్థాన్ సీఎం కుర్చీనే పట్టుకొని వేళ్ళాడాలనుకుంటున్నట్టు 3 సార్లు ముఖ్యమంత్రి అయిన 71 ఏళ్ళ గెహ్లోత్ ప్రవర్తించడం విడ్డూరం. అంతా అనుకుంటున్నట్టు జరిగితే నేడో రేపో పార్టీ మొత్తానికీ పెద్ద అనిపించుకోవాల్సిన నేత చివరకు పైలట్‌తో పాత లెక్కలు తేల్చుకోవాలనుకోవడం, ఢిల్లీ వెళ్ళినా జైపూర్ తన గుప్పెట్లోనే ఉండాలనుకోవడం స్థాయికి తగిన పని కాదు.

సీఎం పీఠం కోసం రెండేళ్ళ క్రితం కొద్దిమంది ఎమ్మెల్యేలతో కలసి, పార్టీపై తిరుగుబాటుకు సిద్ధపడిన సచిన్ పైలట్ కూడా తక్కువ తినలేదు. అప్పట్లో బీజేపీలోకి దూకడానికీ సిద్ధమై, రాహుల్ తదితరుల బుజ్జగింపుతో ఆఖరికి ఆగిన చరిత్ర ఆయనది. ఉపముఖ్యమంత్రి పదవి, పార్టీ పీసీసీ పీఠం పోయినా, సీఎం కుర్చీపై ఆశతోనే ఆయన పళ్ళబిగువున పార్టీలో కథ నడుపుతున్నారు. గెహ్లోత్ ఢిల్లీకి వెళితే, ముఖ్యమంత్రి అవుతానన్న ఆయన ఆశలు ఇప్పుడు ఎంత వరకు ఫలిస్తాయన్నది చెప్పలేం. పార్టీపై పట్టు సడలిన అధిష్ఠానమేమో మనిషికో మాట ఇచ్చినా, ఇప్పుడేమో ఏదీ నెరవేర్చలేని దుఃస్థితిలో పడిపోయింది. ఈ క్షణంలో గెహ్లోత్ వైపు మొగ్గితే, వచ్చే ఏడాది డిసెంబర్‌లో ఎన్నికలు జరగాల్సిన రాజస్థాన్‌లో పైలట్ పక్క పార్టీల వైపు చూసే ప్రమాదం ఉంది.

అవునన్నా, కాదన్నా రాజస్థాన్‌లో సంక్షోభానికి గెహ్లోత్ ఎంత కారణమో, అధిష్ఠానమూ అంతే కారణం. ఒకప్పటిలా శాసనసభా పక్ష అభిమతాన్ని పెడచెవినపెట్టి, తమ ఆదేశాన్ని వారిపై రుద్దాలనుకోవడం పార్టీ పెద్దల అపరాధం. కళ్ళూ చెవులూ విప్పార్చుకొని, క్షేత్రస్థాయి పరిస్థితులు తెలుసుకోలేని చేతకానితనం. పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో ఇప్పటి దాకా కనీసం పైకి తటస్థంగా ఉన్నట్టు కనిపించాలని గాంధీ పరివారం చూసింది. తీరా రాజస్థాన్ రగడతో ఆ వ్రతాన్ని వదిలేయాల్సి వచ్చింది. ఒకపక్క అధిష్ఠానానికి మింగుడుపడని 'జీ–23' బృందంలో ఒకరైన శశిథరూర్ నామినేషన్ వేస్తున్నారు. మరోపక్కన తాజా రాజస్థాన్ ఘటనలతో గెహ్లోత్ బదులు బరిలోకి దింపేందుకు తమ మాట వినే మరో విశ్వాసపాత్రుడు ఎవరా అని అధిష్ఠానం ఆలోచించాల్సిన పరిస్థితి వచ్చింది.

రాష్ట్రాల్లో వివిధ వర్గాల మధ్య సయోధ్య కోసం అలవిమాలిన వాగ్దానాలిచ్చి, ఆఖరుకు బొక్కబోర్లాపడడం అధిష్ఠానానికి అలవాటుగా మారింది. పంజాబ్‌లో అప్పటి సీఎం అమరీందర్ సింగ్, సిద్ధూల విషయంలో అదే జరిగింది. అసెంబ్లీ ఎన్నికలలో పంజాబ్ చేజారింది. వచ్చే ఏడాదే ఎన్నికలు జరిగే కర్ణాటక, ఛత్తీస్‌గఢ్‌లలో సైతం పార్టీ అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతోంది. ప్రతిచోటా గ్రాండ్ ఓల్డ్ పార్టీ పెద్దలకు 'కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం' పరిస్థితి. దృఢమైన నిర్ణయాలు తీసుకోలేక, తీసుకున్న నిర్ణయాలతో వచ్చిపడ్డ సంక్షోభాలను పరిష్కరించలేక అధిష్ఠానం చేష్టలుడిగి చూస్తోంది. ఇప్పటికే పలువురు సీనియర్లు పార్టీని వీడారు.

ఇప్పుడు పార్టీలో అందరూ తమ మాట వినేలా చేయాలంటే, వ్యక్తిగత ఛరిష్మాతో ఎన్నికల్లో సాధించే ఓట్లు, గెలిచే సీట్లే గాంధీ పరివారానికి కీలకం. పార్టీ కిరీటాన్ని ప్రస్తుతానికి కాదన్న రాహుల్ ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్న 'భారత్ జోడో యాత్ర'తో ఆ పనిలోనే ఉన్నట్టు కనిపిస్తోంది. అయితే, అత్యధిక శాతం యువతరం ఉన్న దేశంలో ఏడెనిమిది పదుల వయసు నిండిన నేతలతోనే ఇప్పటికీ రాజకీయం నెరపాలనుకోవడం కాంగ్రెస్ చేస్తున్న తప్పిదం. యువతరంతో అనుబంధం పెంచుకోవడానికి ఆ పార్టీ శ్రమించాలి. పార్టీలోనూ, పాలిస్తున్న రాష్ట్రాల్లోనూ యువతరానికి పగ్గాలిచ్చి, కొన్నేళ్ళుగా తాము చెబుతున్నది చేతల్లో చూపాలి. నాలుగేళ్ళ క్రితం రాజస్థాన్ ఎన్నికల్లో గెలిచినప్పుడే ఆ పని చేసి ఉంటే, ఇవాళ ఈ పరిస్థితి వచ్చేది కాదేమో! రోజుకో రంగు మారుతున్న రాజస్థాన్ రాజకీయం అధిష్ఠానానికి చెబుతున్న పాఠమిదే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, తిథి: శు.తదియ రా.1.44 వరకు
తదుపరి చవితి, **నక్షత్రం:** చిత్త ఉ.7.35 వరకు
తదుపరి స్వాతి, **వర్జ్యం:** ప.1.07 నుండి 2.43 వరకు
దుర్ముహూర్తం: ప.11.29 నుండి 12.16 వరకు
అమృతఘడియలు: రా.10.33 నుండి 12.06 వరకు.

సూర్యోదయం : 5.53
సూర్యాస్తమయం : 5.51
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

ఏది సంస్కృతి? ఏది విశ్వాసం?

విశ్లేషణ



కొమ్మినేని శ్రీనివాసరావు

ఎన్.టి.ఆర్. ఆరోగ్య విశ్వవిద్యాలయానికి పేరు మార్చడంపై భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. ఆయన పేరు కొనసాగించాలని కోరవచ్చు. కాని అతిగా ప్రభుత్వంపై, జగన్‌పై విమర్శలు చేయడం ద్వారా తమ పాత చరిత్ర అంతటినీ ప్రజల ముందుకు మరోసారి తెచ్చుకుని తెలుగుదేశం పార్టీ సెల్ఫ్ గోల్ చేసుకున్నట్లయింది. ఎన్.టి.ఆర్. పేరు మార్చితేనే సంస్కృతి నాశనమైతే.. ఎన్.టి.ఆర్. పదవినే మార్చేసిన తెలుగుదేశం పార్టీ ఆ సంస్కృతిని చంపేసిందని బాలకృష్ణ ఒప్పుకుంటున్నట్లేగా? ఇక విశ్వాసం మాటకు వస్తే.. తనకు జన్మనిచ్చిన ఎన్.టి.ఆర్.కు బాలకృష్ణ ఎంత విశ్వాసపాత్రుడుగా ఉన్నారు? బావ చంద్రబాబుతో కలిసి తండ్రిని పదవి నుంచి దించేసినప్పుడు తన విశ్వాసం ఏమైంది?!

ఏపీలో ఎన్.టి.ఆర్. హెల్త్ యూనివర్సిటీ పేరును డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీగా మార్చడంపై ఎన్.టి.ఆర్. కుమారుడు, చంద్రబాబు నాయుడు వియ్యంకుడు అయిన నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యకరంగా ఉన్నాయి. ఆయన చేసిన ట్వీట్‌ని చూస్తే అసలు ఎన్.టి.ఆర్. పట్ల విశ్వాసం ఉండవలసింది వైఎస్ఆర్ కాంగ్రెస్ వారికా? తెలుగుదేశం వారికా? అన్న ప్రశ్న వస్తుంది. ఒక్కసారి బాలకృష్ణ ట్వీట్‌ను పూర్తిగా చూద్దాం. ''మార్చేయడానికి, తీసేయడానికి ఎన్.టి.ఆర్. అన్నది ఒక పేరు కాదు. అది ఒక సంస్కృతి, ఒక నాగరికత, తెలుగు జాతి వెన్నెముక. తండ్రి గద్దెనెక్కి ఎయిర్‌పోర్టు మార్చారు. కొడుకు గద్దె ఎక్కి యూనివర్సిటీ పేరు మార్చుతున్నాడు. మిమ్మల్ని మార్చడానికి ప్రజలు ఉన్నారు. పంచభూతాలు ఉన్నాయి. తస్మాత్ జాగ్రత్త. అక్కడ మహనీయుడి భిక్షతో బతుకుతున్న నేతలు ఉన్నారు. పీతలు ఉన్నారు. విశ్వాసం లేని వాళ్లను చూసి కుక్కలు వెక్కిరిస్తున్నాయి. శునకాల ముందు తలవంచుకుని బతికే సిగ్గులేని బతుకులు''.. ఇది ఆయన ట్వీట్. ఎంత అర్థరహితంగా ఉంది!

ఎన్.టి.ఆర్. పేరు మార్చితేనే సంస్కృతి నాశనమైతే.. ఎన్.టి.ఆర్. పదవినే మార్చేసిన తెలుగుదేశం పార్టీ ఆ సంస్కృతిని చంపేసిందని బాలకృష్ణ ఒప్పుకుంటున్నట్లేగా? ఎన్.టి.ఆర్.ను పదవి నుంచి దించివేసినందుకు, ఆయనపై చెప్పులు వేసినందుకు టీడీపీ నేతలు కనీసం క్షమాపణ చెప్పకపోతే పోయె, బాధపడినట్లు అయినా ఎక్కడైనా చెప్పారా! ఎన్.టి. రామారావు హృదయ విదారకంగా అందరి ముందు విలపించినప్పుడు; తనను తన పిల్లలు, అల్లుళ్లు కలిసి దారుణంగా అవమానించారని కుమిలిపోయినప్పుడు వీరంతా అధికారం లాగేసుకున్నామని పకపకా నవ్వుకున్నారే... అదేనా సంస్కృతి! ఎన్.టి.ఆర్. వేదనతో మరణించినప్పుడు ఆయన అభిమానులు బాధపడ్డారు కాని ఆయన కుటుంబంగా భావించేవారిలో కొంతమంది లక్ష్మీపార్వతి వర్గంతో గొడవ పడడానికే ప్రాధాన్యం ఇచ్చారు! ఆమెపై రకరకాల వదంతులు సృష్టించే పనిలో పడ్డారు! చివరికి అక్కడ కూడా చెప్పులు విసురుకున్నారు. ఇదా తెలుగు జాతి సంస్కృతి?

తండ్రి గద్దెనెక్కి ఎయిర్ పోర్టు పేరు మార్చారని పరోక్షంగా వైఎస్ రాజశేఖరరెడ్డిని విమర్శించారు. ఎయిర్‌పోర్టు పేరు వ్యవహారం కేంద్రం పరిధి లోనిది. పోనీ బాలకృష్ణ చేసిన విమర్శ కరెక్టే అనుకున్నా, 2014 నుంచి నాలుగేళ్లపాటు కేంద్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉందే.. అప్పుడు అశోక్ గజపతిరాజు కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నారు కదా! మరి ఎందుకు మళ్లీ శంషాబాద్ విమానాశ్రయంలో డొమెస్టిక్ టెర్మినల్‌కు ఎన్.టి.ఆర్.పేరు పెట్టలేదు? అంటే వారికి ఈ విషయంలో చిత్తశుద్ధి లేనట్లే కదా! పోనీ విజయవాడ విమానాశ్రయానికి అయినా



ఎందుకు ఆయన పేరు పెట్టలేదు? రాజధాని ప్రాంతానికి ఎన్.టి.ఆర్. సిటీ అని పేరు పెట్టాలని సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి... ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుకు లేఖ రాసినప్పుడు ఏమి చేశారు? బుచ్చయ్య చౌదరిపైనే ఫైర్ అయ్యారు తప్ప ఎన్.టి.ఆర్. పేరు పెట్టారా? రామోజీ ఆదేశాల మేరకు చంద్రబాబు అమరావతి అనే పేరు పెట్టారు. అంటే రామోజీకి ఇచ్చిన విలువ ఎన్.టి.ఆర్.కు చంద్రబాబు ఇవ్వలేదనే కదా? ఎన్.టి.ఆర్.కు వ్యతిరేకంగా 1995 ప్రాంతంలో 'ఈనాడు' దారుణమైన కార్టూన్లు వేస్తే బాలకృష్ణ కాని, ఆయన సోదరులు కాని ఎవరైనా ఇదేమిటి అని ప్రశ్నించారా? తనను తన కుటుంబ సభ్యులు పట్టించుకోవడం లేదని లక్ష్మీపార్వతిని ఎన్.టి.ఆర్. వివాహమాడితే ఆయనతో తగాదా పెట్టుకున్నది ఎవరు? అధికారం వచ్చాక లక్ష్మీపార్వతితో ఆదరణగా ఉన్నట్లు నటించింది ఎవరు? ఎన్.టి.ఆర్. మరణం తర్వాత ఆమెను ఎన్.టి.ఆర్. కుటుంబ సభ్యులు ఎవరైనా పట్టించుకున్నారా? ఆమె ఉంటున్న ఇంటి నుంచి ఆమెను తరిమేశారే! మరి ఇదంతా తెలుగు జాతి సంస్కృతి, నాగరికత అని అనుకోవాలా?

''ఆ మహనీయుడు పెట్టిన భిక్షతో బతుకుతున్న నేతలు, పీతలు ఉన్నారు. విశ్వాసం లేని వాళ్లను చూసి కుక్కలు వెక్కిరిస్తున్నాయి. శునకాల ముందు తలవంచుకుని బతికే సిగ్గులేని బతుకులు..'' అని బాలకృష్ణ నీచమైన వ్యాఖ్య చేశారు. ఇక్కడ ఒక విషయం గుర్తు చేయాలి. ఎన్.టి.రామారావు టీడీపీని స్థాపించి ప్రజలలో తిరుగుతున్నప్పుడు కాంగ్రెస్ వారిని 'కుక్కమూతి పిందెలు' అని విమర్శించేవారు. విశేషమేమిటంటే అప్పుడు ఆయన అల్లుడు చంద్రబాబు నాయుడు కూడా కాంగ్రెస్‌లో మంత్రిగా ఉండేవారు. ఎన్.టి.ఆర్. తన అల్లుడు మినహా మిగిలిన కాంగ్రెస్ వారికి ఆ తిట్టు వర్తిస్తుందని చెప్పలేదు. పోనీ బాలకృష్ణ చెప్పినట్లు చేరిన పార్టీలోనే ఉండడమే విశ్వాసం అయితే, తొలుత అది వర్తించవలసింది చంద్రబాబుకే కదా! రాజకీయ భిక్ష పెట్టిన కాంగ్రెస్‌ను కాదని, తన ఓటమి తర్వాత మామ ఎన్.టి.ఆర్. స్థాపించిన తెలుగుదేశం పార్టీలోకి జంప్ చేశారు కదా.

మరి దానిని బాలకృష్ణ ఏమని అంటారు? ఆ మాటకు వస్తే తనకు జన్మనిచ్చిన ఎన్.టి.ఆర్.కు ఆయన ఎంత విశ్వాసపాత్రుడుగా ఉన్నారు? బావ చంద్రబాబుతో కలిసి ఆయనను పదవి నుంచి దించేసినప్పుడు తన విశ్వాసం ఏమైంది? అప్పుడు కుక్కలు వెక్కిరించలేదా? వాటి ముందు తెలుగుదేశం నేతలు ఎవరూ తలదించుకుని సిగ్గు లేకుండా బతకలేదా? తన సోదరి పురందేశ్వరి కాంగ్రెస్‌లోకి వెళ్లి కేంద్ర మంత్రి పదవులు అలంకరించారే... తదుపరి ఆమె బీజేపీలో ఎలా చేరారు? దీనిని విశ్వాసమే అంటారా? తన బావ దగ్గుబాటి వెంకటేశ్వరరావుకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తామని ఆశ చూపి, ఎన్.టి.ఆర్.కు వ్యతిరేకంగా జరిగిన కుట్రలో భాగస్వామిని చేశారే... తీరా చంద్రబాబు సీఎం అయ్యాక దగ్గుబాటిని పరాభవించి బయటకు పంపేశారే... మరి బాలకృష్ణకు విశ్వాసం ఏమైంది?

ఎన్.టి.ఆర్. పట్ల అందరికీ గౌరవం ఉంది. పేరు మార్చడానికి ముఖ్యమంత్రి జగన్ తన కారణాన్ని వివరించారు. తమకు ఎన్.టి.ఆర్. అవసరం లేదని, ఆయనకు విలువలు లేవని చంద్రబాబు అన్న విషయాన్ని గుర్తు చేసుకుంటే, జగన్ చాలా పద్ధతిగా మాట్లాడారు. తనకు ఎంతో గౌరవం ఉంది కనుకే ఒక జిల్లాకు ఎన్.టి.ఆర్. పేరు పెట్టానని అన్నారు. అలా పేరు పెట్టినప్పుడు బాలకృష్ణ కనీసం స్వాగతించలేక పోయారే? నిజానికి ఎన్.టి. రామారావు, తెలుగుదేశం పార్టీ కాంగ్రెస్‌కు ప్రత్యర్థులు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు అయితే ఎన్.టి.ఆర్.తో అసలు సంబంధమే లేదు. ఆ విషయాన్ని కూడా గమనించాలి. ఎన్.టి.ఆర్. పేరు మార్చితేనే మొత్తం జాతి అంతా తల్లకిందులవుతున్నట్లుగా టీడీపీ నేతలు ప్రచారం చేస్తున్నారే మరి చంద్రబాబు టైమ్‌లో రాజీవ్ ఆరోగ్యశ్రీ పేరును మార్చి ఎన్.టి.ఆర్. పేరు పెట్టలేదా? రాజీవ్ పేరు మార్చినప్పుడు దేశానికి అంతటికీ అవమానం జరిగినట్లు అనుకోవాలా? తెలంగాణలో ఎన్.టి.ఆర్. హెల్త్ యూనివర్సిటీ పేరు తొలగించి కాళోజీ నారాయణరావు పేరు పెట్టినప్పుడు టీడీపీ వారు, బాలకృష్ణ వంటి వారు కనీసం నోరెత్తి ఎందుకు మాట్లాడలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆ మాటకు వస్తే కాకాని వెంకటరత్నం పేరుతో ఉన్న మెడికల్ కాలేజీని యూనివర్సిటీగా మార్చినప్పుడు ఆయన పేరును ఎన్.టి.ఆర్. ఎందుకు తొలగించారు?

తెలుగుదేశం వారికి ఎన్.టి.ఆర్.పేరును వాడుకునే అర్హత లేదన్నది వాస్తవం. ఎన్.టి.ఆర్. తన అల్లుడు చంద్రబాబు నాయుడును దూషిస్తూ, 'ద్రోహి, ఔరంగజేబు కన్నా నీచం' అని అన్నారు. అలా తన తండ్రి దూషణలకు గురైన చంద్రబాబుకు అత్యంత విశ్వాసపాత్రుడుగా, విధేయుడుగా బాలకృష్ణ వ్యవహరించడం ఏమి సంస్కృతి అన్నదానికి ముందుగా ఆయన వివరణ ఇచ్చి, ఆ తర్వాత ఎదుటివారిపై వ్యాఖ్యలు చేస్తే మంచిది.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

వెళితే తెలుస్తుంది



మీరెందుకు పర్యటించాలంటే పర్యటన మీ జీవితాన్ని విధేయపరుస్తుంది. ప్రపంచంలో మీరెంత చిన్న స్థానానికి పరిమితమై ఉన్నారో మీరు తెలుసుకునేలా చేస్తుంది.

– కెప్టెన్ మీనూ బేణీవాల్, నేషనలిస్ట్

చెత్త మాటలు



రష్యన్ స్కూల్‌లో 15 మందిని చంపిన సాయుధుల టీ షర్ట్‌ల మీద స్వస్తిక్ గుర్తు ఉందని ప్రముఖ గార్డియన్ పత్రిక రాసింది. అది స్వస్తిక్ గుర్తు కాదు. నాజీల గుర్తు హాకెన్‌క్రూజ్. మహాశయా! మీ సంపాదక బృందానికి చెప్పండి. ఇలాంటి చెత్తమాటలు రాసేముందు ఒకటికి రెండుసార్లు సంబంధిత పుస్తకాలను రిఫర్ చేసుకొమ్మని!

– సిన్హా, పొలిటికల్ అబ్జర్వర్

పొడిగించండి



వరదలున్నాయి. పోర్టల్ సమస్యలు ఉన్నాయి. పండుగలు వస్తున్నాయి. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని టాక్స్ ఆడిట్ రిపోర్ట్, ఐ.టి.ఆర్. రిటర్న్ సమర్పించేందుకు సెప్టెంబర్ 30తో ముగియనున్న గడువును మరొక నెలపాటైనా పొడిగించడానికి ఉన్న ఇబ్బంది ఏమిటో తెలియడం లేదు. లీడర్స్‌కి, టాక్స్ ప్రొఫెషనల్స్‌కి మధ్య అనుసంధానం తెగిపోయిందా అనే అనుమానం కలుగుతోంది.

– పల్లవ్ పరాశర్, టాక్స్ సర్వీసెస్ ప్రొవైడర్

మీ ఇంట్లో పడేస్తే?!



ప్రియమైన మిత్రులారా నేడిది (27) ప్రపంచ పర్యాటక దినం. మీరు పర్యటనలో ఉన్నప్పుడు రైల్వే ట్రాక్ మీద, రోడ్డు పైన ఆహార పదార్థాలను, రేపర్‌లను విసిరేయకండి. అది వన్యప్రాణులను ఆకర్షిస్తుంది. అవి బయటికి వచ్చి ప్రమాదాలకు గురవుతాయి. అవి కూడా తమ వ్యర్థాలను మీ ఇంటిలో పడేసి వెళ్లిపోతే మీకెలా ఉంటుంది? బాధ్యతాయుతమైన పర్యాటకుల్లా ఉండండి.

– ప్రవీణ్ కస్వాన్, ఐ.ఎఫ్.ఎస్.

తొలి 'ఫాల్కే'



ఇంతా చేసి ఆశా పరేఖ్ 'దాదాసాహెబ్ ఫాల్కే' అవార్డు పొందిన 7వ మహిళ మాత్రమే. ఒక విశేషం అయితే లేకపోలేదు. ఫాల్కే అవార్డును నెలకొల్పాక తొలిసారిగా ఈ అవార్డు ఒక మహిళకే దక్కింది! ఆమె దేవికారాణి (1969).

– ప్రియా నేగీ, 'ఇండియా టుడే' జర్నలిస్ట్

వాళ్లకీ నచ్చింది!



జపాన్‌లో 'సూపర్ 30' చిత్రం (భారత్‌లో 2019లో విడుదలైంది) 50 నగరాలలోని సినిమా హాళ్లలో సబ్ టైటిల్స్‌తో విడుదలైంది. నేను టోక్యోలోని షింజుకు పికాడిలీ థియేటర్‌కు చేరుకున్నప్పుడు షో హౌస్‌ఫుల్‌గా ఉంది. ప్రదర్శన తర్వాత వీక్షకుల నుంచి నిజంగా అద్భుతమైన స్పందన వచ్చింది.

– ఆనంద్ కుమార్, 'సూపర్ 30' స్కూల్ ఫౌండర్

ఎలాంటి మనిషి!



ఒక వీడియో క్లిప్ తాజాగా వైరల్ అవుతోంది. ముంబైలో అంబానీ ఇల్లు కట్టుకున్న స్థలం వక్ఫ్‌బోర్డ్‌కు చెందినదనీ, తాము అధికారంలోకి వస్తే ఆ స్థలాన్ని తిరిగి ఇప్పించేస్తామనీ ఆ వీడియోలో కేజ్రీవాల్ అంటున్నారు. దేశానికి కేజ్రీవాల్ ప్రమాదకరమైన వ్యక్తిగా పరిణమించబోతున్నారా! అనుమతులు లేకుండానే అంబానీ ఆ ఇంటిని కట్టుకుని ఉంటారా!!

– వీరేంద్ర, ఆర్.ఎస్.ఎస్. కార్యకర్త

కరిమింగిన వెలగపండులా దేశ ఆర్థిక వ్యవస్థ

విశ్లేషణ



సి. రామచంద్రయ్య

దేశంలో ఈ 8 ఏళ్లల్లో బిలియనీర్ల సంఖ్య అనూహ్యంగా పెరగడం, వారి కారణంగా దేశ స్థూల ఉత్పత్తిలో పెరుగుదల కనిపించి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో భారత్ 5వ స్థానాన్ని ఆక్రమించడం ఎన్డీఏ ప్రభుత్వం ఒక ఘనతగా చెప్పుకొంటోంది. ఓ దశాబ్దం క్రితం వరకు భారత్ ఆర్థిక వ్యవస్థ 11వ స్థానంలో ఉండేది. ఇప్పుడది 5వ స్థానా నికి ఎగబాకింది. అది కూడా కోవిడ్ సృష్టించిన ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించి, అప్పటివరకు ఐదవ స్థానంలో ఉన్న బ్రిటన్‌ను వెనక్కు నెట్టి ఆ స్థానంలో నిలబడింది కనుక అది విజయంగా ఎన్డీఏ భావిస్తోంది. దేశంలో అదుపు తప్పిన ధరలు, నిరుద్యోగం, దిగుమతులలో వృద్ధి, ఎగుమతులలో క్షీణత, రూపాయి పతనం, తగ్గుతున్న విదేశీ పెట్టుబడులు... ఇన్ని సమస్యల నేపథ్యంలో దేశం ప్రపంచంలోనే 5వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్న విషయం విస్మరించరానిది.

బ్రిటన్ ఆర్థిక వ్యవస్థను భారత్ దాటడం అన్నది నిజానికి ప్రస్తుత యూరప్ సంక్షోభ పరిస్థితులలో గొప్ప విజయమేమీ కాదు. బ్రిటన్‌లో చాలాకాలంగా ద్రవ్యోల్బణం రెండంకెలు దాటింది. బ్రిటన్‌లోని అన్ని వర్గాల ఉద్యోగులు, ముఖ్యంగా రైల్వే కార్మికులు, రేవు కార్మికులు, పోస్టల్ కార్మికులు అధిక వేతనాలను డిమాండ్ చేస్తూ సమ్మె బాట పట్టారు. తమ కొనుగోలు శక్తి గణనీయంగా పడిపోయిన దృష్ట్యా వేతనాలు పెంచాలని వారు కోరుతున్నారు. ఉపాధ్యాయులు, బ్యాంకు ఉద్యో గులు, చివరకు వైట్ కాలర్ ఉద్యోగులుగా పేర్కొనదగ్గ ఉన్నత స్థాయి ఉద్యోగులు కూడా సమ్మెబాట పట్టడంతో ఇది వరకు ఎన్నడూలేని రీతిలో బ్రిటన్ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఒక్క బ్రిటన్‌లోనే కాదు.. స్పెయిన్, జర్మనీ, బెల్జియం తదితర సంపన్న యూరోపియన్ దేశాలలో పరిస్థితులు ఏమంత మెరుగ్గా లేవు. జర్మనీలో ఇటీవల పైలెట్లు సమ్మె చేయడంతో వందలాది విమానాల రాకపోకలు నిలిచిపోయి, దేశ ఆర్థిక వ్యవస్థకు తీరని నష్టం కలిగింది.

భారతదేశంలో చాలాకాలం క్రితమే పలు కార్మిక చట్టాలను రద్దు చేశారు. లాభాలలో నడుస్తున్న పబ్లిక్ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారు. అయినప్పటికీ ఇక్కడి కార్మికులు, రాజకీయ పార్టీలవారు ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు అనూహ్యంగా పెరిగినా ప్రజలు మౌనంగానే భారాన్ని మోస్తున్నారు. నిర్మాణరంగంలో ఇసుక, స్టీలు, సిమెంటు ధరలు 40 శాతం కంటే మించి పెరిగాయి. ఇక జీఎస్టీని అత్యధికంగా దాదాపు అన్ని వస్తువులపై విధించడంతో పేద ప్రజలు సైతం ధరాఘాతానికి గురవుతున్నారు. కొన్ని రకాలైన ఎరువుల ధరలు 40 నుంచి 80 శాతం మేర పెరగడంతో రైతులపై అదనపు భారం పడింది.

దేశ ఆర్థికాభివృద్ధి రేటును, స్థూల జాతీయోత్పత్తి పెరుగుదలను బ్రిటన్‌తో పోలుస్తున్న కేంద్ర ప్రభుత్వం... మానవాభివృద్ధి సూచికలలో మనం ఏ స్థానంలో ఉన్నామో ఎందుకు వెల్లడించడం లేదు? ఐక్యరాజ్య సమితి తాజాగా వెలువరించిన హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్‌లో భారత్ స్థానం 132 కాగా, బ్రిటన్‌ది 18వ స్థానం. ఐక్యరాజ్యసమితి వెల్లడించిన గణాంకాల ప్రకారం మన దేశంలో 22 శాతం ప్రజల సగటు ఆదాయం రోజుకు రూ. 160 మాత్రమే. దేశ జనాభాలో 27.9 శాతం మంది ఇంకా పేదరికంతో విలవిల లాడుతున్నారని తాజా సర్వే వెల్లడించింది. కొన్నేళ్లుగా దేశంలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. దేశంలోని 21.7 శాతం సంపద కేవలం ఒక శాతంగా ఉన్న బిలియనీర్ల చేతుల్లో ఉండగా, 19.8 శాతం సంపద మాత్రమే 40 శాతం మంది దేశ ప్రజల్లో ఉన్నట్లు సర్వేలో తేలింది. అసమానతలు అన్నవి ఆర్థికంగానే కాక ఇంకా లింగ (జెండర్) అసమానతలు, సామాజిక (సోషల్) అసమానతలు కూడా పెరుగుతున్నాయి. ఇవన్నీ నాణేనికి రెండో వైపు ఉన్న పార్శ్వం.




ఇక డాలర్‌తో రూపాయి విలువ క్షీణత ఇంత సుదీర్ఘంగా సాగడం దేశ చరిత్రలో ఎన్నడూ లేదు. ఇందుకు కారణం వాణిజ్యలోటు భారీగా పెరగడమే. గత సెప్టెంబర్‌లో 2020– 21 వాణిజ్యలోటు 11.7 బిలియన్ల డాలర్లు ఉండగా, ఈ ఆగస్ట్ 2022 నాటికి 28.7 బిలియన్ల డాలర్లకు చేరింది. అంటే లోటు వృద్ధిరేటు దాదాపు 250 శాతం. దిగుమతుల్లో వృద్ధి నానాటికీ పెరిగిపోతుండగా ఎగుమతుల వృద్ధిరేటులో క్షీణత నమోదవుతోంది. తాజా రాజకీయ కారణాలతో దేశం నుంచి ఎగుమతి అయ్యే బాస్మతియేతర, నాన్ పారాబాయిల్డ్ బియ్యంపై 20 శాతం ఎగుమతి సుంకం విధించడం ద్వారా బియ్యం ఎగుమతిని కేంద్రం నియంత్రించింది. మరోపక్క, ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్న ప్రపంచంలోని పలు దేశాలు భారత్ నుంచి ద్విచక్రవాహనాలు, ఆటో మొబైల్ విడిభాగాలు మొదలైన వాటిని దిగుమతి చేసుకోవడం నిలిపివేశాయి. దీంతో ఎగుమతుల ద్వారా లభించే విదేశీ మారక ద్రవ్య ఆదాయం తగ్గింది. కేంద్రం అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వల్ల కలుగుతున్న దుష్ఫలితాలేమిటన్నది నిజానికి ఈ ఏడాది ప్రారంభంలో వచ్చిన 'ఆర్థిక సర్వే 2022'లోనే వెల్లడైంది. అధిక ధరల కారణంగా పేద, మధ్య తరగతి ప్రజల పొదుపు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. ఒక్క ఏడాది కాలంలో, అంటే గత ఏడాదిలో ధనవంతులు 13 లక్షల కోట్ల సంపద ఆర్జించగా, 15 కోట్లమంది పేద, మధ్య తరగతి ప్రజల ఆదాయం 53 శాతం తగ్గిపోయినట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం అంచనా వేసిన విధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 8.5 శాతం ఆర్థికాభివృద్ధి రేటు సాధించాలంటే జీడీపీలో 39 శాతం పెట్టుబడులు కీలక రంగాలలో పెట్టాలి. కానీ, ఈ రంగాలలో వస్తున్న ప్రైవేటు పెట్టుబడులు ఏ మాత్రం ఆశాజనకంగా లేవు.

ఇదిలా ఉండగా, గ్రామీణ ప్రాంత ప్రజలకు మేలు చేకూర్చే 'మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం'కు కేటాయించే నిధులలో ప్రతి ఏటా కోత విధిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలకు అమలు చేస్తున్న వివిధ పథకాలలో కోత పడుతోంది. ఇదికాక, పేదలకు అందిస్తున్న గృహ నిర్మాణ పథకం మందగించింది. ఈ పరిణామాలన్నీ దేశంలోని పేదలు, దిగువ మధ్య తరగతి ప్రజల, రైతుల జీవనాన్ని దుర్భరం చేస్తున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ పైకి నిగనిగలాడుతున్నట్లు కనిపిస్తున్నా లోపల డొల్లమాదిరిగా ఉంది. మరోరకంగా చెప్పాలంటే దేశ ఆర్థిక వ్యవస్థ 'కరి మింగిన వెలగపండు'లా ఉంది.

వ్యాసకర్త శాసన మండలి సభ్యులు, ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్

'కన్యాశుల్కం' పునరుజ్జీవనం

గురజాడ వారి 'కన్యాశుల్కం' ఒక అపూర్వ నాటక శిల్పం. లెక్కలేనన్ని పునర్ముద్రణలతో ఈ నాటకం ఎప్పటికప్పుడు పునరుజ్జీవనం పొందుతూనే ఉంది. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలోని 'మానవవికాస వేదిక' కన్యాశుల్కం నాటకాన్ని తాజాగా మళ్లీ ముద్రించింది. విజయనగరంలోని గురజాడ గృహాన్ని సందర్శించే ప్రతి ఒక్క రికి కన్యాశుల్కం ప్రతిని ఉచితంగా ఇవ్వనున్నారు. ఆ ఇంటిని పర్యవేక్షిస్తున్న గురజాడ ముని మనుమడు గురజాడ వెంకటేశ్వర ప్రసాద్, వారి సతీమణి ఇందిరాదేవిలకు ఈనెల 29వ తేదీ గురువారం సాయంత్రం తిరుపతి ఆఫీసర్స్ క్లబ్ జరగనున్న సమావేశంలో 'కన్యాశుల్కం' ప్రతులను అందివ్వనున్నారు. 'కన్యాశుల్కం' నాటకాన్ని గురజాడ అసలు ఎందుకు రాశారు!? గర్భస్థ శిశువుకు కూడా బేరం పెట్టడం వంటి దారుణ స్థితిగతులు గురజాడను కలిచివేసి కన్యాశుల్కం నాటక రచనకు ప్రేరేపించాయి. ఈ దురాచారం పైన గురజాడ కత్తి దూయలేదు, దండెత్తలేదు, అవహేళన చేసి వదిలి పెట్టారు. లండన్‌లో మురికివాడల గురించి ప్రపంచ ప్రసిద్ధ నాటకకర్త జార్జ్ బెర్నార్డ్ షా 'విడోవర్స్ హౌసెస్' అన్న నాటకాన్ని రాసి 1892 డిసెంబర్ 9న ప్రదర్శించారు. దానికి నాలుగు నెలల ముందే 1892 ఆగస్టు 12వ తేదీన విజయనగరంలో 'కన్యాశుల్కం' నాటకాన్ని గుర జాడ ప్రదర్శించారు.



సమకాలీన సమస్యలపైన వచ్చిన తొలి నాటకంగా 'కన్యాశుల్కం' ప్రపంచ నాటక రంగ చరిత్రలో నిలిచిపోయింది. గిడుగు రామమూర్తికి బి.ఏ. లో సహ విద్యార్థి అయిన గురజాడ వ్యవహారిక భాషా ఉద్యమం ఊపిరి పోసుకోక ముందే, తన పాతికేళ్ల వయసులో వ్యవహారిక భాషలో 'కన్యాశుల్కం' రాసి వ్యవహారిక భాషా ఉద్యమానికి బీజం వేశారు. బ్రిటిష్ ప్రభుత్వం కన్యాశుల్కాన్ని నిషేధించకపోయినా, 1929లో బాల్య వివా హాల నిషేధ చట్టం రావడానికి 'కన్యాశుల్కం' నాటకం దోహదం చేసింది. అందుకనే ఇదొక మహా దృశ్యకావ్యంగా, తెలుగు వారి సాహిత్య వారసత్వ సంపదగా నిలిచిపోయింది.

– రాఘవ శర్మ । 94932 26180



క్యాష్ బ్యాక్ ₹5000# వరకు | జీరో డౌన్ పేమెంట్* | నో కాస్ట్ EMI* | నో హైపోథెకేషన్* | joy club | 7230032200 పై | 1. ఐయర్‌ఫోన్‌లను కనెక్ట్ చేయండి 2. QR కోడ్‌ని స్కాన్ చేయండి 3. వీడియోని ఆస్వాదించండి

Honda Motorcycle & Scooter India Pvt. Ltd., Registered Office: Plot No. 1, Sector - 03, IMT Manesar, Distt. Gurugram, (Haryana) - 122050, India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda2wheelersindia.com

#పేర్కొనబడిన క్యాష్ బ్యాక్ ఆఫర్ అనగా కనీస లావాదేవీ ₹30000(ఐడీఎఫ్ సీ ఫస్ట్ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ కోసం ₹40000) పై 5% క్యాష్ బ్యాక్ ₹5000 వరకు అని భావించాలి. ఇది కార్డ్ జారీ చేసినవారు/బ్యాంక్స్ పాలసీ ప్రకారం ఎంపిక చేయబడిన క్రెడిట్ కార్డ్ ద్వారా ఈఎంఐ లావాదేవీ పై మాత్రమే ఆఫర్ అమలవుతున్న సమయంలో ప్రతి కార్డ్ కు ఒకసారి మాత్రమే వర్తిస్తుంది. ఆఫర్ 1 జులై 2022 నుండి 30 సెప్టెంబర్, 2022 వరకు మాత్రమే చెల్లుతుంది. *ఫైనాన్స్ స్కీంస్ ఆఫర్స్ ఎంపిక చేయబడిన, ప్రాధాన్యతనిచ్చిన ఫైనాన్స్ భాగస్వాములు తమ స్వంత నిర్ణయాధికారం ప్రకారం ద్వారా ఎంపిక చేయబడిన మోడల్స్ పై ఎంపిక చేయబడిన కస్టమర్స్ వివరాలు కోసం అభిప్రాయి మరియు అసలు డౌన్ పేమెంట్ ఫైనాన్స్ కంపెనీ పాలసీకి లోబడి మారవచ్చు. ఫైనాన్స్ స్కీంస్ ఎంపిక చేసిన డీలర్ షిప్స్ వద్ద 31 అక్టోబర్, 2022 వరకు మాత్రమే లభిస్తాయి మరియు ముందుగా తెలియచేయకుండానే ఏ సమయంలోనైనా తొలగించవచ్చు. ఏ రెండు ఆఫర్స్ కూడా కలపబడవు. చిత్రంలో చూపించిన ఉత్పత్తులు మార్కెట్ లో లభించే అసలు ఉత్పత్తి కంటే వేరుగా ఉండవచ్చు. ఉత్పత్తిలో చూపించబడిన యాక్సెసరీస్ ప్రామాణిక సామగ్రిలో భాగంగా లేవు.

Honda Exclusive Authorized Dealerships: **VIZIANAGARAM:** Dadi Honda - 08922-255455, 9100914566; **BOBBILI:** Dadi Honda - 9100914561; **PARVATHIPURAM:** Dadi Honda - 9100087499; **SRIKAKULUM:** Trisha Honda - 9848156070, 9640940940, 9666918923; Lalitha Honda - 9989769553, 8498886111; **NARSANNAPETA:** T.V.K Honda - 08942-277444, 9640940972; **RAJAM:** Lalitha Honda - 9989769562; **PALAKONDA:** Lalitha Honda - 9989769583; **TEKKALI:** Trisha Honda - 9640940975; **PALASA:** Trisha Honda - 9640940975, 08945-240054; **ICHAPURAM:** Sree Venkateshwara Honda - 9603605011; **SALUR:** Syamala Honda - 9618217178; **GAJAPATHINAGARAM:** Dadi Honda - 9100798592.

For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com

జనంలోకి జిన్‌పింగ్



బీజింగ్: చైనాలో సైనిక కుట్ర అంటూ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టిన వార్తలను పటాపంచలు చేస్తూ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ మంగళవారం జనబాహుళ్యంలో ప్రత్యక్షమయ్యారు. ఉజ్బెకిస్తాన్‌లో సమర్కండ్‌లో షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీఓ) సమావేశాల తర్వాత 16న చైనాకు తిరిగొచ్చిన అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను గృహనిర్బంధంలో ఉంచి సైన్యం అధికార పగ్గాలు చేపట్టిందనే వార్తలు నాలుగైదు రోజులుగా అన్ని సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న విషయం విదితమే. ఈ వార్తలన్నీ ఉట్టి కాకమ్మ కథలే అని రుజువుచేస్తూ జిన్‌పింగ్ మంగళవారం బీజింగ్‌లో అధికార కమ్యూనిస్ట్ పార్టీ ఏర్పాటుచేసిన ఒక ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నారు. దశాబ్దకాలంలో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా సాధించిన విజయాలు, దేశ పురోగతిని ప్రతిబింబించేలా ఉన్న ప్రదర్శనను అధ్యక్షుడు జిన్‌పింగ్ తిలకించారని చైనా అధికార వార్త సంస్థ జిన్హువా తెలిపింది. జిన్‌పింగ్ వెంట దేశ ప్రధాని లీ క్వెకియాంగ్, పార్టీ కీలక నేతలు ఉన్నారు. జిన్‌పింగ్ నుంచి అధికారాన్ని సైన్యం కైవసం చేసుకుందనే వార్తలు అబద్ధమని దీంతో తేలిపోయింది. జీరో కోవిడ్ పాలసీలో భాగంగా విదేశాల నుంచి వచ్చిన ప్రతీ ఒక్కరూ ఏడు రోజుల పాటు క్వారంటైన్‌లో ఉండాలనే నిబంధనను జిన్‌పింగ్ కూడా పాటించారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

క్లుప్తంగా...

సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ దీపాంకర్ దత్తా

బాంబే హైకోర్టు సీజే పేరు సిఫార్సు చేసిన కొలీజియం

సాక్షి, న్యూఢిల్లీ: బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తాను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించాలంటూ కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. సీజేఐ జస్టిస్ యు.యు.లలిత్ నేతృత్వంలోని కొలీజియం సోమవారం సమావేశమై ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకు రాష్ట్రపతి ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. సుప్రీంకోర్టులో ప్రస్తుతం సీజేఐ సహా 29 మంది న్యాయమూర్తులున్నారు. గరిష్ట సంఖ్య 34. కోల్‌కతాకు చెందిన జస్టిస్ దత్తా 1965లో జన్మించారు. 1989లో కలకత్తా విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బీ పూర్తిచేశారు. పలు హైకోర్టుల్లో, సుప్రీంకోర్టులో న్యాయవాదిగా చేశారు. రాజ్యాంగపరమైన, సివిల్ కేసులు వాదించడంలో దిట్టగాపేరొందారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరఫు న్యాయవాదిగా పనిచేశారు. 2006లో కలకత్తా హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2020 ఏప్రిల్ 28న బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన తండ్రి జస్టిస్ సలీల్ కుమార్ దత్తా కూడా కలకత్తా హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు.

ఈడబ్ల్యూఎస్ కోటాపై సుప్రీంకోర్టు తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ: విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఆర్థికంగా వెనకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్)కు 10 కోటా కల్పిస్తూ చేసిన 103 రాజ్యాంగ సవరణ చట్టబద్ధతపై దాఖలైన దాదాపు 40కిపైగా పిటిషన్లపై సుప్రీంకోర్టులో వాదనలు ముగిశాయి. దీనిపై తీర్పును రిజర్వ్‌లో ఉంచుతున్నట్లు సీజేఐ జస్టిస్ యూయూ లలిత్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం పేర్కొంది. 50 శాతం జనరల్ కోటాలో ఈడబ్ల్యూఎస్‌కు 10 శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని సీనియర్ లాయర్లు రవి వర్మ కుమార్, పి. విల్సన్ సహా పలువురు లాయర్లు కోర్టులో వాదించారు. ఈడబ్ల్యూఎస్‌కు ఆర్థికపరిస్థితినే గీటురాయిగా తీసుకోకూడదని తమిళనాడు తరఫున హాజరైన సీనియర్ లాయర్ శేఖర్ నఫడే వాదించారు. వీటిని అటార్నీ జనరల్ వేణుగోపాల్, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తోసిపుచ్చారు.

లక్ష మంది రష్యా వీడారు

తలిన్ (ఎస్తోనియా): ఉక్రెయిన్‌తో యుద్ధం కోసం భారీగా సైన్యాన్ని సమీకరించాలన్న రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆదేశాల నేపథ్యంలో తమను నిర్బంధంగా చేర్చుకుంటారన్న భయంతో మాజీ సైనికులు, యువకులు భారీగా దేశం వీడుతున్నారు. వారం రోజుల్లో ఏకంగా 98,000 మంది కజకిస్తాన్ చేరారు. మరికొందరు జార్జియా, మంగోలియా తదితర దేశాలకు వెళ్లిపోతున్నారు. నడిచి, సైకిల్‌పై, కారులో, అద్దె వాహనంలో, విమానాల్లో... ఇలా ఎలా కుదిరితే అలా వెళ్లిపోతున్నారు. దాంతో మైళ్ల కొద్దీ ట్రాఫిక్ స్తంభించిన చిత్రాలను ప్రైవేట్ శాటిలైట్ సంస్థలు విడుదలచేశాయి.

నలుపని వేధిస్తున్నాడని... భర్తను నరికి చంపింది!

దుర్గ్: నల్లగా ఉన్నావంటూ తరచూ ఎగతాళి చేస్తున్న భర్తను ఆగ్రహంతో ఓ భార్య గొడ్డలితో నరికి చంపేసింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దుర్గ్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పటన్ ప్రాంతంలో అమ్లేశ్వర్ గ్రామానికి చెందిన అనంత్ సోన్వానీ(40) అందంగా లేవంటూ తన భార్య సంగీత(30)ను నిందించేవాడు. నల్లగా ఉన్నావంటూ ఎగతాళి చేస్తుండేవాడు. దాంతో సోమవారం రాత్రి తీవ్ర ఆగ్రహంతో సంగీత గొడ్డలితో అనంత్‌ను నరికి చంపింది.

గ్రహశకలాల్ని ఇక దారి మళ్లించగలం!

నాసా ప్రయోగం దిగ్విజయం
- గ్రహశకలాన్ని ఢీకొట్టిన ఉపగ్రహం
- అసాధారణ విజయమిది: నాసా
- అంతరిక్ష సవాళ్లను ఎదుర్కోవడంలో అతి పెద్ద ముందడుగు: శాస్త్రవేత్తలు



వాషింగ్టన్: అంతరిక్ష సవాళ్లను దీటుగా ఎదుర్కొనే దిశగా కీలక ముందడుగు పడింది. భూమిని ఢీకొట్టే ఆస్కారమున్న గ్రహశకలాలను దారి మళ్లించి మానవాళికి ముప్పును తప్పించగలమన్న భరోసా ఏర్పడింది. భూమికి సుదూరంగా ఉన్న ఓ గ్రహశకలాన్ని ఉపగ్రహంతో ఢీకొట్టించే లక్ష్యంతో నాసా చేపట్టిన డబుల్ ఆస్టిరాయిడ్ రీడైరెక్షన్ టెస్ట్ (డార్ట్) విజయవంతమైంది. ఇందుకోసం 10 నెలల క్రితం ప్రయోగించిన 570 కిలోల ఉపగ్రహం లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించింది. భూమికి 108 కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉన్న డైమోర్ఫస్ అనే బుల్లి గ్రహశకలాన్ని ముందుగా నిర్దేశించిన మేరకు మంగళవారం తెల్లవారుజామున గంటకు 22,530 కిలోమీటర్ల వేగంతో ఢీకొట్టింది. దాంతో నాసా ప్రధాన కార్యాలయంలో పండుగ వాతావరణం నెలకొంది. శాస్త్రవేత్తలంతా పరస్పరం అభినందనలు తెలుపుకుంటూ సందడి చేశారు. అన్ని అంచనాలనూ అధిగమిస్తూ ప్రయోగం దిగ్విజయంగా ముగిసిందని నాసా ప్రకటించింది. అంతరిక్షంలో అతి చిన్న శకలాన్ని కూడా అత్యంత కచ్చితత్వంతో ఢీకొట్టేలా ఉపగ్రహాలను సంధించగలమని రుజువైందని నాసా సైన్స్ మిషన్ డైరెక్టరేట్ అసోసియేట్ అడ్మినిస్ట్రేటర్ థామస్ జుర్బుచెన్ అన్నారు. కెనైటిక్ ఇంపాక్ట్ టెక్నిక్ సాయంతో జరిగిన ఈ ప్రయోగం భూగోళ పరిరక్షణలో అతి పెద్ద ముందడుగని నాసా అడ్మినిస్ట్రేటర్ బిల్ నెల్సన్ చెప్పారు. ''నిన్నామొన్నటిదాకా శాస్త్ర సాంకేతిక కల్పనగా తోచిన విషయం ఒక్కసారిగా వాస్తవ రూపు దాల్చింది. నమ్మశక్యం కానంతటి ఘనత ఇది. భావి అంతరిక్ష ప్రమాదాల బారినుంచి భూమిని కాపాడుకోవడానికి ఒక చక్కని దారి దొరికినట్టే'' అంటూ హర్షం వెలిబుచ్చారు.



డైమోర్ఫస్‌ను ఉపగ్రహం ఢీకొట్టేందుకు కేవలం 43 సెకన్ల ముందు తీసిన ఫొటో

ప్రభావం తేలేందుకు మరికొన్ని సమయం...

డిడిమోస్ అనే మరో చిన్న గ్రహశకలం చుట్టూ డైమోర్ఫస్ తిరుగుతోంది. దాని వేగాన్ని తగ్గించడం ద్వారా కక్ష్యలో కొద్దిపాటి మార్పు తీసుకురావడం ఈ ప్రయోగ ప్రధాన లక్ష్యం. అది నెరవేరిందీ లేనిదీ నిర్ధారించుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా పలుచోట్ల నుంచి శక్తిమంతమైన టెలిస్కోప్‌ల ద్వారా నాసా బృందం డైమోర్ఫస్‌ను కొద్ది వారాల పాటు నిరంతరం గమనిస్తుంది. డార్ట్‌క్రాఫ్ట్ ఢీకొట్టడం వల్ల డైమోర్ఫస్ కక్ష్య కనీసం ఒక్క శాతం కుంచించుకుపోతుందని అంచనా వేస్తోంది. ఆ లెక్కన డిడిమోస్ చుట్టూ అది పరిభ్రమించే సమయం 10 నిమిషాల దాకా తగ్గాలి. డిడిమోస్ జోలికి వెళ్లకుండా డైమోర్ఫస్‌ను మాత్రమే అత్యంత కచ్చితత్వంతో ఢీకొట్టడం మామూలు విజయం కాదని థామస్ చెప్పారు. ఇందుకోసం అత్యాధునిక డ్రాకో నావిగేషన్ పరిజ్ఞానాన్ని ఉపయోగించారు.

నియో... డార్ట్ వారసుడు

డార్ట్ ప్రయోగం సఫలమవడంతో భూమికి అంతరిక్ష ముప్పును పసిగట్టి నివారించే ప్రయోగాల పరంపరలో తదుపరి దశకు నాసా తెర తీస్తోంది. డార్ట్ ప్రాజెక్టుకు కొనసాగింపుగా నియర్ అర్త్ ఆబ్జెక్ట్ (నియో) సర్వేయర్ పేరుతో రెండో దశ ప్లానెటరీ డిఫెన్స్ మిషన్‌ను రూపొందిస్తోంది. దీన్ని త్వరలో పట్టాలపైకి ఎక్కించనున్నట్టు నాసా ప్లానెటరీ డిఫెన్స్ ఆఫీసర్ లిండ్లీ జాన్సన్ ప్రకటించారు. భూమికి సమీపంలో ఉన్న ప్రమాదకర గ్రహశకలాలను కనిపెట్టి వాటితో భవిష్యత్తులో ముప్పు రాకుండా ముందే జాగ్రత్త పడటం దీని లక్ష్యమన్నారు.

కాంగ్రెస్‌లో ఎడారి తుఫాన్

రాజస్తాన్ ఉదంతంలో అధిష్టానం తప్పటడుగులు

- గెహ్లాట్‌ను ముందే ఒప్పించడంలో సీనియర్ నేతల వైఫల్యం
- సజావుగా సాగాల్సిన ప్రక్రియ పెద్ద సంక్షోభంగా మారింది

ఎస్.రాజమహేంద్రారెడ్డి



చిన్న చిన్న సమస్యలను సంక్లిష్టం చేసి పీకల మీదికి తెచ్చుకోవడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య. గోటితో పోయేదానికి గొడ్డలిదాకా తెచ్చుకోవడమంటే ఇదే! ఏఐసీసీ అధ్యక్ష ఎన్నికలతో రాజస్తాన్ రాజకీయాలు ముడిపడటం.. వైరి వర్గాలు తెగేదాకా లాగడం కాంగ్రెస్ పార్టీ గందరగోళ వ్యవహార శైలికి తాజా మచ్చుతునక.

ఆదిలోనే తప్పటడుగు...

కాంగ్రెస్ అధ్యక్ష అభ్యర్థిగా రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లాట్‌ను ఎంచుకోవడం వెనక ఉన్న అజెండాను సరైన రీతిలో స్పష్టీకరించడంలోనే అధిష్టానం తప్పటడుగు వేసింది. దాంతో ఆదిలోనే హంసపాదులా నామినేషన్లకు ముందే ఎడారిలో తుపానును తలపిస్తూ పరిస్థితి చేయిదాటిపోయింది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజస్తాన్ రాజకీయాల్లో చాపకింద నీరులా ఉన్న అసంతృప్తి జ్వాలను చల్లార్చేందుకు అధిష్టానం చేసిన ప్రయత్నం వికటించింది. అనుభవజ్ఞుడైన గెహ్లాట్‌కు జాతీయ అధ్యక్ష పదవి ఆశచూపి యువ సచిన్ పైలట్‌ను సీఎంగా చేయాలన్నది పార్టీ పెద్దల యోచన. అప్పుడు ఇద్దరికీ సమ న్యాయం చేసినట్టవుతుందని అధిష్టానం భావించింది. కానీ ఇదే విషయాన్ని గెహ్లాట్‌కు స్పష్టంగా చెప్పే విషయంలో అధిష్టానంతో పాటు అగ్ర నాయకులు మీనమేషాలు లెక్కపెట్టి అనవసర ఊహాపోహలకు తావిచ్చారు. రాజస్తాన్‌ను వదలడం సుతరామూ ఇష్టంలేని గెహ్లాట్‌కు ఇది రుచించలేదు. తప్పదంటే తన సన్నిహితునికే సీఎం పదవి కట్టబెట్టాలన్నది ఆయన ఆలోచన. దాంతో గెహ్లాట్ బల ప్రదర్శనకు దిగారు!

అస్పష్టత... అయోమయం

రాజస్తాన్ రాజకీయ యవనికపై ఆదివారం జరిగిన హైడ్రామా అటు అధిష్టానాన్నీ, ఇటు గెహ్లాట్‌నూ ఇరుకున పెట్టింది. రాజీనామాల వరద ఇద్దరినీ పీకల్లోతు ముంచేసింది. హైకమాండ్ హైకమాండే గనుక ఏం చేసినా చెల్లుతుంది. గెహ్లాట్ పరిస్థితే ఎటుకాకుండా త్రిశంకు స్వర్గంలో వేలాడుతోంది. అధ్యక్ష పదవిని హుందాగా అంగీకరించి, అనుచరులను సముదాయించి అధిష్టానం మాట జవదాటకుండా ఒప్పించగలిగితే తప్ప గెహ్లాట్ ఇప్పుడు రాజకీయ కుర్చీలాటలో ఏ కుర్చీ దొరక్క కిందపడిపోవాల్సి వస్తుందనేది నిపుణుల అంచనా. గెహ్లాట్‌ను కేవలం మధ్యేమార్గంగా అధ్యక్ష అభ్యర్థిగా ఎంచుకున్నారే తప్ప నిజానికి కాంగ్రెస్‌లో సీనియర్లకు, అనుభవజ్ఞులకు కొదవలేదు. చిదంబరం, దిగ్విజయ్ సింగ్, కమల్‌నాథ్ నుంచి సుశీల్ కుమార్ షిండే దాకా చాలామంది ఉన్నారు. అధిష్టానం చెబితే బరిలోకి దిగడానికి వీరంతా సిద్ధంగానే ఉన్నారు.

వరుస తప్పిదాలు...

కాంగ్రెస్ అధ్యక్ష పదవికి బహుముఖ పోరు అనివార్యమైన పక్షంలో గాంధీల ఆశీస్సులు లేకుండా గెలవడం అసాధ్యమని అందరికీ తెలుసు. అంతేగాక అధిష్టానం చల్లని చూపు ఎవరిపై ఉంటే వారి వైపే రాజస్తాన్ ఎమ్మెల్యేలు ఉండటమూ తప్పనిసరే. ఈ నేపథ్యంలో గెహ్లాట్ గనక అధిష్టానం అసంతృప్తికి లోనయితే సీఎం పదవికి దూరం కావాల్సి వస్తుంది. దాదాపు ఐదు దశాబ్దాల కింద కాంగ్రెస్‌తో జతకట్టిన గెహ్లాట్ తన రాజకీయ జీవితంలో ఏనాడూ హైకమాండ్‌ను ధిక్కరించలేదు. పార్టీ కష్టకాలంలోనూ విధేయతను స్పష్టంగా చాటుకున్నారు. కాంగ్రెస్ రాజకీయంగా 2014 నుంచి క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటూ వస్తున్నప్పటికీ సీనియర్లకు, విధేయులకు సమున్నత రీతిలో అన్ని అవకాశాలు కల్పించింది. ఈ క్రమంలో కొందరు సీనియర్లను, విధేయులను కోల్పోయింది కూడా! కానీ పంజాబ్‌లో దెబ్బతిన్న తర్వాత కూడా అధిష్టానం తీరు మార్చుకోకపోవడం దాని కార్యనిర్వహణ సామర్థ్యాన్ని ప్రశ్నార్థకం చేసే పరిణామమే. రాజస్తాన్ రాజకీయ పరిస్థితిని అనవసరంగా చేయి దాటనిచ్చి, ఇప్పుడు దిద్దుబాటుకు దిగడమే ఇందుకు తార్కాణం. ఈ ఎపిసోడ్‌లో తప్పంతా 10–జన్‌పథ్‌దేనన్నది కొందరి వాదన. సీనియర్ నాయకుల్లో జవాబుదారీతనం లేకపోవడం పెద్ద మైనస్‌పాయింటని మరికొందరి వాదన. రాజస్తాన్ విషయంలోనైతే ఇది మరీ కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. ఆదివారం పార్టీ ఎమ్మెల్యేల రాజీనామాకు ముందు అందరినీ సీఎల్పీ సమావేశానికి తీసుకొచ్చేలా గెహ్లాట్‌కు నచ్చజెప్పడంలో ఖర్గే, మాకెన్ విఫలమయ్యారు. భేటీకి పీసీసీ చీఫ్ గోవింద్‌సింగ్ గైర్హాజరయ్యారు. ఇంత గందరగోళం మధ్య ముఖ్యమంత్రిని, పీసీసీ చీఫ్‌ను దారిలోకి తెచ్చేందుకు క్రమశిక్షణ మార్గదర్శకాలు జారీ చేయడంలో పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ వైఫల్యం ఆశ్చర్యకరం. రాజీనామాలు జరిగిన ఆదివారం రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య ఆయన గనక పరిస్థితిని చాకచక్యంగా చక్కబెట్టి ఉంటే విషయం ఇంతదాకా వచ్చేది కాదు. ఎమ్మెల్యేలకు వారి ఇష్టాయిష్టాలను వెల్లడించే స్వేచ్ఛ ఎప్పుడైనా ఉంటుంది. కానీ వారిని సముదాయించే పాత్రను నిర్వర్తించడంలో సీనియర్ల వైఫల్యం స్పష్టంగా కన్పిస్తోంది. పైగా, ఇంత జరిగినా అధిష్టానం మనోగతం మేరకు ఎమ్మెల్యేలను ఏకతాటిపై నడిపించడంలో విఫలమైన గెహ్లాట్‌కు గానీ, పీసీసీ చీఫ్‌కు గానీ కనీసం షోకాజ్ నోటీసు కూడా ఇవ్వకపోవడం గమనార్హం.

ఎలా ముగుస్తుందో...!

రాజస్తాన్‌లో వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందే పైలట్‌ను రాజస్తాన్ సీఎంగా చూడాలన్నది అధిష్టానం ప్రధానోద్దేశం. ఒకరకంగా ఇది గతంలో చేసిన తప్పును చాలా ఆలస్యంగా సరిద్దుకునే ప్రయత్నమే. పైలట్ 2014 నుంచి నాలుగేళ్లు పీసీసీ చీఫ్‌గా పార్టీని సజావుగా నడిపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించారు. దాంతో ఆయన్నే సీఎం చేస్తారని అంతా భావించారు. కానీ అనూహ్యంగా ఆ సమయంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న గెహ్లాట్‌కు సీఎం పదవి దక్కింది. అంటే తెర వెనక ఎంత లాబీయింగ్ జరిగిందో ఊహించుకోవచ్చు. రెండు ముక్కల్లో చెప్పాలంటే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాగానే పైలట్ నేరుగా రాహుల్ నివాసానికి వెళ్లి కలిస్తే గెహ్లాట్ అదే సమయంలో అహ్మద్ పటేల్ నివాసానికి వెళ్లి భేటీ అయ్యారు. అలా మొదలైన లాబీయింగ్ తారస్థాయికి చేరింది. చివరికి అహ్మద్ పటేల్ మాటే చెల్లింది. గెహ్లాట్ సీఎం అయ్యారు. పైలట్ వంటి యువకున్ని సీఎం చేయాలని భావించిన రాహుల్ ఆ తర్వాత గెహ్లాట్ వైపు మొగ్గడంగమనార్హం. సోనియా, ప్రియాంక ఒత్తిడి మేరకు ఉప ముఖ్యమంత్రి పదవి తీసుకునేందుకు పైలట్ అయిష్టంగానే ఒప్పుకున్నారు. ఆ తప్పిదాన్ని ఇప్పుడు దిద్దుకునేందుకు అధిష్టానం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. పైగా గెహ్లాట్ సారథ్యంలో వెళ్తే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గడం కష్టమని సర్వేల్లోనూ తేలింది. దాంతో పైలట్‌కే రాష్ట్ర పగ్గాలు అప్పగించాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది.



మహిళలను వస్తువుల్లా... చూస్తున్న బీజేపీ

రిసెప్షనిస్ట్ హత్యపై రాహుల్ ధ్వజం

మలప్పురం: మహిళలను ఒక వస్తువుగా చూసే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ల భావజాలం ఉత్తరాఖండ్‌లో రిసెప్షనిస్ట్ హత్య ఘటనతో తేటతెల్లమైందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర 20వ రోజు మంగళవారం మలప్పురం జిల్లాలో ప్రవేశించింది. తచ్చింగనాదం హైస్కూల్ వద్ద ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా అంకితకు నివాళులర్పిస్తూ మౌనం పాటించారు. రిసెప్షనిస్ట్ అంకితా భండారి హత్యోదంతంతో బీజేపీ నేత కుమారుడికి సంబంధముందన్న ఆరోపణలపై రాహుల్ స్పందించారు. 'చెప్పినట్లు వినలేదనే అంకితను చంపేశారు. మహిళలకు బీజేపీ ఇచ్చే గౌరవమిదే. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ మహిళలను వస్తువులుగా రెండో తరగతి పౌరులుగా చూస్తున్నాయి. ఇది సిగ్గుచేటు. మహిళలను గౌరవించని, సాధికారిత కల్పించని దేశం ఏమీ సాధించలేదు' అని ఆయన అన్నారు. 'బీజేపీ నాయకులకు కావాల్సింది అధికారం. అధికారం దక్కాక, దానిని నిలుపుకునేందుకు ఏదైనా చేస్తారు. ఆ క్రమంలోనే అంకిత హత్యకు గురైంది'అని రాహుల్ వ్యాఖ్యానించారు. మహిళలను చిన్నచూపు చూడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సాగనివ్వబోమనే హెచ్చరికను బీజేపీకి పంపాలని కోరారు. 'జస్టిస్ ఫర్ అంకిత, జస్టిస్ ఫర్ ఇండియన్ ఉమెన్, బీజేపీ సే బేటీ బచావో' అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు.

గెహ్లాట్ వర్గం ధిక్కారంపై... అధిష్టానానికి నివేదిక

న్యూఢిల్లీ/జైపూర్: రాజస్తాన్ కాంగ్రెస్ రాజకీయ రగడ అధిష్టానం కోర్టుకు చేరింది. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ వర్గానికి చెందిన 82 మంది ఎమ్మెల్యేల రాజీనామాలు, ధిక్కార ప్రదర్శనపై సోనియా గాంధీ తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చడం తెలిసిందే. పార్టీ పరిశీలకులుగా రాజస్తాన్ వెళ్లి పరిస్థితిని చక్కదిద్దేందుకు విఫలయత్నం చేసిన మల్లికార్జున ఖర్గే, అజయ్ మాకెన్‌లను ఆదివారం నాటి పరిణామాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. 82 మంది ఎమ్మెల్యేలు సీఎల్పీ భేటీకి మూకుమ్మడిగా డుమ్మా కొట్టడం, సమాంతరంగా మరో సమావేశం నిర్వహించకోవడమే గాక గెహ్లాట్ ప్రత్యర్థి సచిన్ పైలట్‌ను సీఎం చేయొద్దంటూ అధిష్టానానికే షరతులు విధించడం తెలిసిందే. దీనిపై ఖర్గే, మాకెన్ మంగళవారం సాయంత్రం సోనియాకు నివేదిక సమర్పించారు. ''ఇది క్షమించరాని క్రమశిక్షణారాహిత్యం. ఇందుకు బాధ్యులను చేస్తూ మంత్రులు శాంతీ ధరీవాల్, మహేశ్ జోషీ, ఎమ్మెల్యే ధర్మేంద్ర రాథోడ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలి'' అని సిఫార్సు చేశారు. దాంతో కాంగ్రెస్ క్రమశిక్షణ సంఘం వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. 10 రోజుల్లోగా బదులివ్వాలని ఆదేశించింది. సీఎల్పీకి డుమ్మా కొడుతూ ఎమ్మెల్యేలు నిర్వహించిన సమాంతర సమావేశం గెహ్లాట్‌కు తెలిసే జరిగిందని కూడా నివేదిక పేర్కొంది. కానీ ఆయనపై చర్యలకు మాత్రం సిఫార్సు చేయకపోవడం గమనార్హం. కానీ ఈ ఎపిసోడ్ నేపథ్యంలో ఆయన్ను అధ్యక్ష ఎన్నిక బరిలో దింపాలన్న ఆలోచనను కూడా అధిష్టానం విరమించునేలా కన్పిస్తోంది. మరోవైపు సచిన్ పైలట్ మంగళవారం ఢిల్లీ చేరుకున్నారు. తమ భేటీ అధిష్టానంపై ఒత్తిడి తెచ్చేందుకు కాదని మహేశ్ జోషీ చెప్పుకొచ్చారు. ''కేవలం మా అభిప్రాయాలు అధిష్టానం దాకా చేరాలన్నదే భేటీ ఉద్దేశం. మేం పార్టీకి విధేయులగా లేని పక్షంలో ప్రభుత్వం ఎప్పుడో పడిపోయేది'' అన్నారు. రాజస్తాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసే కుట్ర జరుగుతోందని, దీని వెనక బీజేపీ ఉందని మంత్రి ప్రతాప్‌సింగ్ ఆరోపించారు. ఈడీ, ఐటీ, సీబీఐ బృందాలు ఇప్పటికే రాష్ట్రంలోకి దిగడమే ఇందుకు నిదర్శనమన్నారు.

బరిలోకి బన్సల్?

కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ అథారిటీ చైర్మన్ మధుసూదన్ మిస్త్రీ మంగళవారం సాయంత్రం సోనియాతో భేటీ అయ్యారు. అధ్యక్ష ఎన్నికలో పాల్గొనేందుకు క్యూఆర్ కోడ్‌తో కూడిన ఐడెంటిటీ కార్డును ఆమెకు అందజేశారు. తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ సెప్టెంబర్ 30న నామినేషన్ దాఖలు చేసే అవకాశముందని అనంతరం మీడియాకు చెప్పారు. ఏఐసీసీ కోశాధికారి పవన్ బన్సల్ కూడా నామినేషన్ పత్రాలు తీసుకున్నట్టు వెల్లడించారు. అది స్వయంగా బరిలో దిగేందుకా, ఇతరుల కోసమా అన్నది తెలియాల్సి ఉందంటూ ముక్తాయించారు. అంతేగాక గెహ్లాట్ బరిలో దిగుతున్నదీ లేనిదీ కూడా తనకు తెలియదన్నారు. అనంతరం బన్సల్ స్పందిస్తూ తాను అధ్యక్ష రేసులో లేనని చెప్పారు.

భారత్–జపాన్ మైత్రి బలోపేతానికి... అబే కృషి ప్రశంసనీయం: మోదీ

టోక్యో: భారత్‌తో జపాన్ సంబంధాల బలోపేతానికి ఆ దేశ దివంగత ప్రధాని షింజో అబే ఎనలేని కృషి చేశారని భారత ప్రధాని మోదీ అన్నారు. ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జపాన్‌కు సుదీర్ఘ కాలం ప్రధానిగా చేసిన అబే (67) జూలై 8న ఎన్నికల ప్రచారంలో ఓ వ్యక్తి కాల్పుల్లో మృతి చెందడం తెలిసిందే. మంగళవారం ప్రభుత్వ లాంఛనాలతో టోక్యోలో జరిగిన అంత్యక్రియల్లో మోదీ పాల్గొన్నారు. అనంతరం అబే భార్య అకీ అబేతో భేటీ అయ్యారు. అంతకుముందు జపాన్ ప్రధాని ఫ్యుమియో కిషిదాతో మోదీ సమావేశమయ్యారు. ఇరు దేశాల వ్యూహాత్మక, అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. వచ్చే ఏడాది జీ–7 సదస్సుకు జపాన్, జీ–20 భేటీకి భారత్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్నాయి. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నేతలు నిర్ణయించారు.



షింజో అబేకు నివాళులర్పిస్తున్న మోదీ

జపాన్‌లో చక్రవర్తి కుటుంబీలకు మాత్రమే అధికారికంగా అంత్యక్రియలు జరుగుతాయి. కానీ సుదీర్ఘ కాలం సేవలందించినందుకు గుర్తింపుగా అబే అంత్యక్రియలను అధికారికంగా నిర్వహించారు. అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ సహా 20 మందికి పైగా దేశాధినేతలు హాజరయ్యారు.

పీఎఫ్ఐపై మళ్లీ దాడులు

ఏడు రాష్ట్రాల్లో 170 మందికి పైగా అరెస్ట్

న్యూఢిల్లీ: దేశంపై అతివాద విషాన్ని చిమ్ముతోందంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)పై దర్యాప్తు సంస్థలు మరోసారి కొరడా ఝులిపించాయి. మంగళవారం ఉత్తరప్రదేశ్, కర్ణాటక, గుజరాత్, ఢిల్లీ, మహారాష్ట్ర, అస్సాం, మధ్యప్రదేశ్‌ల్లో ఏకకాలంలో సోదాలు చేశాయి. పీఎఫ్ఐ సభ్యులకు చెందిన ప్రాంతాల్లో ఆకస్మిక దాడులు చేశాయి. 170 మందికిపైగా వ్యక్తులను అదుపులోకి తీసుకున్నాయి. అదుపులోకి తీసుకున్న వారిపై ఆరునెలలుగా నిఘా ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అవాంఛనీయ ఘటనలను అడ్డుకునేందుకే అరెస్ట్ చేసినట్లు వివరించాయి. లష్కరే తొయిబా, అల్‌ఖైదా వంటి ఉగ్రసంస్థలతో సంబంధాలున్నాయనే ఆరోపణలపై దేశవ్యాప్తంగా పీఎఫ్ఐ ఆఫీసులు, సభ్యుల సంబంధ కార్యాలయాల్లో ఐదు రోజుల క్రితం జరిపిన మూకుమ్మడి దాడుల్లో ఏకంగా 106 మందిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ తరహాలోనే మంగళవారమూ దేశ వ్యాప్తంగా దాడులు జరిగాయి.

అసలైన శివసేన ఎవరిదో తేల్చేది... ఎన్నికల సంఘమే: సుప్రీం

ఉద్ధవ్ వర్గానికి ఎదురుదెబ్బ



న్యూఢిల్లీ : శివసేనలో చీలికల అనంతరం అసలైన పార్టీ తనదేనంటూ చేస్తున్న న్యాయ పోరాటంలో మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి సుప్రీంకోర్టులో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. పార్టీ, ఎన్నికల గుర్తు విల్లు బాణాలు ఎవరికి చెందుతాయో నిర్ణయించే అధికారం కేంద్ర ఎన్నికల సంఘానికి ఉందని రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం తీర్పు చెప్పింది. తమ వర్గాన్నే అసలు సిసలైన శివసేనగా గుర్తించాలంటూ ఈసీకి సీఎం ఏక్‌నాథ్ షిండే వర్గం చేసిన విజ్ఞప్తిని పరిశీలించడానికి అనుమతినిచ్చింది. చీలిక వర్గం ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకి సంబంధించిన అంశం కొలిక్కి వచ్చేవరకు అసలైన సేన ఎవరిదో నిర్ణయించకుండా ఈసీని అడ్డుకోవాలంటూ ఠాక్రే వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఈసీ విచారణపై ఎలాంటి స్టే ఇవ్వడం లేదని జస్టిస్ డి.వై. చంద్రచూడ్, జస్టిస్ ఎమ్ఆర్ షా, జస్టిస్ కృష్ణ మురారి, జస్టిస్ హిమా కొహ్లి, జస్టిస్ పి.ఎస్. నరసింహలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. షిండే శివసేన సభ్యుడే కారని ఉద్ధవ్ వర్గం తరఫున సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ వాదించారు. ప్రాథమిక సభ్యత్వాన్ని కూడా వదులుకున్న ఆయనదే అసలైన పార్టీ అంటే ఈసీ ఎలా విచారణ చేపడుతుందని ప్రశ్నించారు. ఎవరి వైపు ఎక్కువ మంది ఎమ్మెల్యేలున్నారో చూసి నిర్ణయం తీసుకునే హక్కు ఈసీకి ఉందని షిండే వర్గం తరఫున అడ్వకేట్ ఎన్ కె కౌల్ వాదించారు. షిండే గత జూన్‌లో కొందరు ఎమ్మెల్యేలతో కలిసి తిరుగుబాటు చేసి ఉద్ధవ్ ప్రభుత్వాన్ని గద్దె దింపారు. బీజేపీ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 55 మంది శివసేన ఎమ్మెల్యేల్లో 40 మంది షిండేకు మద్దతిచ్చారు. 18 మంది ఎంపీల్లోనూ 12 మంది షిండేవైపే ఉన్నారు. కనుక తమదే అసలైన శివసేనగా గుర్తించాలంటూ ఆయన కోర్టును ఆశ్రయించారు. మరోవైపు పార్టీ కోసం, గుర్తు కోసం చేస్తున్న పోరాటంలో తామే నెగ్గుతామని ఉద్ధవ్ ధీమా వ్యక్తం చేశారు.

మెజార్టీ ప్రకారమే నిర్ణయం: ఈసీ

అసలైన శివసేన ఎవరిదో తేల్చేందుకు మెజార్టీ నిబంధనల విధానాన్ని అనుసరిస్తామని కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి రాజీవ్ కుమార్ తెలిపారు. అత్యంత పారదర్శకంగా ఈ ప్రక్రియ సాగుతుందన్నారు. సుప్రీం తీర్పు తర్వాత ఆయన మాట్లాడారు. ''పార్టీ, ఎన్నికల గుర్తు ఎవరికి చెందాలో నిర్ణయించడానికి రాజ్యాంగబద్ధ ప్రక్రియ ఉంది. దాన్నే అనుసరిస్తాం. మెజార్టీ నిబంధనే వర్తిస్తుంది'' అని స్పష్టం చేశారు.

తొలిసారిగా ప్రత్యక్ష ప్రసారం



సుప్రీం కోర్టు చరిత్రలోనే మొట్టమొదటిసారిగా రాజ్యాంగ ధర్మాసనాల విచారణను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. వీటిని 8 లక్షల మంది వీక్షించారు. సుప్రీంలో మంగళవారం మూడు రాజ్యాంగ ధర్మాసనాలు కేసుల్ని విచారిస్తూ ఉంటే అన్నింటిని లైవ్ ఇచ్చారు. మొదటి సుప్రీం ధర్మాసనం ప్రధాన న్యాయమూర్తి యూ యూ లలిత్ నేతృత్వంలో ఆర్థికంగా బలహీన వర్గాలకు రిజర్వేషన్ల కేసుని విచారించగా, రెండో ధర్మాసనం జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలో శివసేన వెర్సస్ శివసేన కేసు విచారించింది, జస్టిస్ సంజయ్ కృష్ణన్ కౌల్ నేతృత్వంలోని మూడో బెంచ్ ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్ చెల్లుబాటుపై విచారణ జరిపింది. త్వరలోనే సుప్రీం విచారణ లైవ్ స్ట్రీమింగ్ కోసం తాము సొంతంగా ఒక మాధ్యమాన్ని ఏర్పాటు చేసుకుంటామని సీజేఐ జస్టిస్ యూ యూ లలిత్ వెల్లడించారు.

క్లుప్తంగా

పోస్టాఫీసుల్లోనూ పీసీసీ దరఖాస్తు

విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి శ్రీనివాసరావు వెల్లడి

సాక్షి, అమరావతి: పాస్‌పోర్టులకు సంబంధించిన పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్(పీసీసీ) జారీ జాప్యాన్ని నివారించేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు పాస్‌పోర్టు ప్రాంతీయ కార్యాలయాలు, సేవా కేంద్రాల్లో మాత్రమే పీసీసీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల్లో కూడా పీసీసీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీలోని అనంతపురం, చిత్తూరు, వైఎస్సార్, నెల్లూరు, గుంటూరు, గుడివాడ, ఒంగోలు, కర్నూలులోని పోస్టాఫీస్ సేవా కేంద్రాల్లో పీసీసీ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకు విదేశాంగ వ్యవహారాల శాఖ అనుమతిచ్చిందని తెలిపారు. దీనివల్ల విదేశాలకు వెళ్లే వారికి సమయం ఆదా అవుతుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని నేరుగా పోస్టాఫీస్ సేవా కేంద్రాలకు కూడా వెళ్లవచ్చన్నారు. సంబంధిత పోస్టాఫీస్‌లలో బుధవారం నుంచి పీసీసీ స్లాట్ బుకింగ్ సేవలు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఏపీకి తిరిగొచ్చిన 8 మంది మోసపోయిన కార్మికులు

సాక్షి, అమరావతి: ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన 8 మంది వలసదారులు అక్రమ ఏజెంట్ మాయమాటలు నమ్మి ఒమన్ కు వెళ్లి ఇబ్బందులు ఎదుర్కొన్న సంగతి విదితమే. వీరిని రాష్ట్రానికి తీసుకురావడానికి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏపీఎన్‌ఆర్‌టీఎస్ ఒమన్ లోని భారత రాయబార కార్యాలయాన్ని పలుమార్లు సంప్రదించింది. వసతి, ఆహార సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న వీరిని భారత్‌కు పంపాలని, అక్రమ ఏజెంట్ పై చర్యలు తీసుకోవాలని ఏపీఎన్‌ఆర్‌టీఎస్ కోరింది. ఏపీఎన్‌ఆర్‌టీ ప్రయత్నాలు ఫలించడంతో మంగళవారం 8 మంది వలస కార్మికులు విజయవాడ చేరుకున్నారు. ఈ విషయాన్ని ఏపీఎన్‌ఆర్‌టీఎస్ అధ్యక్షుడు వెంకట్ ఎస్. మేడపాటి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టెక్సాస్‌లో ముగ్గురు కృష్ణా జిల్లా వాసుల మృతి

- రోడ్డు ప్రమాదంలో డాక్టర్ శ్రీనివాస్ భార్య, ఇద్దరు కుమార్తెల దుర్మరణం
- కురుమద్దాలిలో విషాదఛాయలు



మృతులు వాణిశ్రీ, ఆమె ఇద్దరు కుమార్తెలు

పామర్రు : అమెరికాలోని టెక్సాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కృష్ణాజిల్లా పామర్రు మండలం కురుమద్దాలికి చెందిన తానా బోర్డు సభ్యుడు డాక్టర్ కొడాలి నాగేంద్ర శ్రీనివాస్ భార్య వాణిశ్రీ, ఇద్దరు కుమార్తెలు మృతి చెందారు. దీంతో కురుమద్దాలిలో విషాదఛాయలు నెలకొన్నాయి. కురుమద్దాలి గ్రామానికి చెందిన కొడాలి నాగేంద్ర శ్రీనివాస్ గుంటూరు మెడికల్ కళాశాలలో వైద్య విద్యను అభ్యసించారు. ఉన్నత చదువుల నిమిత్తం 1995లో అమెరికా వెళ్లారు. చదువు అనంతరం అక్కడే వైద్యుడిగా స్థిరపడ్డారు. పీడియాట్రిక్ కార్డియో వాస్క్యులర్ సర్జన్, అనస్థీషియాలజిస్ట్‌గా మంచి పేరుపొందారు. ఆయన భార్య వాణిశ్రీ ఐటీ ఉద్యోగి కాగా, పెద్ద కుమార్తె వైద్య విద్య, రెండో కుమార్తె 11వ తరగతి చదువుతున్నారు. కుమార్తెలు ఆదివారం కళాశాల వద్దకు వెళ్లగా, వాణిశ్రీ కారులో వారిని ఇంటికి తీసుకుని వస్తుండగా టెక్సాస్‌లోని వాలర్ కౌంటీ వద్ద వారి కారును ఓ వ్యాను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాణిశ్రీ, ఆమె ఇద్దరు కుమార్తెలు మరణించారు. భార్యాపిల్లలను కోల్పోవడంతో డాక్టర్ శ్రీనివాస్ ప్రస్తుతం షాక్‌లో ఉన్నారు. ఈ విషయం తెలిసిన కురుమద్దాలి గ్రామస్తులు విచారం వ్యక్తంచేశారు. డాక్టర్ శ్రీనివాస్ తండ్రి కొడాలి రామ్మోహన్‌రావు ప్రభుత్వ ఉద్యోగం చేసి రిటైర్ అయిన తర్వాత విజయవాడలో స్థిరపడ్డారు.

చంద్రబాబుకు నిధులిస్తే రాజధాని ఎందుకు కట్టలేదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి రూ. 6,500 కోట్లు కేంద్రం చంద్రబాబుకు ఇచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు చెప్పారు. ఆ నిధులతో రాజధానిని ఎందుకు కట్టలేదని చంద్రబాబును ప్రశ్నించారు. రాజధాని కోసం రైతులు నేడు రోడ్డుపై పాదయాత్రలు చేస్తున్నారని రైతులను రోడ్డుపై ఎవరు నడిపిస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. మంగళవారం గుంటూరులో లాడ్జి సెంటర్‌లో ప్రజా పోరు వీధి సమావేశానికి సోము వీర్రాజు హాజరయ్యారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు సింగపూర్, మలేసియా, జపాన్ అంటూ అన్ని దేశాలు తిరిగి ఏ దేశం వెళితే ఆ దేశ రాజధాని తరహాలో ఏపీకి రాజధాని నిర్మాణం చేస్తానని పలు మార్లు చెప్పారన్నారు. దేశాలు తిరిగి వేల కోట్లు ఖర్చు చేశారే తప్ప, రాజధాని కట్టలేదన్నారు.

వికేంద్రీకరణకు మద్దతుగా విద్యార్థుల ప్రదర్శన



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పీఎం పాలెం(భీమిలి): మూడు రాజధానుల ఏర్పాటుకు మద్దతుగా మంగళవారం వైఎస్సార్ క్రికెట్ స్టేడియం వద్ద విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థి జేఏసీ కన్వీనర్ కాంతారావు మాట్లాడుతూ..విశాఖను పరిపాలన రాజధానిగా నిర్ణయించడం పట్ల ఉత్తరాంధ్ర వాసులు గొప్ప అదృష్టంగా భావించాలన్నారు. టీడీపీ స్వార్థ రాజకీయాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటం చేసి పరిపాలన రాజధానిని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అమరావతి రైతులు స్వార్థ ప్రయోజనాల కోసం చేస్తున్న పాదయాత్రను పెట్టుబడులదారుల యాత్రగా అభివర్ణించారు. స్టూడెంట్స్ జేఏసీ నేతలు ధీరజ్, ప్రభాకర్ నాయుడు, భరత్, రాంబాబు, బాలాజీ, ఉదయ్, జానీ తదితరులు పాల్గొన్నారు.

3 రాజధానులకు మద్దతుగా 'విప్' ధర్మశ్రీ పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట (అనకాపల్లి జిల్లా): మూడు రాజధానులకు మద్దతుగా ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అనకాపల్లి జిల్లాలోని బుచ్చెయ్యపేట నుంచి దిబ్బిడి వరకు మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..పాలనా వికేంద్రీకరణతోనే రాష్ట్రం బాగుంటుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుంటున్న టీడీపీ నేతల పాదయాత్రను జిల్లాలో అడుగు పెట్టకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కేవలం 29 గ్రామాల అభివృద్ధి, తమ స్వ ప్రయోజనాల కోసమే టీడీపీ నేతలు అమరావతిని రాజధానిగా కోరుకుంటున్నారని మండిపడ్డారు. అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారని చెప్పారు. పాదయాత్రలో వైఎస్సార్‌సీపీ బుచ్చెయ్యపేట మండలం అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు, జెడ్పీటీసీ రాంబాబు, ఎంపీపీ నాగేశ్వరి దేవి, వైస్ ఎంపీపీలు నారాయణమూర్తి, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

'ప్యారీ షుగర్స్' బాధిత కుటుంబాలకు రూ. 2.17 కోట్ల పరిహారం



మృతుల కుటుంబ సభ్యులకు బాండ్లను అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే కన్నబాబు, ఎంపీ గీత

కాకినాడ రూరల్: కాకినాడ జిల్లా వాకలపూడి ఏపీఐఐసీ పారిశ్రామిక వాడలోని ప్యారీ షుగర్స్ పరిశ్రమలో ఇటీవల జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో మృతి చెందిన నలుగురు కార్మికులకు సంబంధించి పరిహారాన్ని వారి కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఆగస్ట్ 19న ప్యారీ సంస్థలో కన్వేయర్ బెల్ట్ వద్ద సంభవించిన పేలుడులో వీరమళ్ల రాజేశ్వరరావు, రాయుడు వీర సత్యనారాయణ మృతి చెందారు. అదే సంస్థలో ఆగస్ట్ 29న జరిగిన మరో ప్రమాదంలో పేరూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, రాగం ప్రసాద్ మరణించారు. వరుస ఘటనలను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని వెంటనే పరిశ్రమను మూసివేయించింది. మృతుల కుటుంబాలకు న్యాయం జరిగేలా పరిహారం విషయంలో యాజమాన్యంపై స్థానిక ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీత సంప్రదింపులు జరిపారు. ఒక్కో కుటుంబానికి రూ.55 లక్షల నుంచి 60 లక్షల వరకు పరిహారంతో పాటు అర్హత ఉన్న కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించింది. రాజేశ్వరరావుకు రూ.47.73 లక్షలు, వీర సత్యనారాయణకు రూ.50.84 లక్షలు, సుబ్రహ్మణ్యేశ్వరరావుకు రూ.60 లక్షలు, ప్రసాద్‌కు రూ.59 లక్షలను యాజమాన్యం ప్రకటించింది. ఆ ప్రకారం మృతుల కుటుంబసభ్యుల పేరిట పరిహారాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ)లుగా ఖాతాలకు జమ చేసింది. సంబంధిత బాండ్లను మృతుల కుటుంబీకులకు కాకినాడ రూరల్ రమణయ్యపేటలో కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే కన్నబాబు, ఎంపీ వంగా గీత మంగళవారం అందజేశారు.

సీఎం జగన్‌కు ఏపీపీటీడీ ఉద్యోగుల కృతజ్ఞతలు



సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏపీపీటీడీ ప్రతినిధులు.చిత్రంలో వెంకట్రామిరెడ్డి తదితరులు

- మా సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించారు
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా విభాగం (ఏపీపీటీడీ)కు చెందిన వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి.. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు సీఎంను కలిశారు. ప్రభుత్వ ఉద్యోగులకు కల్పిస్తున్న సదుపాయాలన్నీ పీటీడీ ఉద్యోగులకు కూడా కల్పిస్తున్నారని ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచినందుకు సంతోషం వ్యక్తం చేశారు. కొత్త పీఆర్సీ ప్రకారం అక్టోబర్ ఒకటి నుంచి పెరిగిన జీతాలు తమకు ఇస్తుండటంపై కృతజ్ఞతలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌ను కలిసినవారిలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ డీఎస్‌పీ రావు, రాష్ట్ర నాయకులు ఎ.రాధాకృష్ణ, డి.ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

అక్టోబర్ 1 నుంచి పెరిగిన వేతనాలు..

అక్టోబర్ 1న ఆర్టీసీ ఉద్యోగులందరికీ పీఆర్సీ మేరకు పెరిగిన వేతనాలు అందుతాయని వెంకట్రామిరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసిన అనంతరం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. అక్టోబర్ ఒకటిన పెంచిన వేతనాలివ్వాలని సీఎం అధికారులను ఆదేశించారన్నారు. ప్రభుత్వ అనుబంధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని విన్నవించామని తెలిపారు. అలాగే పలు కార్పొరేషన్లు, యూనివర్సిటీలు, గురుకులాలు, విద్యాసంస్థల్లో ఉద్యోగులకు కూడా పెంచాలని విజ్ఞప్తి చేశామని చెప్పారు. తమ విన్నపాలపై సీఎం జగన్ సానుకూలంగా స్పందించారన్నారు. పదవీ విరమణ వయసు పెంపుపై దస్త్రాన్ని సిద్ధం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారని తెలిపారు.

కోటి ఎకరాల్లో ఈ పంట నమోదు

వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్



సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఈ క్రాప్ డేటా నమోదు దాదాపు పూర్తి కావచ్చిందని, ఇప్పటికే కోటి ఎకరాల్లో పంటల సాగు వివరాలు నమోదు ప్రక్రియ పూర్తయ్యిందని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ తెలిపారు. జిల్లా, మండల వ్యవసాయాధికారులు, సహాయ సంచాలకులతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ పంట నమోదు పూర్తయిన మేరకు వీఏఏ, వీఆర్‌వోల పరిధిలో ఈ కేవైసీ నమోదు ప్రక్రియ అక్టోబర్ 2 నాటికి పూర్తి కావాలని ఆదేశించారు. రైతులకు అక్టోబర్ 5 నాటికి డిజిటల్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్‌లు పంపించాలన్నారు. అక్టోబర్ 5 నుంచి 10 వరకు ఈ క్రాప్ వివరాలను సోషల్ ఆడిట్ కింద ఆర్బీకేల్లో ప్రదర్శించాలన్నారు. రైతుల వేలిముద్రలు (ఈ కేవైసీ) అక్టోబర్ 20 నాటికి పూర్తి చేయాలని, అదే సమయంలో పంట నమోదు రసీదులు రైతులకు వ్యక్తిగతంగా అందజేయాలన్నారు. రబీకి అవసరమైన పప్పు, శనగ విత్తన పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 2–3 రోజుల్లో విత్తన పంపిణీ మొదలవుతుందన్నారు. గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్(జీఏపీ) సర్టిఫికేషన్ కోసం ప్రతీ జిల్లాలోనూ 250 ఎకరాలతో పొలంబడి క్లస్టర్స్‌ను గుర్తించే ప్రక్రియ పూర్తయిందన్నారు. ఈ క్లస్టర్స్ పరిధిలోని అధికారులకు అక్టోబర్‌లోనూ, రైతులకు నవంబర్‌లోనూ శిక్షణ ఇవ్వబోతున్నట్టు చెప్పారు. కలెక్టర్ల ఆదేశాలతో ఆర్బీకేలకు వలంటీర్ల కేటాయింపు ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి అక్టోబర్ 2వ వారంలో వారికి సాంకేతిక శిక్షణ ఇవ్వాలని సూచించారు.

ఆడపిల్లలకు జీవన నైపుణ్యాలు నేర్పించాలి

- బాలికా విద్యాభివృద్ధికి 'ప్రాజెక్ట్ కస్తూరి' ప్రారంభం
- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్

సాక్షి, అమరావతి: ప్రతి అమ్మాయి చదువుకునేలా అందరూ బాధ్యత వహించాలని, ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించేలా తర్ఫీదు ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్, సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. సమగ్ర శిక్షా, రూమ్ టూ రీడ్ సంయుక్త ఆధ్వర్యంలో బాలికా విద్యాభివృద్ధి కోసం 'ప్రాజెక్ట్ కస్తూరి' కార్యక్రమాన్ని మంగళవారం విజయవాడలోని ఓ హోటల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ చదువు జీవితానికి ఒక వారధి అని, ప్రతి విద్యార్థికి చదివే నైపుణ్యం, సృజనాత్మకత, జీవన నైపుణ్యాలు పెంపొందించడానికి కృషి చేయాలని చెప్పారు. 'ప్రాజెక్ట్ కస్తూరి' కార్యక్రమాన్ని తొలుత కడప జిల్లాలోని చాపాడు, దువ్వూరు, ఖాజీపేట, మైదుకూరు, వల్లూరు, పెండ్లిమర్రి కేజీబీవీల్లో 6, 7, 8 తరగతుల విద్యార్థినులకు ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ఆత్మవిశ్వాసం పెంపొందించడం, భావోద్వేగాలను నియంత్రించడం, స్వీయనియంత్రణ పాటించడం, విమర్శనాత్మక ఆలోచనా ధోరణి, సొంతగా నిర్ణయాలు తీసుకోవడం, పట్టుదలగా పని చేయడం, సమస్యలను సృజనాత్మకంగా పరిష్కరించడం, సంబంధ బాంధవ్యాలను ఏర్పరుచుకోవడం తదితర జీవన నైపుణ్యాలపై శిక్షణ ఇస్తామని వివరించారు. రాబోయే రెండు, మూడేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయ, విద్యార్థి కరదీపికలను ఆవిష్కరించారు.

ఏఎన్‌యూ వీసీగా ఆచార్య రాజశేఖర్

ఏఎన్‌యూ : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్తి స్థాయి వైస్ చాన్సలర్‌గా ఆచార్య పి.రాజశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య పి.రాజశేఖర్ ఏఎన్‌యూకు ఎఫ్ఏసీ(ఫుల్ అడిషనల్ చార్జ్) వీసీగా 2019, నవంబర్ నాలుగో తేదీ నుంచి కొనసాగుతున్నారు. ఆయన పూర్తి స్థాయి వీసీగా మరో మూడేళ్లు కొనసాగనున్నారు. ఏఎన్‌యూ పూర్తి స్థాయి వీసీగా ఆచార్య రాజశేఖర్ బుధవారం ఉదయం పది గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు.

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేసే వరకు ఉద్యమం

- కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు
- సీమ జిల్లాల న్యాయవాదుల సంఘీభావం



దీక్ష చేస్తున్న న్యాయవాదులు

కర్నూలు(లీగల్): హైకోర్టును అమరావతి నుంచి కర్నూలుకు తరలించే వరకు ఉద్యమం ఆపేది లేదని న్యాయవాదులు స్పష్టంచేశారు. కర్నూలులోని ధర్నా చౌక్‌లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన చేపట్టిన నిరాహార దీక్షలు మంగళవారం కూడా కొనసాగాయి. న్యాయవాదులు నరసింహ, సంపత్‌కుమారి, బి.కృష్ణమూర్తి, సోమశేఖర్ తదితరులు దీక్షలో కూర్చున్నారు. దీక్షా శిబిరం వద్దకు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ధర్మవరం, కదిరితోపాటు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నంద్యాల, డోన్, ఆళ్లగడ్డకు చెందిన న్యాయవాదులు వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ధర్మవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ చౌదరి, కార్యదర్శి దస్తగిరి మరికొందరు మాట్లాడుతూ హైకోర్టు కర్నూలులో ఏర్పాటు చేసేవరకు ఉద్యమం కొనసాగిస్తామని చెప్పారు. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘం నాయకుడు భాస్కర్‌రెడ్డి కూడా న్యాయవాదులకు మద్దతు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం కొలిమిగుండ్ల ప్రాంతంలో కలసి వినతిపత్రం సమర్పిస్తామని కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంఆర్ కృష్ణ, కాటం రంగడు, బార్ కౌన్సిల్ సభ్యుడు పి.రవిగువేరా, రాయలసీమ న్యాయవాదుల ఐక్యకార్యాచరణ కమిటీ నేత వై.జయరాజు, ఓంకార్ తెలిపారు. సీఎం జగన్‌ను కలిసిన తర్వాత భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు.

కలెక్టర్ పేరుతో డబ్బులు డిమాండ్

- యూపీకి చెందిన సైబర్ నేరగాడి ఆగడం
- కాకినాడ జిల్లా కలెక్టర్ పిక్‌తో వాట్సప్‌లో అధికారులకు మెసేజ్‌లు
- పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్
- విచారణకు ఆదేశించిన కలెక్టర్

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా సైబర్ నేరగాళ్ల ఆగడాలకు బాధితురాలయ్యారు. గుర్తు తెలియని వ్యక్తి కలెక్టర్ ఫొటోని ప్రొఫైల్ పిక్‌గా పెట్టి వివిధ శాఖల అధికారులను వాట్సప్‌లో డబ్బులు డిమాండ్ చేయడం కలకలం రేపింది. పేమెంట్ గేట్ వేగా ఓ లింక్‌ని కూడా పెట్టాడు. దాని ద్వారా డబ్బులు పంపాలని డిమాండ్ చేశాడు. విద్యా శాఖలో పని చేసే ఓ అధికారి సైతం ఆ లింక్‌కు డబ్బులు పంపారు. ఆ తర్వాత నిజం తెలవడంతో విస్తుపోయారు. నిందితుడు మరికొన్ని శాఖల అధికారులు, సిబ్బందిని సైతం పెద్ద మొత్తంలో డబ్బు డిమాండ్ చేశాడు. దీంతో మంగళవారం డ్వామా, ఐసీడీఎస్ పీడీలు, విద్యా శాఖ జిల్లా అధికారి ఈ విషయాన్ని నేరుగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. కాకినాడ త్రి టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన వాడని ప్రాథమిక విచారణలో వెల్లడైంది. గూగుల్‌లో కలెక్టర్ ఫోటో డౌన్లోడ్ చేసి ప్రొఫైల్ పిక్‌గా వినియోగించినట్లు నిర్ధారణ అయ్యింది. ఓ వ్యక్తి తన ఫొటో వాడి సైబర్ నేరానికి పాల్పడటం నిజమేనని కలెక్టర్ చెప్పారు. జిల్లా అధికారులు, సిబ్బంది అధికారిక, వ్యక్తిగత ఫోన్ నంబర్లు నిందితుడికి ఎలా చేరాయన్న విషయంపైన కూడా పోలీస్ ఐటీ విభాగం దర్యాప్తు చేస్తోందని తెలిపారు. నిందితుడిని పట్టుకొనేందుకు ప్రత్యేక పోలీస్ బృందం ఉత్తరప్రదేశ్‌కు బయల్దేరిందన్నారు. నిందితుడు గతంలోనూ కలెక్టర్ పేరుతో వాట్సప్‌లో తమను డబ్బు డిమాండ్ చేశాడని పలు విభాగాల సిబ్బంది పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

ప్రభుత్వ పాఠశాలలు భేష్

- విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- నాడు–నేడు పనులపై ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల ప్రశంస
- కృష్ణా జిల్లా కంకిపాడు, పెనమలూరు పాఠశాలల పరిశీలన



పెనమలూరు పాఠశాలలో ప్రపంచ బ్యాంక్ ప్రతినిధుల బృందం

పెనమలూరు/కంకిపాడు: మనబడి నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారాయని, మౌలిక వసతులు భేషుగ్గా ఉన్నాయని ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం కితాబిచ్చింది. కృష్ణా జిల్లా కంకిపాడులోని మండల పరిషత్ ఆదర్శ పాఠశాల, జెడ్పీ పాఠశాల, పెనమలూరు జిల్లా పరిషత్ పాఠశాలలను ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం మంగళవారం పరిశీలించింది. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టు (ఎస్ఏఎల్‌టీ) ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి ఈ బృందం వచ్చింది. ఆయా పాఠశాలల్లో భవన నిర్మాణాలు, కల్పించిన మౌలిక వసతులను పరిశీలించి, నిర్మాణ పనుల నాణ్యతను తనిఖీ చేసింది. పారిశుధ్య నిర్వహణకు వినియోగిస్తున్న సామగ్రిని పరిశీలించింది. తరగతి గదుల్లో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సాగిస్తున్న బోధన తీరును ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు ప్రశంసించారు. నాణ్యత, మౌలిక వసతులతో పాఠశాలల రూపురేఖలు మారడంతో విద్యా ప్రమాణాల స్థాయి పెరిగిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. నాడు–నేడు ద్వారా తొలి దశ, రెండో దశల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, కేటాయించిన నిధులు, మౌలిక వసతుల కల్పన చర్యలను నాడు–నేడు ప్రత్యేక అధికారి మురళి ప్రపంచ బ్యాంకు బృందానికి వివరించారు.

విద్యార్థులు ప్రపంచ స్థాయికి ఎదగాలి..

ఈ సందర్భంగా ప్రపంచ బ్యాంక్ ఎడ్యుకేషన్ స్పెషలిస్ట్ టాస్క్ టీమ్ లీడర్ కార్తీక్ పెంతల్ మాట్లాడుతూ.. నాడు–నేడు పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అనేక సదుపాయాలు కల్పించిందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రపంచ స్థాయికి ఎదగాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో ప్రభుత్వ పాఠశాలల పనితీరు, వసతులు బాగున్నాయని ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఆకునూరు మురళి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు అతుర్‌పానే, ట్రిసీవిలి కౌష్కి, ఆదిత్య శర్మ, స్వాతి గమేలియల్, సురభి, దీప బాలకృష్ణన్, కాంచన్ రాజీవ్‌సింగ్, తనూష్ మాథుర్, కృష్ణా డీఈవో తాహేరా సుల్తానా, పలువురు కన్సల్టెంట్లు పాల్గొన్నారు.

విశాఖ, ప్రకాశం శ్రీకాకుళం జిల్లాలకు 'స్వచ్ఛ' అవార్డులు

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ)/పొదిలి/అరసవల్లి: గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)కు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఇండియన్ స్వచ్ఛతా లీగ్‌లో భాగంగా 'టాప్ ఇంపాక్ట్ క్రియేటర్' అవార్డును ప్రకటించింది. వ్యర్థాల సేకరణ, ప్లాస్టిక్ నిషేధం తదితర కార్యక్రమాలకు ఈ అవార్డును ప్రకటించింది. అలాగే, ప్రకాశం జిల్లా పొదిలి నగర పంచాయతీ స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డుకు ఎంపికైనట్లు పొదిలి మునిసిపల్ కమిషనర్ డానియెల్ జోసెఫ్ తెలిపారు. పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణలో మెరుగైన పనితీరు కనబరిచినందుకు ఈ అవార్డుకు ఎంపికైనట్లు చెప్పారు. ఇండియన్ స్వచ్ఛత లీగ్ (ఐఎస్ఎల్) కార్యక్రమాల్లో ఉత్తమ ప్రగతి కనబర్చిన శ్రీకాకుళం నగరం జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికైంది. లక్ష నుంచి 3 లక్షల లోపు జనాభా ఉన్న పట్టణాల కేటగిరీలో శ్రీకాకుళం నగరం ఈ ప్రత్యేక అవార్డును దక్కించుకుంది. అవార్డులను ఈ నెల 30న ఢిల్లీలో ప్రదానం చేయనున్నారు.

బ్రహ్మచారిణిగా భ్రమరాంబాదేవి


మయూర వాహనంపై కొలువుదీరిన భ్రామరీ సమేత మల్లికార్జునుడు

శ్రీశైలం టెంపుల్: శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీశైల క్షేత్రంలో మంగళవారం భ్రమరాంబాదేవి.. బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. రాత్రి భ్రమరాంబాదేవి, మల్లికార్జునస్వామి మయూర వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. తొలుత ఉత్సవమూర్తులను ఆలయ ప్రదక్షిణ చేయించి ప్రధానాలయ రాజ గోపురం నుంచి రథశాల వద్దకు తీసుకొచ్చారు. రాత్రి 8 గంటల తర్వాత ప్రారంభమైన గ్రామోత్సవం నందిమండపం, అంకాలమ్మగుడి, బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు వెళ్లి తిరిగి ఆలయ ప్రవేశం చేసింది. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామిఅమ్మవార్ల అలంకారమూర్తులను దర్శించుకుని కర్పూర నీరాజనాలర్పించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, సభ్యులు, ఈవో ఎస్.లవన్న, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

బాలాత్రిపురసుందరీదేవిగా దుర్గమ్మ

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా కేంద్రం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో రెండోరోజు మంగళవారం కనకదుర్గమ్మ.. బాలాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం శ్రీగంగాపార్వతి సమేత మల్లేశ్వరస్వామికి పల్లకీసేవ వైభవంగా జరిగాయి. నగరోత్సవ సేవలో పాల్గొని భక్తులు పులకించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో రావడంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. అధికారులు ముందస్తు ప్రణాళికతో భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశారు. కనకదుర్గానగర్‌లోని కళావేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో కటాక్షిస్తున్న అమ్మవారిని అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులు దర్శించుకున్నారు. స్పీకర్‌కు ఆలయ ఈవో భ్రమరాంబ స్వాగతం పలికారు.

30 నిమిషాల్లోనే అమ్మ దర్శనం

భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అమ్మవారి దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేసినట్లు డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ ఢిల్లీరావు చెప్పారు. వినాయకుడిగుడి వద్ద నుంచి క్యూలైన్‌లో వెళ్లే భక్తులకు 30 నిమిషాల్లోనే అమ్మవారి దర్శనం జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఫుట్‌స్కానర్ ద్వారా భక్తుల సంఖ్యను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు నిర్ణీత సమయంలో దర్శనం చేసుకునే అవకాశం కల్పించారు. కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ భక్తులకు ఇబ్బంది కలుగకుండా అనధికార దర్శనాలకు అడ్డుకట్ట వేశారు. కలెక్టర్ తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ సీసీ మానిటరింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, డీసీపీలు విశాల్ గున్ని, కొల్లి శ్రీనివాసరావు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. క్యూలైన్లలో వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకున్నారు.


బాలా త్రిపురసుందరీదేవి అలంకారంలో దుర్గమ్మ


స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులకు ప్రసాదాలు అందజేస్తున్న పండితుడు

నేడు గాయత్రీదేవి అలంకారం

దసరా ఉత్సవాల్లో మూడోరోజు బుధవారం కనకదుర్గమ్మ.. గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. సకల మంత్రాలకు మూల శక్తిగా, వేదమాతగా ప్రసిద్ధి పొంది.. ముక్త, విద్రుమ, హేమ, నీల, ధవళ వర్ణాలతో ప్రకాశించే పంచముఖాలతో దర్శనమిచ్చే సంధ్యావందన దేవత గాయత్రీదేవి. ఈ తల్లి శిరస్సుపై బ్రహ్మ, హృదయంలో విష్ణువు, శిఖలో రుద్రుడు ఉండటంతో గాయత్రీదేవి త్రిమూర్త్యాంశగా వెలుగొందుతోంది. గాయత్రీదేవిని దర్శించుకుంటే ఆరోగ్యం, తేజస్సు, జ్ఞానం కలుగుతాయని భక్తుల విశ్వాసం.



కనులపండువగా ధ్వజారోహణం

పెద్దశేషవాహనంపై శ్రీవారి వైభవం



తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం శాస్త్రోక్తంగా ధ్వజారోహణ చేశారు. సాయంత్రం 5.23 గంటల నుంచి 6 గంటల మధ్య మీనలగ్నంలో వైఖానస ఆగమోక్తంగా పవిత్ర గరుడపతాకాన్ని (ధ్వజపటాన్ని) బంగారు ధ్వజస్తంభ శిఖరాగ్రానికి అర్చకులు ఆవిష్కరించారు. గరుత్మంతుడి బొమ్మను చిత్రీకరించిన నూతన వస్త్రాన్ని ఉత్సవమూర్తులైన మలయప్ప, శ్రీదేవి, భూదేవి సమక్షంలో గోధూళి వేళ కంకణ భట్టాచార్యులుగా సీనియర్ సీతారామదీక్షితులు పతాకావిష్కరణ చేశారు. దీంతో బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. అంతకుముందు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతుడైన మలయప్ప పరివార దేవతలైన అనంతుడు (ఆదిశేషుడు), గరుత్మంతుడు, విష్వక్సేనుడు, గరుడధ్వజం, సుదర్శన చక్రత్తాళ్వార్‌తో కలిసి ఆలయ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అనంతరం రాత్రి 9 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేతుడైన మలయప్పస్వామి పెద్దశేష వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. బ్రహ్మోత్సవాలకు ఆలయ సంప్రదాయం ప్రకారం టీటీడీ ఈవో ధర్మారెడ్డి కంకణం ధరించారు. ఈ కార్యక్రమాల్లో టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదనపు పీపీ దుష్యంత్ రెడ్డి పదవీ కాలం పొడిగింపు



సాక్షి, అమరావతి: రాష్ట్ర అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి పదవీ కాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో మూడేళ్లు పొడిగించింది. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి జి.సత్యప్రభాకరరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దుష్యంత్ రెడ్డి అదనపు పీపీగా 2019 సెప్టెంబర్ 27న నియమితులయ్యారు. ఆయన పదవీ కాలం ఈ నెల 26తో ముగిసింది. ఈ నేపథ్యంలో ఆయన పదవీ కాలాన్ని మరో మూడేళ్ల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

సెలవుల్లోనూ 'ప్రైవేట్' వేధింపులు

సాక్షి, అమరావతి: ప్రభుత్వం అన్ని విద్యా సంస్థలకు దసరా సెలవులు ప్రకటించినా తరగతులు నిర్వహిస్తూ.. సిబ్బందితో పని చేయిస్తూ కార్పొరేట్ విద్యాసంస్థలు వేధిస్తున్నాయని ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ మండిపడింది. రాష్ట్రంలో లక్షల మంది ప్రైవేటు టీచర్లు, విద్యార్థులు ఆవేదనకు గురవుతున్నారని పేర్కొంది. సంబంధిత యాజమాన్యాల పై చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ జాయింట్ కమిషనర్ పార్వతికి వినతిపత్రమిచ్చినట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దిద్దే అంబేద్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బట్టు శ్యాం ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి ముని కుమార్ తెలిపారు.

బాలల చట్టాలపై అవగాహన ముఖ్యం

సాక్షి, అమరావతి: బాలల హక్కులు, రక్షణ, క్షేమం కోసం పనిచేసే ప్రతి ఒక్కరూ బాలల చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, అప్పుడే మరింత సమర్థంగా పని చేయగలమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూపొందించిన బాలల న్యాయ చట్టం మోడల్ రూల్స్–2022పై విజయవాడలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూతన రూల్స్‌లో బాలల సంక్షేమ సమితి, కలెక్టర్, బాలల సంరక్షణ విభాగం నిర్వహించాల్సిన బాధ్యతలను వివరించారని తెలిపారు.

పోర్టులు, మౌలిక వసతుల్లో ఏపీ అత్యుత్తమం

- టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్ అవార్డు ప్రదానం
- ఇది గర్వకారణం: మంత్రి అమర్‌నాథ్


అవార్డు అందుకుంటున్న మంత్రి అమర్‌నాథ్, రవీంద్రనాథ్

సాక్షి, న్యూఢిల్లీ: పోర్టు ఆధారిత మౌలిక వసతుల అభివృద్ధిలో దేశంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంది. ఇందుకుగాను టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూపు అవార్డు లభించింది. మంగళవారం ఢిల్లీలో నిర్వహించిన 'ద ఎకనామిక్ టైమ్స్ ఇన్‌ఫ్రా ఫోకస్ సమ్మిట్, అవార్డ్స్–2022' కార్యక్రమంలో 'ఔట్ స్టాండింగ్ కంట్రిబ్యూషన్ ఇన్ పోర్ట్ లెడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ అవార్డును రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మారిటైమ్ డిప్యూటీ సీఈవో రవీంద్రనాథ్ అందుకున్నారు. మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో రాష్ట్రం పారిశ్రామికాభివృద్ధిలో దూసుకెళుతోందని చెప్పారు. రూ.15 వేలకోట్లతో పోర్టుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, రూ.3,500 కోట్లతో ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధి జరుగుతోందన్నారు. పోర్టుల పక్కనే పారిశ్రామిక అభివృద్ధి కోసం భూములు సేకరించాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఈ అవార్డును అందుకోవడం గర్వంగా ఉందని ఆయన చెప్పారు.

లోకేశ్ నాలుక చీరేస్తాం

మంత్రి దాడిశెట్టి రాజా



కోటనందూరు: గౌరవంగా ఇంట్లో ఉండే మహిళలను రోడ్డుకు ఈడిస్తే లోకేశ్ నాలుక చీరేస్తామని మంత్రి దాడిశెట్టి రాజా హెచ్చరించారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం కోటనందూరు మండలంలో మంగళవారం వైఎస్సార్ చేయూత మూడోవిడత చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలోని మహిళలందరూ సీఎం జగన్‌ను అన్నగా, తమ్ముడిగా, కొడుకుగా భావిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో మహిళలంతా ఎవరి ఇంట్లో వారు సంతోషంగా ఉండాలని సీఎం కోరుకుంటున్నారన్నారు. అలాంటి ఈ రాష్ట్రంలో సీఎం జగన్ సతీమణి వైఎస్ భారతిపై నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఐటీడీపీ బృందం అవాకులు, చెవాకులు మాట్లాడుతోందని చెప్పారు. సోషల్ మీడియాలో సైతం రకరకాల తప్పుడు పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. వారి తాబేదార్లయిన ఎల్లో మీడియాలో రోజూ కథనాలు వండి వారుస్తున్నారని చెప్పారు. విషప్రచారం చేయడం పరిపాటిగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంట్లో ఉండే ఆడవాళ్లను రోడ్డుమీదకు లాగి రాజకీయం చేసే సంస్కృతి మన రాష్ట్రంలో ఇప్పటివరకు లేదన్నారు. ఇటువంటి పద్ధతిని రాష్ట్రంలో కొత్తగా ప్రవేశపెట్టొద్దని ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుకు సూచించారు. చంద్రబాబు ఇంట్లో కూడా మహిళలున్నారని, కావాలనుకుంటే వారిమీద తాము కూడా అవాకులు, చెవాకులు మాట్లాడగలమని, తప్పుడు ప్రచారం చేయగలమని, కానీ.. అది తమ సంస్కృతి కాదని చెప్పారు. చంద్రబాబు తన కుమారుడికి సభ్యత, సంస్కారం నేర్పించి అదుపులో ఉంచుకోవాలని సూచించారు. సీఎం సతీమణి వైఎస్ భారతమ్మ మీదే కాకుండా రాష్ట్రంలో ఏ అక్కచెల్లెమ్మ జోలికొచ్చినా నీ కొడుకు నాలుక చీరేస్తామని ఆయన చంద్రబాబును హెచ్చరించారు.

మహేశ్వరిగా రాజశ్యామల అమ్మవారు


పూజలు చేస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో రెండోరోజు మంగళవారం శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు మహేశ్వరిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి విశేషంగా పూజలు నిర్వహించి హారతులు సమర్పించారు. అంతకుముందు అమ్మవారి మూలవిరాట్‌కి స్వరూపానందేంద్ర సరస్వతి అభిషేకం చేశారు. దాదాపు 40 నిమిషాలు జరిగిన అభిషేకసేవలో భక్తులు అమ్మవారి నిజరూప దర్శనం చేసుకున్నారు. పీఠం ప్రాంగణంలో చండీ హోమం, చతుర్వేదపారాయణ, దేవీ భాగవత పారాయణ నిర్వహించారు. శ్రీచక్రానికి నవావరణార్చన చేశారు. ఈ సందర్భంగా శంకర విజయం అనే అంశంపై ఆధ్యాత్మికవేత్త డాక్టర్ ధూళిపాళ కృష్ణమూర్తి చేసిన ప్రవచనం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. సాయంత్రం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర చేతులమీదగా రాజశ్యామల అమ్మవారికి, చంద్రమౌళీశ్వరస్వామికి పీఠార్చన చేశారు.

అడ్డదారి రాజకీయాలు బాబుకు అలవాటే

- మహిళలను అడ్డం పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలని చూస్తారు
- భారతమ్మ పేరెత్తితే మీ సంగతి తేలుస్తాం
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని


ప్రసంగిస్తున్న మంత్రి విడదల రజిని

లబ్బీపేట (విజయవాడ తూర్పు): అడ్డదారిలో రాజకీయాలు చేసి లబ్ధిపొందాలని చూడటం టీడీపీ అధినేత చంద్రబాబుకు మొదటి నుంచి అలవాటేనని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని మండిపడ్డారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని ఏపీఐఐసీ కాలనీ, గుణదల గంగిరెడ్డుల దిబ్బలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను ఆమె వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ మహిళలను అడ్డం పెట్టుకుని రాజకీయంగా లబ్ధి పొందాలని చంద్రబాబునాయుడు చూస్తుంటారని విమర్శించారు. భారతమ్మ మహిళా పారిశ్రామికవేత్తగా అందరికీ ఆదర్శంగా ఉన్నారని, గొప్ప మానవీయ విలువలు ఉన్న మహిళ అని కొనియాడారు. అలాంటి భారతమ్మపై చంద్రబాబు, కొంతమంది టీడీపీ నాయకులు అబద్ధపు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారిసంగతి తేలుస్తామని హెచ్చరించారు. మహిళలను గౌరవించే సంస్కృతిని వదిలి టీడీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తూ అనాగరికంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. వైద్య, ఆరోగ్యరంగం గురించి చంద్రబాబు, టీడీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా ఒక్క మెడికల్ కళాశాలను స్థాపించలేదని, ఆరోగ్యశ్రీకి నిధులు కేటాయించకుండా, ఆ పథకానికి జీవం లేకుండా చేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు నిర్మించాలనే కనీస స్పృహ కూడా లేకుండా పరిపాలన కొనసాగించిన అసమర్థ నాయకుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య ఆరోగ్యరంగంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చి దేశం మనవైపు చూసేలా చేశారని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీల నియామకానికి గ్రీన్‌సిగ్నల్



సాక్షి, అమరావతి: మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ల (ఎంఎల్‌హెచ్‌పీల) నియామక ప్రక్రియ చేపట్టేందుకు ప్రభుత్వానికి హైకోర్టు అనుమతినిచ్చింది. ఈ నియామకాల్లో ఎలాంటి విధి విధానాలు అనుసరించాలో నిర్దేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కుంభజడల మన్మథరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య క్లినిక్‌లు, వెల్‌నెస్ కేంద్రాల్లో 1,681 మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ల నియామకానికి ఆగస్టులో ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దానిని సవాలు చేస్తూ కొందరు వైద్యులు హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఎంఎల్‌హెచ్‌పీల నియామక ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేశారు. ఇటీవల పూర్తి స్థాయి వాదనలు విన్న న్యాయమూర్తి మంగళవారం తన నిర్ణయాన్ని వెలువరించారు. నియామకపు ప్రక్రియను కొనసాగించేందుకు ప్రభుత్వానికి అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఒళ్లు బలిసినవారి పాదయాత్ర

- అమరావతి రైతుల పాదయాత్రపై మంత్రి అంబటి ధ్వజం
- పవన్‌కల్యాణ్ పార్టీ పెట్టిందే చంద్రబాబు కోసం


మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

కోడూరు (అవనిగడ్డ): రాష్ట్ర రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ చేస్తున్న పాదయాత్ర ఒళ్లు బలిసినవారు, ధనవంతులు చేస్తున్న పాదయాత్ర అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. కృష్ణాజిల్లా కోడూరు మండలంలో జరిగిన వైఎస్సార్ చేయూత నగదు చెక్కు పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు సీఎం వైఎస్ జగన్ మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకొస్తే.. దాన్ని సహించలేక ఒళ్లు బలిసినవారు, ధనవంతులు పాదయాత్ర చేస్తున్నారని మండిపడ్డారు. పాదయాత్రలో విద్వేషాలు రెచ్చగొట్టేలా కవ్వింపుచర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పాదయాత్ర పేరుతో కొంతమంది గుడివాడలో కొడాలి నానిపై తొడకొట్టారని, ఇప్పుడు ఉత్తరాంధ్రకు వెళ్లి అక్కడ కూడా తొడలు కొట్టాలని చూస్తున్నారని చెప్పారు. ఇలా తొడలు కొట్టినంత మాత్రాన వికేంద్రీకరణ ఆగదని స్పష్టం చేశారు.

కుప్పంలో చంద్రబాబు ఓటమి ఖాయం

కుప్పంలోని పలు మండలాలు, మున్సిపాలిటీల్లో ఇప్పటికే వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేసిందని, ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో కుప్పంలో చంద్రబాబు ఓటమి ఖాయమని చెప్పారు. ఇప్పటికే కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు ఫెయిల్ అయ్యారన్నారు. తెలుగుదేశం పార్టీని, చంద్రబాబును కాపాడేందుకే పవన్‌కల్యాణ్ జనసేన పార్టీని పెట్టారని చెప్పారు. ఇలాంటి పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబుకు ఓటు అడిగే హక్కు కూడా లేదని చెప్పారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్, బాలకృష్ణ వంటి వారు ఎంతమంది వచ్చినా కూడా మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని చెప్పారు. పేద ప్రజల కోసం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి బ్యాంకు ఖాతాలకు జమచేస్తున్నట్లే.. ప్రజలు రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఈవీఎం మిషన్‌పై ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, దివి ఏఎంసీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు పాల్గొన్నారు.

వాన్‌పిక్ భూములకు విముక్తి!

మొదటి పేజీ తరువాయి

వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన 855.71 ఎకరాల భూమిని జప్తు నుంచి విడుదల చేయాలని ఈడీకి తేల్చి చెప్పింది. 1,416.19 ఎకరాల భూమిని జప్తు చేస్తూ ఈడీ జారీ చేసిన ఉత్తర్వులను, వాటిని సమర్థిస్తూ ఈడీ అడ్జ్యుడికేటింగ్ అథారిటీ ఇచ్చిన ఉత్తర్వులను తప్పుబడుతూ అప్పిలేట్ అథారిటీ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు సమర్థించింది. అయితే వాన్‌పిక్ భూముల జప్తును కొనసాగిస్తూ, జప్తు విడుదల కోసం మనీలాండరింగ్ నిరోధక ప్రత్యేక న్యాయస్థానాన్ని ఆశ్రయించాలంటూ వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సూచిస్తూ అప్పిలేట్ అథారిటీ ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు తప్పుపట్టింది. ఒకవైపు ఈడీ, అడ్జ్యుడికేటింగ్ అథారిటీ జారీ చేసిన జప్తు ఉత్తర్వులు చట్ట విరుద్ధమంటూ మరోవైపు ఆస్తుల జప్తు కొనసాగిస్తూ విడుదల కోసం ప్రత్యేక కోర్టును ఆశ్రయించాలని అప్పిలేట్ అథారిటీ పేర్కొనడం ఘోర తప్పిదమని హైకోర్టు వ్యాఖ్యానించింది. అంతేకాక అప్పిలేట్ ట్రిబ్యునల్ తన అధికారాన్ని పరిత్యజించి, ఈడీ చట్ట విరుద్ధ చర్యలు కొనసాగేలా చేసిందని ఆక్షేపించింది. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ సూరేపల్లి నంద ధర్మాసనం తీర్పునిచ్చింది.

ఇదీ నేపథ్యం...

వాడరేవు నిజాంపట్నం పోర్ట్స్ అండ్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్ట్ (వాన్‌పిక్) ఏర్పాటు నిమిత్తం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రకాశం–గుంటూరు జిల్లాల పరిధిలో 13,221.69 ఎకరాల భూములను కేటాయించింది. వాన్‌పిక్ ప్రాజెక్ట్ విషయంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) దేశాల్లో ఒకటైన రస్ అల్ ఖైమాతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ప్రాజెక్టు అమలు కోసం ప్రముఖ వ్యాపారవేత్త నిమ్మగడ్డ ప్రసాద్‌కు చెందిన వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్... వాన్‌పిక్ పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ)గా ఏర్పాటయ్యాయి. అయితే వైఎస్ జగన్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టినందుకుగాను క్విడ్ ప్రో కోలో భాగంగా నిమ్మగడ్డ ప్రసాద్‌కు చెందిన కంపెనీలకు ఈ కేటాయింపులు జరిగాయంటూ సీబీఐ ఆరోపించింది. సీబీఐ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసింది. అటు తరువాత వాన్‌పిక్‌కు భూ కేటాయింపులపై సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ చార్జిషీట్ ఆధారంగా వాన్‌పిక్ పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన 561.19 ఎకరాలు, వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన 855.71 ఎకరాల భూమిని జప్తు చేస్తూ ఈడీ తాత్కాలిక జప్తు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను ఈడీ అడ్జ్యుడికేటింగ్ అథారిటీ సమర్థించింది. దీనిపై వాన్‌పిక్ పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్.. అప్పిలేట్ ట్రిబ్యునల్ ముందు అప్పీళ్లు దాఖలు చేశాయి. ఇవి పెండింగ్‌లో ఉండగానే 11,804.78 ఎకరాల అసైన్డ్ భూమిని జప్తు చేస్తూ ఈడీ తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ద్వారా మొత్తం 13,221.69 ఎకరాలను భౌతికంగా స్వాధీనం చేసుకుంది. ఈ ఉత్తర్వులను అడ్జ్యుడికేటింగ్ అథారిటీ సమర్థించింది.

క్విడ్ ప్రో కో అన్నదే లేదు..

దీనిపై వాన్‌పిక్ పోర్ట్స్, వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ కంపెనీలు అప్పిలేట్ ట్రిబ్యునల్ ముందు అప్పీళ్లు దాఖలు చేశాయి. అప్పీళ్లన్నింటిపై ట్రిబ్యునల్ ఉమ్మడిగా విచారణ జరిపి 2019 జూలైలో తీర్పు వెలువరించింది. ఈడీ, అడ్జ్యుడికేటింగ్ అథారిటీ జారీ చేసిన జప్తు ఉత్తర్వులను తప్పుబట్టింది. అసలు క్విడ్ ప్రో కో అన్నదే లేదని ట్రిబ్యునల్ తేల్చింది. అంతేకాక ఆ ఉత్తర్వులు మనీలాండరింగ్ నిరోధక చట్ట (పీఎంఎల్ఏ) నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని స్పష్టం చేసింది. అవి ఎంత మాత్రం కొనసాగడానికి వీల్లేదంటూ ఆ ఉత్తర్వులను రద్దు చేసింది. అయితే భూముల జప్తును మాత్రం కొనసాగిస్తూ వాటి విడుదల కోసం ప్రత్యేక కోర్టును ఆశ్రయించాలని అప్పిలేట్ ట్రిబ్యునల్ సూచించింది.

ట్రిబ్యునల్ ఉత్తర్వులపై హైకోర్టులో అప్పీళ్లు...

దీనిపై వాన్‌పిక్, వాన్‌పిక్ పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లు హైకోర్టులో వేర్వేరుగా మూడు అప్పీళ్లు దాఖలు చేశాయి. వీటిపై సీజే జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం విచారణ జరిపింది. వాన్‌పిక్ తరఫున సీనియర్ న్యాయవాది అతుల్ నంద వాదనలు వినిపిస్తూ ఈడీ తాత్కాలిక జప్తు ఉత్తర్వులను, వాటిని సమర్థిస్తూ అడ్జ్యుడికేటింగ్ అథారిటీ ఇచ్చిన ఉత్తర్వులు చెల్లవని చెప్పిన ట్రిబ్యునల్ జప్తు విడుదల కోసం ప్రత్యేక కోర్టుకు వెళ్లాలనడం వింతగా ఉందన్నారు. ఈడీ ఉత్తర్వులు తప్పని తేల్చినప్పుడు జప్తు నుంచి భూములను విడిచిపెట్టాలని ఆదేశాలు ఇచ్చి ఉండాల్సిందని, అలా చేయకపోవడం ద్వారా ట్రిబ్యునల్ తప్పు చేసిందన్నారు. ఈడీ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) టి.సూర్యకరణ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, ట్రిబ్యునల్ ఉత్తర్వులు సరైనవేనన్నారు. ట్రిబ్యునల్ ఉత్తర్వులు సమతుల్యతతో కూడి ఉన్నాయన్నారు.

ఏళ్లు పడుతుందంటూ మళ్లీ అక్కడికే వెళ్లమనడం ఏమిటి?

మూడు అప్పీళ్లపై ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం 561 ఎకరాలు, 855 ఎకరాల జప్తు విషయంలో దాఖలైన వ్యాజ్యాల్లో మాత్రమే తీర్పు వెలువరించింది. 11,804 ఎకరాల జప్తు వ్యాజ్యంలో మరిన్ని అంశాలపై వాదనలు వినాల్సి ఉందని స్పష్టం చేస్తూ విచారణను నవంబర్ 14కి వాయిదా వేసింది. ధర్మాసనం తన తీర్పులో మనీ లాండరింగ్ నిరోధక చట్ట నిబంధనల గురించి సవివరంగా చర్చించింది. జప్తు చేసిన భూములు నేరపూరిత సొమ్ములో భాగమని విశ్వసించేందుకు గల కారణాలు ఏమిటో ఈడీ తాత్కాలిక జప్తు ఉత్తర్వుల్లో, అడ్జ్యుడికేటింగ్ అథారిటీ ఉత్తర్వుల్లోనూ ఎక్కడా ప్రస్తావించలేదని ఆక్షేపించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం సెక్షన్ 5(1) ప్రకారం విశ్వసించేందుకు గల కారణాలు ఏమిటో ఉత్తర్వుల్లో పొందుపరచడం తప్పనిసరని స్పష్టం చేసింది. ఈడీ తాత్కాలిక జప్తు ఉత్తర్వులను, వాటిని సమర్థిస్తూ అడ్జ్యుడికేటింగ్ అథారిటీ ఇచ్చిన ఉత్తర్వులను తప్పుపట్టిన అప్పిలేట్ అథారిటీ.. జప్తు భూముల విడుదలకు ఆదేశించకుండా ప్రత్యేక కోర్టును ఆశ్రయించాలనడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ప్రత్యేక కోర్టులో విచారణకు ఏళ్ల సమయం పడుతుందని అప్పిలేట్ ట్రిబ్యునల్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్న విషయాన్ని ధర్మాసనం ప్రత్యేకంగా ప్రస్తావించింది.

ప్రత్యేక కోర్టు ఉత్తర్వులివ్వకుండా భౌతిక స్వాధీనం చెల్లదు..

చట్ట నిబంధనలు ఫలానా విధంగా వ్యవహరించాలని చెబుతున్నప్పుడు దాని ప్రకారమే నడుచుకోవాలే కానీ మరో రకంగా కాదని సుప్రీంకోర్టు ఓ కేసులో ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ధర్మాసనం ప్రస్తావించింది. ప్రత్యేక కోర్టు విచారణ జరిపి ఉత్తర్వులు జారీ చేయడానికి ముందే భూములను ఈడీ భౌతికంగా స్వాధీనం చేసుకోవడం తగదని సుప్రీంకోర్టు చెప్పిందంటూ ధర్మాసనం తెలిపింది. జప్తు నుంచి భూముల విడుదల కోసం ప్రత్యేక కోర్టును ఆశ్రయించాలని, ప్రత్యేక కోర్టు ఉత్తర్వులిచ్చే వరకు జప్తు కొనసాగుతుందంటూ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులు ఏ కోణంలో చూసినా సరికాదని ధర్మాసనం తేల్చి చెప్పింది. అందువల్ల ట్రిబ్యునల్ ఉత్తర్వులపై వాన్‌పిక్ కంపెనీలు దాఖలు చేసిన ఈ అప్పీళ్లను అనుమతించేందుకు ఏ మాత్రం సంకోచించడం లేదని పేర్కొంది. జప్తు చేసిన 1,416.19 ఎకరాలను తక్షణమే విడుదల చేయాలని ఈడీని ఆదేశించింది. ఇదిలా ఉండగా వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై సీబీఐ నమోదు చేసిన కేసును హైకోర్టు ఇటీవల కొట్టివేసిన విషయం తెలిసిందే.

twitter

అమ్మవారి కిరీటాలు ఎత్తుకుపోయిందెవరు?

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌పై ఆరోపణలు చేసిన టీడీపీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నారా లోకేశ్‌పై, హెల్త్ యూనివర్సిటీకి పేరు మార్పుపై టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఆపార్టీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేస్తోన్న విమర్శలపై ట్విట్టర్‌లో మంత్రులు నిప్పులు చెరిగారు. ఆయా నేతల ట్వీట్లు ఇలా....

పప్పూ ఇది చెప్పు: మంత్రి రోజా

అమ్మవారి గుడిలో కిరీటాలు ఎత్తుకుపోయిందెవరు? క్షుద్ర పూజలు చేయించిందెవరు? 40 గుడులను కూల్చేసిందెవరు? సదావర్తి భూములను అమ్మేసిందెవరు? అంతర్వేది రథం తగులబెట్టిందెవరు? రాముడి విగ్రహం విరిచేసిందెవరు? లోకేశ్..నీ కొడుకు మీద ప్రమాణం చేసి నిజాలు చెప్పు'. 'వయసు 73. అనుభవం 45. సీఎంగా 14. కుప్పంలో ఓటు లేదు..ఇల్లు కూడా లేదు. ఆయన పేరు చెబితే గుర్తుకు వచ్చే స్కీమూ లేదు! వాటే పిటీ బాబూ!'

బాబుకి బుద్ధి లేదు: మంత్రి అంబటి రాంబాబు

బాబుకి బుద్ధి లేదు. లోకేష్‌కి బుర్ర లేదు. కష్టంలో తండ్రిపై ప్రేమ చూపని బాలయ్యా..నీకు సిగ్గు లేదయ్యా!'

దీనికేం సమాధానం చెబుతారు?: మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ

'14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు ఎందుకని ఏ ఒక్క జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టలేదు అన్న ప్రశ్నకు బాబు, అతని కుటుంబ సభ్యులు ఏం సమాధానం చెబుతారు?'

వైఎస్సార్ పేరెందుకు పెట్టకూడదు?: మంత్రి జోగి

'నాన్ టీడీపీ 8, వైఎస్సార్ గారు 3, జగన్ గారు 17.. ఇదీ ఏపీలో గవర్నమెంట్ మెడికల్ కాలేజీల లెక్క! ఆరోగ్యశ్రీ, 108, 104.. వైఎస్ మమకారంతో వచ్చినవే కదా? మరి వైఎస్సార్ పేరెందుకు పెట్టకూడదు?'

ఇదేమైనా సినిమానా?: మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

'నటుడు బాలకృష్ణ ఎప్పుడో ఒకసారి వచ్చి డైలాగులు చెప్పి పోవడానికి ఇదేమైనా సినిమానా? వైద్య రంగానికి విశేష సేవలు అందించిన వైఎస్సార్ పేరు హెల్త్ వర్సిటీకి పెట్టడం సమంజసం.

సాక్షి విజయనగరం

బుధవారం । 28 । సెప్టెంబర్ । 2022

బాలాత్రిపుర సుందరీదేవిగా..



చీపురుపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం మండపంలో చండీహోమం నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

రైతుల యాత్ర కాదు.. ఉత్తరాంధ్రపై దండయాత్ర



అమరావతి రైతులు చేపడుతున్న పాదయాత్ర ఉత్తరాంధ్రపై దండయాత్రేనని, దానిని మన ప్రాంతవాసులంతా తిప్పికొట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

- 10లో

ఆప్కో వస్త్రాలపై 30 శాతం రాయితీ



పాలకొండ రూరల్: ఆప్కో చేనేత వస్త్రాల ను 30 శాతం రాయితీపై విక్రయిస్తున్నట్టు మేనేజర్ పి.సంతోష్ తెలిపా రు. దసరా, దీపావళి పండగలను దృష్టిలో పెట్టుకుని రాయితీ ఇస్తున్నట్టు వెల్లడించారు. వస్త్రాలను కొనుగోలుచేసి చేనేత కార్మికులకు చేయూతనివ్వాలని కోరారు.

న్యూస్‌రీల్

నాడు-నేడుతో మౌలిక వసతుల కల్పన



మాట్లాడుతున్న ఆర్‌జేడీ శారద

విజయనగరం పూల్‌బాగ్: 'నాడు-నేడు' అభివృద్ధి పనులను నిబద్ధతతో నిర్వహించాలని, విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని ఆర్జేడీ ఐ.శారద అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలోని 32 ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు 'నాడు-నేడు' పనుల నిర్వహణపై మంగళవారం అవగాహన కల్పించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. డీవీఈఓ ఆర్.సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌ఐఓ మజ్జి సత్యనారాయణ, స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ వీకేవీ కృష్ణారావు, పార్వతీపురం ఆర్‌ఐఓ మంజులవీణ తదితరులు పాల్గొన్నారు.

ఆవును హతమార్చిన పులి



పులిదాడిలో మృతిచెందిన ఆవును పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

బొండపల్లి: పులి మరోసారి పంజా విసిరింది. బొండపల్లి మండలం కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని శివుడిపాలెం గిరిజన గ్రామానికి... అనంతగిరి మండలం తమ్మాపురం గ్రామానికి సరిహద్దులో ఉన్న పశువులశాలపై దాడిచేసింది. ఓ ఆవును మంగళవారం వేకువజామున హతమార్చింది. బాధిత రైతు పోసూరి చిన్న అప్పలస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని విజయనగరం అటవీశాఖ అధికారులు, ఎంపీడీఓ ఎ.వేదవతి పరిశీలించారు. ఆవు కళేబరానికి పశువైద్యులు పంచనామా జరిపి ఖననం చేయించారు. పెద్దపులి సంచరిస్తోందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలకు ఆహ్వానం

- ధ్వజారోహణం, పతాకావిష్కరణ చేసిన అర్చకులు



ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణ కార్యక్రమాన్ని జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం రామయ్య సన్నిధిలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆలయం నిర్మితమైనప్పుడు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తెచ్చి ప్రతిష్ఠించిన లక్ష్మీసమేత వేంకటేశ్వరస్వామి వారికి బ్రహ్మోత్సవ పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా జరిపిస్తున్నారు. స్వామివారిని రామతీర్థం తిరువీధుల్లో మంగళవారం ఊరేగింపుగా తీసుకువెళ్లి గ్రామ బలిహరణం చేశారు. అనంతరం ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణాల నడుమ గరుత్మంతుడి చిత్రపటాన్ని ధ్వజస్తంభ శిఖరానికి ఆవిష్కరించి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ధ్వజస్తంభంపైన ఎగిరే ఈ గరుడ పతాకమే సమస్త దేవతా మూర్తులకు ఆహ్వాన పత్రం. ఈ ఆహ్వానాన్ని అందుకున్న ముక్కోటి దేవతలు తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో పాల్గొంటూ దిగ్విజయంగా జరిపిస్తారని పురాణాలు చెబుతున్నాయి. ధ్వజారోహణానికి ముందు స్వామివారికి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు.

పామాయిల్ సాగుకు రాయితీల వర్షం



ఎస్.కోట ప్రాంతంలో ఉన్న పామాయిల్ తోట

- వందశాతం సబ్సిడీపై పామాయిల్ మొక్కల పంపిణీ
- మొక్కల పెంపకానికి హెక్టారుకు రూ.12వేల చొప్పున నాలుగేళ్ల పాటు చెల్లింపు
- ఎరువులకు హెక్టారుకు 5వేల చొప్పున నాలుగేళ్లపాటు అందజేత
- 90 శాతం సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్..
- 50 శాతం రాయితీపై యాంత్రీకరణ పనిముట్లు
- జిల్లాలో 1488 హెక్టార్లలో సాగవుతున్న పామాయిల్ తోటలు
- ఈ ఏడాది మరో ఏడు వందల హెక్టార్లలో సాగుకు సన్నాహాలు

చీపురుపల్లిరూరల్/ఎస్.కోట:

పామాయిల్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రైతులకు రాయితీల వర్షం కురిపిస్తోంది. జిల్లాలోని నేలలు పామాయిల్ సాగుకు అనుకూలమని, రైతులు ముందుకొచ్చి లాభాల పంటను సాగుచేయాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. ఆ మేరకు సాగు ప్రణాళికను సిద్ధం చేశారు. నర్సరీల ఏర్పాటు, విత్తన సరఫరా, రైతులకు రాయితీలు, సాంకేతిక పరిజ్ఞానం అందించడం, ఆయిల్ పామ్ గెలల సేకరణ, మార్కెటింగ్ వంటి సదుపాయాలను రైతులకు కల్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. పంట కొనుగోలుకు ఆరు కంపెనీలతో ఒప్పందం సైతం కుదుర్చుకున్నారు. జిల్లాలో ఇప్పటికే 1488 హెక్టార్లలో పామాయిల్ తోటలు సాగవుతుండగా, ఈ ఏడాది మరో 700 హెక్టార్లలో సాగుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే 90 హెక్టార్లలో ప్లాంటేషన్ పూర్తి చేశారు. మరో 180 హెక్టార్లను గుర్తించారు.

పామాయిల్ మొక్కలు పొందడం ఇలా..

పామాయిల్ తోటలను సాగుచేయాలనుకునే రైతులు మొక్కల కోసం స్థానికంగా ఉన్న సచివాలయం, రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదిస్తే ఆర్డర్ చేస్తారు. ఉద్యానవన శాఖాధికారులను సంప్రదించినా మొక్కలను పంపిణీ చేస్తారు. ఈ పంట కొనుగోలు అంశంలో ప్రభుత్వం నేరుగా కంపెనీలతో సంబంధం పెట్టుకుంది. పండిన పంటను కూడా ఆయా ప్రాంతాల్లో ఉన్న సంబంధిత ఆయిల్ కంపెనీలు నేరుగా కొనుగోలు చేస్తాయి.

సబ్సిడీ పొందాలంటే...

పామాయిల్ తోటల సాగుకు రాయితీలు పొందేందుకు 5 ఎకరాల విస్తీర్ణంలోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులు మాత్రమే అర్హులు. ఈ రైతులకు మాత్రమే ప్రభుత్వం అందించిన పూర్తిస్థాయి రాయితీ వర్తిస్తుంది. 5 ఎకరాలు పైబడి ఉన్న పెద్ద రైతులు కూడా పామాయిల్ తోటలను సాగు చేసుకోవచ్చు. రాయితీలు కాస్త తక్కువగా అందుతాయి.

వందశాతం రాయితీపై మొక్కల పంపిణీ..

రైతులు తమ భూముల్లో పామాయిల్ తోటలను పెంచుకునేందుకు ముందుకు వచ్చిన రైతులకు వందశాతం సబ్సిడీపై మొక్కలను అందిస్తుంది. రెండు రకాల మొక్కలను ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. ఇండియాకు చెందిన(స్వదేశీ) మొక్క ధర రూ.133లు కాగా ఇతర దేశాల నుంచి ఇంపోర్ట్ చేసుకున్న (విదేశీ) మొక్క రేటు రూ.193లు. ఈ రెండు మొక్కలను వందశాతం సబ్సిడీపై అందజేస్తుంది.

మొక్కల పెంపకానికి రూ.12వేలు రాయితీ..

రైతులు తమ భూముల్లో పామాయిల్ మొక్కలను పెంపకం చేసేందుకు ఏడాదికి హెక్టారుకు 12వేలు సబ్సిడీ అందిస్తోంది. నాలుగు సంవత్సరాల వరకు ఇలా సబ్సిడీ రూపంలో సాయం కొనసాగుతుంది. ఎరువుల కోసం ఏడాదికి హెక్టారుకు 5వేలు చొప్పున నాలుగేళ్ల పాటు సబ్సిడీ రూపంలో ఆర్థిక సాయం అందిస్తుంది. అలాగే ఈ తోటలో వరి,చెరుకు,పొగాకు మినహా ఏ ఇతర అంతర పంటలు వేసుకున్నా ఏడాదికి 5వేలు సబ్సిడీ చొప్పున నాలుగేళ్ల పాటు సాయం అందిస్తుంది. ఇప్పటికే సాగులో ఉన్న పెద్ద తోటల్లో ఖోఖో మొక్కలను అంతర పంటగా వేసుకునేందుకు మొదటి ఏడాది ప్రభుత్వం రూ.12వేల రాయితీ కల్పిస్తోంది.

90 శాతం సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు...

పామాయిల్ తోటల్లో మొక్కలకు నీటిని అందించేందుకు అవసరమైన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను కూడా 90 శాతం రాయితీపై ప్రభుత్వం రైతులకు సమకూర్చుతోంది. డ్రిప్ ఇరిగేషన్ పరికరాల విలువ రూ.2.30లక్షలు కాగా రైతు పదిశాతం వాటా భరిస్తే 90 శాతం ప్రభుత్వం భరిస్తుంది. మొక్కలు చుట్టూ (కంచె) ప్లాస్టింగ్ మల్చింగ్ చేసేందుకు హెక్టారుకు రూ.16వేలు అందిస్తుంది. వీటన్నింటితో పాటుగా యాంత్రీకరణ పనిముట్లను 50 శాతం సబ్సిడీపై అందజేస్తోంది. పంట పండిన తరువాత గెలలను కోసేందుకు, పంటలో వివిధ రకాలుగా ఉపయోగపడే యాంత్రీకరణ పనిముట్లను 50 శాతం రాయితీపై రైతులకు సమకూర్చుతోంది.

రూ.4వేలు చొప్పున మరో మూడేళ్లపాటు రాయితీ వర్తింపజేస్తోంది.

చెరకుకు ప్రత్యామ్నాయంగా...

జిల్లాలో వరి తర్వాత రైతాంగాన్ని ఆదుకునే వాణిజ్య పంట చెరకు. రైతులు తరాలుగా నమ్ముకుని చెరకును సాగుచేస్తున్నా ఇటీవల కాలంలో దిగుబడులు తగ్గిపోవడం, భీమసింగి కర్మాగారం మూతపడడం, బెల్లం ధరలు స్థిరంగా లేకపోవడం వంటి కారణాల వల్ల సాగుపై ఆసక్తి సన్నగిల్లుతోంది. వరి తర్వాత ఆర్థికంగా ఆదుకునే పంటగా ఆయిల్‌పామ్‌వైపు చూస్తున్నారు. జిల్లాలోని మెట్ట, పల్లపు నేలలు పామాయిల్ సాగుకు అనుకూలమని ఉద్యానశాఖ అధికారులు చెప్పడంతో ఆసక్తిచూపుతున్నారు.



గెలలు వేసిన ఆయిల్ పామ్ చెట్టు

పామాయిల్‌తో లాభాలు..

పామాయిల్ తోటలు రైతులకు లాభాలనిస్తాయి. జిల్లాలో ఈ ఏడాది 7 వందల హెక్టార్లలో పామాయిల్ మొక్కలు నాటాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి వరకు 100 ఎకరాల్లో మొక్కలు నాటించాం. ఇప్పటికే జిల్లాలో 1488 హెక్టార్లలో పామాయిల్ తోటలు సాగులో ఉన్నాయి. ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– శైలజ, ఏడీ, ఉద్యానవనశాఖ

మెరక ప్రాంతాలు అనుకూలం



జిల్లాలో పామాయిల్ సాగుకు మెరక ప్రాంతాలు అనుకూలం. ఖాళీగా ఉన్నమెరక ప్రాంతాల్లో ఆయిల్‌పామ్ సాగు మేలు. నీటి ఎద్దడి ఉన్న భూముల్లో డ్రిప్‌తో సాగు చేయవచ్చు. సాగుపై ఆసక్తి ఉన్న రైతులు ముందుగా ఆర్‌బీకేలను, లేదంటే ఉద్యానవనశాఖ అధికారులను సంప్రదించి సాంకేతిక సహాయాన్ని తీసుకోవాలి. ఆయిల్‌పామ్ సాగుకు ఆసక్తి చూపే రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోంది.

– జమదగ్ని, జిల్లా ఉద్యానశాఖ అధికారి

దండిగా లాభాలు..

ఎకరా విస్తీర్ణంలో పామాయిల్ తోటలు సాగుచేస్తే ఎకరానికి సాధారణంగా 8 టన్నుల పైబడి దిగుబడి వస్తుంది. చెట్లు బలంగా పెరిగి గెలలు వస్తే 10 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. టన్ను ధర 17వేలు పలుకుతోంది. ఎకరానికి అన్ని ఖర్చులు పోయి ఏడాదికి 1.50 లక్షల వరకు రైతుకు ఆదాయం చేకూరుతుందని ఉద్యానవన శాఖాధికారులు చెబుతున్నారు. మొక్కలు నాటిన నుంచి నాలుగేళ్ల వరకు ఎలాంటి ఆదాయం ఉండదు. ఈ నాలుగేళ్ల కాలంలో అంతర పంటలు సాగు చేసుకుని ఆదాయం పొందవచ్చు. నాలుగేళ్ల తరువాత 40 సంవత్సరాల వరకు పంట చేతికి అందుతుంది. 40 ఏళ్ల తరువాత కూడా ఓమాదిరిగా పంట చేతికి వస్తుంది. ఎకరా నేలలో 57 మొక్కలు, హెక్టారుకు 143 పామాయిల్ మొక్కలను నాటాల్సి ఉంటుంది. పామాయిల్ తోటలు సాగుచేసే రైతులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో రాయితీలు కల్పిస్తోంది.



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంచేసిన పామాయిల్ గెలలు

అలంకార రూపిణి



వనంగుడిలో బాలాత్రిపుర సుందరి అలంకరణలో దుర్గాదేవి



రైల్వేస్టేషన్ గాడీఖానా వద్ద 12 దేవతా మూర్తుల శిరస్సుల తో దర్శనమిస్తున్న దుర్గమ్మ

విజయనగరం టౌన్: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం రైల్వేస్టేషన్ వద్ద ఉన్న పైడితల్లి అమ్మవారి ఆలయంలో కొలువైన దుర్గాదేవీ బాలాత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గాజులరేగ సాలివీధిలో అమ్మవారికి గారెలతో అలంకరించారు. రైల్వేస్టేషన్ రోడ్డు గాడీఖానాలో శక్తి స్వరూపిణి మాతగా 12 దేవతామూర్తుల శిరస్సుల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. సిటీ బస్టాండ్ వద్దనున్న ఆలయంలో కనకమహాలక్ష్మి అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలోభక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు.



గాజులరేగ సాలివీధిలో గారెల అలంకరణలో దుర్గాదేవి



సిటీ బస్టాండ్ వద్ద గాయత్రీ దేవిగా కనకమహాలక్ష్మి అమ్మవారు

పరిశ్రమల ఏర్పాటుకు పిలుపు

- జిల్లాలో మరిన్ని పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తాం
- కలెక్టర్ సూర్యకుమారి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: జిల్లాలో పరిశ్రమలు స్థాపించేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పిలుపునిచ్చారు. జిల్లా యంత్రాంగం తరపున సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. పరిశ్రమల స్థాపనపై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, రైతు సంఘాలు, విద్యార్థులకు కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమ పరిశ్రమల స్థాపనకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. వ్యవసాయాధారిత పరిశ్రమల స్థాపనకు జిల్లా అనుకూలమని పేర్కొన్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే రైతు సంఘాలకు సహకారాన్ని అందించేందుకు ప్రత్యేకంగా ఒక వ్యవసాయ సహాయ సంచాలకుడిని ప్రభుత్వం నియమించిందన్నారు. ఏపీఐఐసీ ద్వారా జిల్లాలో మరిన్ని పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కొత్తవలస, ఎల్.కోట, పూసపాటిరేగ ప్రాంతాల్లో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ప్రాధాన్యమిస్తున్నట్టు తెలిపారు. బొబ్బిలి పారిశ్రామికవాడలో 200 ఎకరాలు సిద్ధంగా ఉన్నాయని, కావాల్సిన వారికి కేటాయిస్తామని చెప్పారు. విద్యార్థులు చదువులు పూర్తిచేశాక ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనపై దృష్టి పెట్టాలని కోరారు.

- ఎంఎస్‌ఎంఈ ఏడీ జి.రఘురామ్ మాట్లాడుతూ పరిశ్రమలు, సేవా సంస్థల స్థాపనకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల విభాగాలు, రిజిస్ట్రేషన్, పీఎంఈజీపీ, ముద్రా, స్టాండప్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్, ట్రైనింగ్, ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సపోర్ట్ స్కీమ్, క్లస్టర్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ అప్‌గ్రేడేషన్, జెడ్‌ఈడీ సర్టిఫికెట్, ఇన్‌క్యుబేటర్స్, ఐపీఆర్, పీఎంఎస్, ప్రభుత్వ రాయితీలను వివరించారు.
- ఏపీఎస్‌ఎఫ్‌సీ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశ్రమలను స్థాపించడమే లక్ష్యంగా తమ సంస్థ చేస్తున్న కృషిని వివరించారు. పరిశ్రమలను స్థాపించడానికి ముందుకు వస్తే అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు. పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ పాపారావు మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలను స్థాపించేందుకు కలెక్టర్ చూపిస్తున్న చొరవను వివరించారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీఐడీసీ చాంబర్ పూర్వ అధ్యక్షులు జి.సాంబశివరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీకర్, ప్రకాష్‌బాబు, వివిధ శాఖల జిల్లా అధికారుల పాల్గొన్నారు.

పరిశ్రమలకు త్వరితగతిన అనుమతి

పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు త్వరిత గతిన అనుమతులు మంజూరు చేస్తున్నట్టు కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పరిశ్రమల స్థాపనకు మొత్తం 47 దరఖాస్తులు అందగా వాటిలో ఇప్పటికే 14 పరిశ్రమలకు అనుమతిచ్చినట్లు చెప్పారు. స్ఫూర్తి కార్యక్రమం కింద జిల్లాలో పరిశ్రమల స్థాపనకు జరుగుతున్న ప్రయత్నాలను, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి వివరించారు. ఎస్‌కోట ప్రాంతంలో భోజన ప్లేట్లు తయారీ, భీమాలిలో మామిడి తాండ్ర, వడ్ఛళ్ల తయారీ, మెరకముడిదాంలో పూతరేకుల తయారీ, గుర్ల ప్రాంతంలో వస్త్ర పరిశ్రమల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.

థాంక్యూ సీఎం సార్..



ఆనందగజపతి ఆడిటోరియం ఆవరణలో థాంక్యూ సీఎం సార్ అంటూ నినదిస్తున్న పాస్టర్లు

విజయనగరం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను క్రైస్తవ సోదరులంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రామానందం పిలుపునిచ్చారు. స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో జిల్లా ప్రత్యేక పాస్టర్ల సమావేశాన్ని రెవరెండ్ ఎ.జయప్రకాష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామానందం మాట్లాడుతూ గౌరవ వేతనం కోసం పాస్టర్లందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ క్రైస్తవులు క్రమశిక్షణ కలిగినవారని, క్రీస్తు ప్రేమను సమాజానికి పంచాలన్నారు. బిషప్ డాక్టర్ ఇమ్మాన్యుయేల్ మాట్లాడుతూ దేశ శాంతికి, సౌభ్రాతృత్వానికి ప్రతి ఒక్కరూ ప్రార్థనలు చేయాలన్నారు. అనంతరం క్రైస్తవులకు సంక్షేమపథకాలను అందజేసిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. థాంక్యూ సీఎం సార్ అంటూ నినదించారు. ఏపీసీసీ జిల్లా అధ్యక్షుడు పాస్టర్ డాక్టర్ పి.ప్రేమానందం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బిషప్ దేవప్రసాద్, డాక్టర్ ఉదయ్ చంద్ర, రెవరెండ్ సూర్యప్రకాష్, డాక్టర్ పాల్‌శ్రీనివాస్, డాక్టర్ వి.సత్యరాజ్, టూరిస్ట్ డైరెక్టర్ రేగాన శ్రీనివాస్, బిషప్ ఎస్.తిమోతి, ఇమ్మాన్యుయేల్, జాన్‌విక్టర్, ఎలీషా, సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాటిపూడి గురుకులం సందర్శన



తాటిపూడి గురుకులంలో అధ్యాపకులతో మాట్లాడుతున్న డిప్యూటీ సెక్రటరీ మహ్మద్ ఓబెదుల్లా

శృంగవరపుకోట: మండలంలోని తాటిపూడి గురుకుల కళాశాలను ఏపీఆర్‌జేసీ రీజనల్ డిప్యూటీ సెక్రటరీ మహ్మద్ ఓబెదుల్లా మంగళవారం సందర్శించారు. గురుకులంలో అధ్యాపకుల మధ్య జరుగుతున్న వివాదాలపై విచారణ జరిపారు. ఉన్నతాధికారులకు ఇక్కడి అధ్యాపకులు పంపిన ఫిర్యాదులపై ఆరా తీశారు. అధ్యాపకులతో మాట్లాడారు. బోధనపై దృష్టిసారించాలని, అనవసర వివాదాల జోలికి వెళ్లొద్దని సూచించారు. ఆయన వెంట నిమ్మకూరు కళాశాల ప్రిన్సిపాల్ సి.ప్రదీప్ కుమార్ ఉన్నారు.

చెరువులో బైక్..!



చిల్లపాలెం చెరువులో అనుమానాస్పదంగా ఉన్న బైక్

జామి: మండలంలోని కొత్త భీమసింగి సమీపంలోని చిల్లపాలెం చెరువులో ఓ బైక్ పడి ఉంది. దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్‌ఐ నర్సింగరావు ఆధ్వర్యంలో సిబ్బంది బైక్‌ను చెరువులో నుంచి మంగళవారం బయటకు తీసి జామి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బైక్ పశ్చిమగోదావరి జిల్లా రాజులపేట రోడ్డు చెరుకువాడకు చెందిన పెరుమల్ల వెంకన్నదిగా గుర్తించామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఏఎస్‌ఐ తెలిపారు. చెరకువాడ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించామని చెప్పారు.

రైలు ఢీ కొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

చీపురుపల్లి: చీపురుపల్లి–బాతువ రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాలపై రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్పీ ఎస్‌ఐ చెల్లూరి శ్రీనివాసరావు తెలిపారు. చెన్నై నుంచి హౌరా వెళ్తున్న డౌన్‌లైన్ పట్టాలపై ఉన్న మృతదేహాన్ని మంగళవారం గుర్తించామని చెప్పారు. మృతుడికి 55 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని, నీలి రంగు ఫ్యాంట్, తెలుపు రంగుపై నలుపురంగు ప్రింట్‌తో కూడిన చొక్కా ధరించి ఉన్నాడన్నారు. మృతునికి సంబంధించిన వారు ఎవరైనా సెల్: 70132 73731 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

లైజాల్ తాగి మహిళ మృతి

డెంకాడ: మండలంలోని చింతలవలస గ్రామానికి చెందిన మోపాడ లక్ష్మి(35)బాత్‌రూమ్ క్లీనింగ్ చేసే లైజాల్ తాగి మరణించింది. ఎస్‌ఐ మహేష్ అందించిన వివరాల ప్రకారం.. కొంతకాలంగా మోపాడ లక్ష్మి వెన్నెముక సమస్యతో బాధపడుతోంది. నొప్పి తట్టుకోలేక బాత్‌రూమ్ క్లీన్ చేసే లైజాల్ తాగడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మరణించింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలి భర్త శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం చోరీ



ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్‌టీమ్

సాలూరు: పట్టణంలోని బోను మహంతి వీధిలోని ఓ ఇంటిలో చోరి జరిగింది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని బోనుమహంతి వీధికి చెందిన జ్యోతి ఈ నెల 24న ఊరెళ్లి.. 26వ తేదీ సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులు బద్దలు కొట్టి ఇంట్లోని ఐదు తులాల బంగారం చోరీ చేసినట్టు గుర్తించారు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదుచేశారు. క్లూస్ టీమ్ ఇంటిని పరిశీలించింది. వేలి ముద్రలు సేకరించింది.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 435.00
విజయనగరం	రూ. 439.00
శ్రీకాకుళం	రూ. 439.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	50,200–00
బంగారం(22సి. 10గ్రా.)	46,000–00
వెండి (కిలో)	60,700–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹133	₹236	₹ 246

రైతుల యాత్ర కాదు.. ఉత్తరాంధ్రపై దండయాత్ర

- యాత్రను తిప్పిగొడదాం
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు



లబ్ధిదారులకు వైఎస్సార్ చేయూత చెక్కును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

రాజాం సిటీ: అమరావతి రైతులు చేపడుతున్న పాదయాత్ర ఉత్తరాంధ్రపై దండయాత్రేనని, దానిని మన ప్రాంతవాసులంతా తిప్పికొట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రాజాం మార్కెట్‌యార్డు ఆవరణలో రాజాం అర్బన్, రూరల్ మండలాలకు చెందిన వైఎస్సార్ చేయూత లబ్ధిదారులకు మంగళవారం నిర్వహించిన నిధుల బదిలీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుకు టీడీపీ పాలకులే కారణమని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలను అభివృద్ధిచేసే దిశగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని తెలిపారు. విశాఖపట్నాన్ని పరిపాలన రాజధానిగా చేస్తే ఈ ప్రాంతంలో పరిశ్రమలు వస్తాయని, తద్వారా ఈ ప్రాంత యువకులకు ఉద్యోగావకాశాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. హైదరాబాద్ విషయంలో ఒకసారి మోసపోయామని, మళ్లీ అమరావతి పేరిట ఆ తప్పిదం జరగనివ్వమని, విశాఖపట్నం రాజధానిగా సాధించి తీరుతామని నినదించారు. మహిళల ఆర్థిక సంక్షేమానికి జగన్‌మోహన్ రెడ్డి కృషిచేస్తున్నారని, ఆయనకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

ప్రతీ మహిళా గర్వపడేలా పాలన..

ప్రతీ మహిళా గర్వపడేలా జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని, ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తున్నారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. పథకాల లబ్ధి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే చేరుతోందన్నారు. ఆనాడు రుణమాఫీ చేస్తానని చెప్పి మోసం చేసిన బాబు ఈనాడు అభివృద్ధికి నిరోధకుడిగా మారాడన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత, ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ మహిళా సాధికారతకు వైఎస్సార్ చేయూత దోహదపడుతోందన్నారు. రాజాం నియోజకవర్గంలోని పేదవర్గాల మహిళలకు మూడు విడతల్లో వైఎస్సార్ చేయూత కింద రూ.104.65 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లావేటి సులోచన, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, పులిరాజు, ఆర్డీఓ ఎం.అప్పారావు, మెప్మా పీడీ సుధాకర్, కమిషనర్ డీటీవీ కృష్ణారావు, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, తహసీల్దార్ విజయ్‌భాస్కర్, వైఎస్సార్ సీపీ టౌన్, రూరల్ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, యాలాల వెంకటేష్, వాకముళ్ల చిన్నారావు, కరణం సుదర్శనరావు, వెలుగు ఏపీ చిరంజీవి, టీఎంసీ ఎస్వీ రత్నం, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపర్చుకోవాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం: సచివాలయ సిబ్బంది పనితీరును మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని పద్మావతినగర్‌లో ఉన్న 37వ సచివాలయాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను, హాజరు పట్టీని పరిశీలించారు. వివిధ పథకాల అమలు తీరును, స్పందన గ్రీవెన్సుల పరిష్కారంపై ఆరా తీశారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యంపై మండిపడ్డారు. మహిళా పోలీస్, ఏఎన్‌ఎం పనితీరుపై అసహనం వ్యక్తంచేశారు. ఇదే పనితీరు చూపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణ కుమారి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కేవీ సత్యనారాయణ, సచివాలయాల కన్వీనర్ హరీష్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటిన విద్యార్థినులు



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి శ్రీరామ్ జూనియర్ కళాశాలకు చెందిన బైపీసీ ఫైనలియర్ విద్యార్థినులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో సత్తా చూపారు. తూర్పుగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో రోప్ స్కిప్పింగ్ ఫ్రీస్టైల్‌లో విశాలాక్షి రజత పతకం సాధించగా, ఇన్‌రోప్ స్కిప్పింగ్ స్పీడ్‌లో భవానీ కాంస్య పతకం సాధించింది. విద్యార్థినులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.కమలాకర్, ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, అకడమిక్ అడ్వైజర్ బి.రవి, పీడీ బి.శ్రీను, అధ్యాపకులు అభినందించారు.

ఘనంగా కాయల వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు



ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డిని ఆశీర్వదిస్తున్న మత పెద్దలు

సీతమ్మధార(విశాఖ ఉత్తర): ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఆయన కార్యాలయంలో కాయల వెంకటరెడ్డి కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులు, అభిమానులు, స్నేహితులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన్ని మతపెద్దలు ఆశీర్వదించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్లు అనీల్‌కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, సారిపల్లి గోవింద్, కాయల సూరా రెడ్డి, కాయల రవికుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, వార్డు అధ్యక్షులు, పార్టీ శ్రేణులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బాలికలను వేధిస్తే కఠిన శిక్షలు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సాయి కల్యాణచక్రవర్తి

- జిల్లా జడ్జి సాయికల్యాణ చక్రవర్తి

విజయనగరం లీగల్: బాలికలను వేధించిన, లైంగిక దాడులకు పాల్పడినా కఠిన శిక్షలు తప్పవని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి హెచ్చరించారు. స్థానిక న్యాయసేవా సదన్‌లో మంగళవారం పోక్సో స్పెషల్ యాక్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన నిర్భయ సంఘటన తర్వాత కేంద్ర ప్రభుత్వం ఈ ప్రత్యేక చట్టాన్ని రూపొందించిందన్నారు. పోక్సో కేసులు విచారణకు జిల్లా కేంద్రంలో ప్రత్యేక కోర్టులు ఏర్పాటయ్యాయన్నారు. త్వరితగతిన కేసులు విచారించి నిందితులను కఠినంగా శిక్షించడమే వాటి లక్ష్యమన్నారు. దర్యాప్తులో లోపం కారణంగా కేసులు వీగిపోకూడదన్నారు. పోలీసు అధికారులు పోక్సో కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిందితులకు శిక్షలు పడేలా దర్యాప్తు చేయాలని సూచించారు. ఈ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకుంటుందన్నారు. సదస్సులో న్యాయమూర్తులు రాధారత్నం, షేక్ సికిందర్ భాషా, జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి లక్ష్మీకుమారి, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ కలెక్టర్ గౌతమ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఐపీఏ రాష్ట్ర కోశాధికారిగా సునీంద్ర



గురుగుబెల్లి సునీంద్ర

రాజాం: ఇండియన్ ఫార్మసిస్టు అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారిగా జిల్లాకు చెందిన గురుగబెల్లి సునీంద్ర ఎన్నికయ్యారు. ఈనెల 24న గుంటూరులో జరిగిన రాష్ట్ర విభాగ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ నల్లమిల్లి ఆదిరెడ్డి వెల్లడించారు. రెండేళ్లపాటు ఆయన కోశాధికారిగా కొనసాగనున్నారు. ఆయన స్వగ్రామం సంతకవిటి మండలం గుజ్జన్నపేట. ఎనిమిదేళ్లుగా వైద్య రంగంలో సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఈయన మీడియాతో మాట్లాడుతూ వైద్యరంగంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమైనదని వెల్లడించారు. సునీంద్రను అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివపత్రి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, సర్పంచ్ మొయ్యి మోహనరావు, సురేష్‌కుమార్ తదితరులు మంగళవారం అభినందించారు.

కిలేడీ..!

- వృద్ధురాలి కంటిలో కారం కొట్టి బంగారం దోచుకున్న మహిళ
- పట్టపగలే చోరీ
- పోలీస్‌లకు ఫిర్యాదు

లక్కవరపుకోట: మండలంలోని గొల్జాం గ్రామంలో మంగళవారం పట్టపగలే ఓ ఇంటిలో చోరీ జరిగింది. మంచంపై ఉన్న వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడును గుర్తుతెలియని మహిళ తెంచుకుపోయింది. బాధితురాలి కొడుకు, పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్జాం గ్రామ మాజీ సర్పంచ్ తూర్పాటి రాములమ్మ వృద్ధాప్యంతో కదలలేని స్థితిలో ఇంటివద్దనే ఉంటోంది. ఆమె కుమారుడు వెంకటరావు పొలంపనికి వెళ్లిపోగా, కోడలు అంగన్‌వాడీ కార్యకర్త కావడంతో సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లింది. ఇదే అదునుగా గుర్తుతెలియని మహిళ ఇంటిలోకి ప్రవేశించింది. మంచంపై పడుకున్న రాములమ్మ మొఖంపై దిండుతో అధిమి వెంట తెచ్చుకున్న కారంను కళ్లలో కొట్టింది. బ్లేడ్‌తో మెడలో ఉన్న నాలుగున్నర తులాల బంగారం తాడును దోచుకుపోయింది. వృద్ధురాలు కళ్లు నులుపుకొని కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూసేసరికి మాయలేడి అక్కడ నుంచి పరారైయింది. కారం చల్లిన అచ్చులు, అడుగులను గుర్తించి స్థానికురాలే అయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎస్‌ఐ ఎం.ముకుందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజయనగర ఉత్సవాలను విజయవంతం చేద్దాం

- డీఆర్వో గణపతిరావు

విజయనగరం అర్బన్: విజయనగర ఉత్సవాలను సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు పిలుపునిచ్చారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉత్సవాల వేదికల ఇన్‌చార్జిలు, ఉత్సవాల శాశ్వత సభ్యులతో వేదికల వారీగా నిర్వహించే కార్యక్రమాలపై మంగళవారం సమీక్షించారు. వేదికల వద్ద చేయవలసిన ఏర్పాట్లన్నింటికీ ఇన్‌చార్జి అధికారులే బాధ్యతవహించాలన్నారు. ప్రారంభోత్సవ ర్యాలీ, ఆనంద గజపతి ఆడిటోరియం, అయోధ్య మైదానం, పుష్ప ప్రదర్శనల వద్ద అధికమంది ప్రేక్షకులు ఉంటారని, అందుకు తగ్గట్టుగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు కల్యాణచక్రవర్తి, సుధాకర్‌రావు, జెడ్పీ సీఈఓ డాక్టర్ అశోక్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ శాంతకుమరి, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములునాయుడు, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు, డీఎస్పీలు ఎల్.మోహనరావు, త్రినాథ్, డీఐపీఆర్ఓ రమేష్, ఇతర శాఖల అధికారులతోపాటు శాశ్వత సభ్యులు ధవళ సర్వేశ్వరరావు, పెద్దింటి అప్పారావు, కాపుగంటి ప్రకాష్, ఎస్ఎస్ఎస్ఎస్ రాజు, డాక్టర్ వెంకటేశ్వరరావు, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

కేంద్రాస్పత్రిలో పోస్టుమార్టం రగడ

- ఓ మహిళ మృతదేహానికి అనధికార వ్యక్తి పోస్టుమార్టం నిర్వహణ
- విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఆస్పత్రి అధికారులు
- బాధ్యులపై చర్యలు



పోస్టుమార్టం చేస్తున్న అనధికార వ్యక్తి

విజయనగరం ఫోర్ట్: జిల్లా కేంద్రాస్పత్రిలో ఓ అనధికార వ్యక్తి పోస్టుమార్టం నిర్వహించడం వివాదాస్పదంగా మారింది. బాధ్యులపై చర్యలకు ఆస్పత్రి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. డెంకాడ మండలానికి చెందిన ఓ మహిళ పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె మృతదేహానికి ఆస్పత్రి వైద్యుని సమక్షంలో పోస్టుమార్టం అసిస్టెంట్ చేయాల్సి ఉంది. అయితే, బయట నుంచి వచ్చిన ఓ వ్యక్తి ఆస్పత్రి వైద్యుడు, పోస్టుమార్టం అసిస్టెంట్ సమక్షంలో మంగళవారం పోస్టుమార్టం చేశాడు. ఈ విషయం ఆస్పత్రి అధికారులకు తెలియడంతో సీరియస్ అయ్యారు. ఘటనకు బాధ్యులైన ముగ్గురిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

చర్యలకు సిఫార్సు..

మహిళ మృతదేహానికి అనధికార వ్యక్తి పోస్టుమార్టం చేసిన విషయం మా దృష్టికి వచ్చిందని, దీనికి బాధ్యుడైన పోస్టుమార్టం అసిస్టెంట్ రవితేజను జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయధికారి (డీసీహెచ్‌ఎస్)కు సరెండ్ చేస్తున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.సీతారామరాజు తెలిపారు. చార్జెంట్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తున్నామన్నారు. వైద్యుడికి మెమో జారీ చేస్తామన్నారు. అనధికార వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. పూర్తిస్థాయి విచారణకు ఆర్‌ఎంఓ, మరో వైద్యురాలితో కమిటీని నియమించినట్టు వెల్లడించారు.

సారా నిర్మూలనే లక్ష్యం

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



సాలూరు: జిల్లాలో సారా నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. త్వరలో ఎస్ఈబీ(స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తెస్తామని వివరించారు. పాచిపెంట మండలం పి.కోనవలసలో ఆయన 'సాక్షి'తో మంగళవారం మాట్లాడారు. జిల్లాలో సారా, గంజాయి, నిషేధిత మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపినట్టు వెల్లడించారు. హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్‌చేసిన వెంటనే స్పెషల్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుని సారా నిర్మూలన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. పాచిపెంట మండలం పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద అదనపు బలగాలతో నిఘా వేస్తామని చెప్పారు. దాడులు ముమ్మరం చేస్తామన్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పాచిపెంట మండలంలో రెండు స్పెషల్ టీమ్‌లను నియమించామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేదిలేదని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

280 లీటర్ల సారాతో ముగ్గురి అరెస్టు



స్వాధీనంచేసుకున్న సారాతో ఎస్ఈబీ, పోలీస్ సిబ్బంది

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణం, కొమరాడ మండలం గుమడ గ్రామంలో ఎస్ఈబీ సీఐ ఉపేంద్ర, టాస్క్‌ఫోర్స్ సీఐ ఎంవీ గోపాలకృష్ణలు తమ సిబ్బందితో కలిసి మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇందులో 280 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సారా అమ్మకాలు, నిల్వ కేంద్రాలపై విస్తృతంగా దాడులు చేశామన్నారు. సారాతో పాటు రవాణాకు ఉపయోగించే 9 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురిని అరెస్టుచేసి జుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచామని తెలిపారు. మరో ఐదుగురిపై కేసు నమోదు చేశామని, వారిని కూడా అరెస్టు చేస్తామని చెప్పారు. దాడుల్లో ఎస్‌ఐ రాజశేఖర్, పట్టణ ఎస్‌ఐ ఫకృద్దీన్, రూరల్ ఎస్‌ఐ సింహాచలం, కొమరాడ ఎస్‌ఐ జగదీష్‌నాయుడు పాల్గొన్నారు.

సీతంపేట టూరిజానికి ఉత్తమ అవార్డు



పర్యాటక శాఖమంత్రి ఆర్కే రోజా చేతుల మీదుగా శిల్పారామంలో అవార్డు అందుకుంటున్న వర్మియల్, జానకీరావు

సీతంపేట: ఏపీ టూరిజం శాఖ 22 అంశాల్లో అవార్డులు ప్రకటించింది. దీనిలో సీతంపేట టూరిజంకు బెస్ట్ అడ్వెంచర్ ఇన్‌బౌండ్ టూర్ ఆపరేటర్ ఫర్ ల్యాండ్, ఏరో అండ్ వాటర్ స్పోర్ట్స్ కేటగిరీలో బెస్ట్ అవార్డు లభించింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా తిరుపతిలోని శిల్పారామంలో జరిగిన రాష్ట్రస్థాయి అవార్డుల ప్రదానోత్స కార్యక్రమంలో పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా చేతుల మీదుగా సవరఆర్ట్స్ కమిటీ సభ్యులు ఎస్.వర్మియల్, జానకీరావులు అవార్డు అందుకున్నారు.

క్లుప్తంగా

తలసేమియా రోగులకు ఉచితంగా రక్తం

విజయనగరం ఫోర్ట్: సికిల్‌సెల్ ఎనిమియా, తలసేమియా రోగులకు రెడ్ క్రాస్ సోసైటీ ద్వారా ఉచితంగా రక్తం అందిస్తున్నట్టు రెడ్ క్రాస్ సోసైటీ కార్యదర్శి పి.సత్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తం అవసరమైన వారు వ్యాధి నిర్ధారణ పరీక్షలకు సంబందించిన పత్రాల జిరాక్స్ కాపీలను అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రోగులు వినియోగించుకోవాలని కోరారు.

ఉచిత వైద్య సేవలు



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సంతోష్

విజయనగరం ఫోర్ట్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పిజిస్టార్ ఆస్పత్రి వైద్యుడు సంతోష్ కోరారు. ఎముకలు, కీళ్ల వ్యాధులతో బాధపడుతున్న రోగులకు స్థానిక ఆస్పత్రిలో మంగళవారం ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. మందులు అవసరమైన వారికి ఉచితంగా అందజేశారు.

దుప్పాడలో స్వచ్ఛతే సేవ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గ్రామంలో మంగళవారం 'స్వచ్ఛతే సేవ' కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ కరుమజ్జి లక్ష్మి ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛ సంకల్పంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు. ర్యాలీలో జలజీవన్ మిషన్ గ్రూప్ లీడర్ బొత్స రాజేష్, ఐఈసీ కోఆర్డినేటర్ ఎస్వీ కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి టి.వెంకటరావు, ఆర్‌డబ్ల్యూఎస్, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



భరతనాట్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి రైల్వేస్టేషన్ వనంగుడి ఆవరణలో టేకి సత్యనారాయణ బృందం నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన వీక్షకులను అలరించింది. చిన్నారులు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ ఈఓ కిశోర్ పర్యవేక్షించారు.

అలరించిన వీణ కచేరీ

విజయనగరం టౌన్: స్థానిక ఎంఆర్ లేడీస్ రిక్రియేషన్, వెల్ఫేర్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి జానకీ వాసా, బులుసు సంధ్యారూపలు నిర్వహించిన వీణా కచేరీ ఆద్యంతం అలరించింది.

కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభం



కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మురళీకృష్ణ

విజయనగరం పూల్‌బాగ్: నేటి సమాజానికి కంప్యూటర్ విద్య అనేది ప్రాణవాయువు అని రాష్ట్ర విజ్ఞాన కేంద్రాల కన్వీనర్ పి.మురళీకృష్ణ అన్నారు. గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో స్కిల్ డవెలప్‌మెంట్ సెంటర్, కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి టి.సూర్యనారాయణ, టీవీ రమణ, గురజాడ విజ్ఞాన కేంద్ర ప్రతినిధులు జి.శ్రీనివాస్, సతీష్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

కేంద్రాస్పత్రిలో అధునాతన వైద్య సేవలు



సిటిస్కాన్ కోసం వచ్చిన రోగులు

- బోధనాస్పత్రిగా మార్పు
- అందుబాటులోకి రానున్న స్పెషాలిటీ వైద్యసేవలు
- ఉచితంగా ఎంఆర్ఐ, సిటిస్కాన్ సేవలు
- శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు

విజయనగరం ఫోర్ట్:

జిల్లా కేంద్రాస్పత్రిలో అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ప్రభుత్వ వైద్య కళాశాలకు సంబంధించి బోధనాస్పత్రిని కేంద్రాస్పత్రిలో ఏర్పాటు చేయనుండడంతో స్పెషాలిటీ వైద్య సేవలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తున్నాయి. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా కేంద్రాస్పత్రి రూపరేఖలు పూర్తి స్థాయిలో మారనున్నాయి. ఆస్పత్రిని చూడగానే ఆహ్లాదకరంగా కనిపించేలా వివిధ పనులు చేపడుతున్నారు.

జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరు అయింది. గాజులరేగ సమీపంలో రూ.500 కోట్లతో నిర్మాణం చేపడుతున్నారు. 2023 విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. తాత్కాలికంగా కేంద్రాస్పత్రిలో బోధనాస్పత్రిని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.8.50 కోట్లు నిధులు మంజూరు చేసింది. దీంతో ఆస్పత్రి నిర్వాహణకు అవసరమైన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండు ఆపరేషన్ థియేటర్స్ నిర్మాణం పూర్తయింది. 60 పడకల ఐసీయూ నిర్మిస్తున్నారు. సెంట్రల్ ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆస్పత్రిలోని అన్ని భవనాలు, కారిడార్ నూతనంగా పెయింటింగ్ వేస్తున్నారు. ప్రధాన ద్వారం వద్ద డిస్‌ప్లే బోర్డు లైటింగ్‌తో ఏర్పాటు చేయనున్నారు.



కేంద్రాస్పత్రిలో గోడకు పుట్టీ పెడుతున్న కార్మికుడు

ఎంఆర్ఐ, సిటిస్కాన్ సేవలు ఉచితమే..

కేంద్రాస్పత్రిలో కార్పొరేట్ ఆస్పత్రుల కంటే అధునాతన ఎంఆర్ఐ, సిటిస్కాన్ యంత్ర పరికరాలు ఉన్నాయి. ఆస్పత్రికి వచ్చే రోగులకు సిటిస్కాన్, ఎంఆర్ఐ స్కాన్ సేవలు ఉచితంగా అందిస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రిలో సిటిస్కాన్‌కు రూ. 2500, ఎంఆర్ఐ స్కాన్‌కు రూ.4 వేలు వరకు వసూలు చేస్తున్నారు. అదేవిధంగా కేంద్రాస్పత్రి ఎన్‌సీడీ విభాగంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారు. వృద్ధులకు ప్రత్యేక ఓపీ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ 60 ఏళ్లు దాటిన వృద్ధులకు బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేస్తారు.



రోగికి ఎంఆర్ఐ స్కాన్ చేస్తున్న టెక్నీషియన్

> **మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం**
>
> కేంద్రాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. అధునాతన ఎంఎఆర్ఐ, సిటిస్కాన్ యంత్ర పరికరాలు, ఆపరేషన్ థియేటర్ ఉన్నాయి. మెరుగైన వైద్య సేవలు అందిస్తుండడంతో ఆస్పత్రికి వచ్చ రోగుల సంఖ్య పెరుగుతోంది.
>
> – డాక్టర్ కె.సీతారామరాజు, సూపరింటెండెంట్, కేంద్రాస్పత్రి

2 వేల వరకు ఓపీ

కేంద్రాస్పత్రిలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, చర్మ వ్యాధులు, పిడియాట్రిక్, ఎముకలు, ఎన్‌సీడీ, ఏఆర్‌టీ, కంటి, ఈఎన్‌టీ, దంత ఓపీ విభాగాలు ఉన్నాయి. ఆస్పత్రికి రోజుకు సగటున 1500 నుంచి 2 వేల మంది వరకు రోగులు వైద్య సేవలు పొందేందుకు వస్తారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి 'చేయూత'



చేయూత లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

పూసపాటిరేగ: ప్రభుత్వం మంజూరు చేసిన వైఎస్సార్ చేయూత పథకంతో మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందుతున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన 'వైఎస్సార్ చేయూత' మూడోవిడత కార్యక్రమంలో వారు పాల్గొని లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పూసపాటిరేగ మండలంలో మూడో విడతలో 5,393 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.10.11 కోట్లను ప్రభుత్వం జమ చేసిందన్నారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా, వారి ఆత్మగౌరవాన్ని మరింత పెంచేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. అంతకుముందు లబ్ధిదారులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం 97 మంది అంగన్‌వాడీ కార్యాకర్తలకు ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, జెడ్పీటీసీ మహంతి సీతాలక్ష్మి, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, పి.లక్ష్మీనారాయణ, పి.ఎల్లంనాయుడు, రౌతు సాయికుమార్, ఎంపీడీఓ జి.రామారావు, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, వెలుగు ఏసీ రాజ్యలక్ష్మి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ పదోన్నతులు రద్దు చేయాలి

- ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సన్యాసిరాజు

విజయనగరం పూల్‌బాగ్: అక్రమ పదోన్నతులు రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ హాల్‌లో జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో టి.సన్యాసిరాజు అధ్యక్షతన మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక ప్రతినిధులు మాట్లాడుతూ ఎయిడెడ్ పాఠశాలల విలీనంలో భాగంగా పలువురు ఎయిడెడ్ ఉపాధ్యాయులను జిల్లా పరిషత్, మున్సిపల్ మేనేజ్‌మెంట్‌లో ప్రభుత్వం విలీనం చేసిందన్నారు. కామన్ సీనియారిటీని పరిగణనలోనికి తీసుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా వారికి పదోన్నతులు కల్పించిందన్నారు. అవి పూర్తిగా అక్రమ పదోన్నతులని, వాటిని రద్దు చేసి సీనియర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు డి.ఈశ్వరరావు, డి.శ్యామ్, కె.ఈశ్వరరావు, డి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, రామునాయుడు, కె.సన్యాసినాయుడు, కంది వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర చేసే హక్కు రైతులకు ఉంది

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

విజయనగరం గంటస్తంభం: రాష్ట్రంలో పాదయాత్ర చేసే హక్కు ఎవరికైనా ఉందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి రైతులు రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా పాదయాత్ర చేసుకునే హక్కు ఉందని, వారికి హైకోర్టు కూడా అనుమతి ఇచ్చిందన్నారు. ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పును తప్పుపట్టారు. రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డి పావని, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు కేతినేని సురేంద్రమోహన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తీగల హరినాథ్, కోటగిరి నారాయణరావు, జిల్లా నాయకులు బగ్గాం రాజేష్, బవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి, కుసుమంచి సుబ్బారావు, బొబ్బిలి శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారం



మంచినీటి బోరును ప్రారంభించిన ఎమ్మెల్యే బడ్డుకొండ

పూసపాటిరేగ: మండలంలోని చోడమ్మ అగ్రహారంలో 24 గంటలు విద్యుత్ సరఫరాకు ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను, రక్షిత మంచినీటి బోరును ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మంగళవారం ప్రారంభించారు. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తుతుండడంతో బోరు పనిచేయక తాగునీటి కోసం గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. గడపగడపకు కార్యక్రమంలో స్థానికులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎన్.సత్యనారాయణరాజు, సర్పంచ్ కొత్తకోట శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతీ అమ్మవారికి విశిష్ట పూజలు

విజయనగరం టౌన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక రింగురోడ్డులోని జ్ఞాన సరస్వతీ ఆలయంలో శారదా సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. యోగాంజనేయస్వామికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం గోమాతకు పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి పల్లకి సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విజయనగరం రూరల్: మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రీమాపేట పంచాయతీ పరిధిలో సుధాకృష్ణా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకల్లో మంగళవారం అమ్మవారిని బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి పూజలు చేశారు.

రూ.2 లక్షల విలువచేసే బారికేడ్ల వితరణ



ఆలయ ఈఓకు బారికేడ్లను అందిస్తున్న దాతలు ధర్మేంద్ర, మోహిని దంపతులు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా పట్టణంలోని కళావైభవ్ షాపింగ్‌మాల్ అధినేత తిరువీధుల ధర్మేంద్ర, నాగమోహిణి దంపతులు రూ.2 లక్షలు విలువచేసే 20 బారికేడ్లను వితరణ చేశారు. వాటిని ఆలయ కార్యనిర్వహణాధికారి బీహెచ్‌వీఎస్‌ఎన్ కిశోర్‌కుమార్‌కు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి జాతర నిర్వహణకు దాతలు అందిస్తున్న సహాయం ఎనలేనిదన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. దాతలకు అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, సూపర్‌వైజర్లు ఏడుకొండలు, రామారావు పాల్గొన్నారు.

కోలగట్లను కలిసిన ఏపీ ఎన్జీఓ ప్రతినిధుల



కోలగట్లను అభినందిస్తున్న ఏపీ ఎన్జీఓ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: శాసన సభ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన కోలగట్ల వీరభద్రస్వామిని ఏపీ ఎన్జీఓ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కోలగట్లను కలిసిన వారిలో ఏపీ ఎన్జీఓ జేసీ జిల్లా చైర్మన్ జె.మురళి, ఉపాధ్యక్షుడు వై.ఆనంద్‌కుమార్, ఎం.శ్రీను, సుధాకర్, మూర్తి, శ్రీధర్, నీలాద్రినాయుడు, 4వ తరగతి ఉద్యోగుల సంఘ నాయకులు ఎం.గంగాప్రసాద్, పి.చంద్రశేఖరరాజు ఉన్నారు.



ఎమ్మెల్యే కోలగట్లను సత్కరిస్తున్న హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కోలగట్లకు అభినందనలు

విజయనగరం: శాసన సభ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన కోలగట్ల వీరభద్రస్వామిని జిల్లా హోటల్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఆయన నివాసంతో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, కార్యదర్శి పి.వాసు, ఉదయ్, గౌరవాధ్యక్షుడు వై.బాబూరావు తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ



చిన్నారికి బహుమతి అందజేస్తున్న సూపర్‌వైజర్ అనురాధ

విజయనగరం ఫోర్ట్: గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.అనురాధ సూచించారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని నాగవంశంపువీధి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం 'ఆరోగ్యకరమైన బిడ్డలు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉన్న పిల్లలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుంచి మంచి పౌష్టికాహారం ఇవ్వడం ద్వారా వారు రక్తహీనతకు గురికాకుండా పూర్తి ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు అందించాలని, ఏడో నెల నుంచి తల్లిపాలతో పాటు అదనపు ఆహారం ఇవ్వాలని సూచించారు. పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు దేవి, సత్యలు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ చేయూత అందజేత



గంటా వెంకటరావు, ఎంపీడీఓ

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని ఆనంద గజపతి ఆడిటోరియంలో వైఎస్సార్ చేయూత మూడోవిడత కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంటా వెంకటరావు తెలిపారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేతులమీదుగా చేయూత లబ్ధిదారులకు మూడోవిడత నగదు చెక్కును అందజేయనున్నట్లు చెప్పారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 3212 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ రూ.18,750 చొప్పున రూ.6,02,25,000లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

పక్కాగా భూముల రీసర్వే



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు

విజయనగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల సమగ్ర రీసర్వేను విజయవంతం చేయాలని అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు దిశా నిర్దేశం చేశారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, అడ్మిన్, ఎమినిటీస్ అసిస్టెంట్లు, వీఆర్వోలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. భూముల రీసర్వే విధివిధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి అవగాహన కల్పించారు. నగరంలో చేపట్టనున్న భూముల రీసర్వేలో సిబ్బంది సమన్వయంతో పని చేసి ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. రికార్డులను పక్కాగా సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ అధికారులు మధుసూదనరావు, అమ్మాజీరావు, సర్వేయర్ సింహాచలం, టీపీఓ పద్మ, టీపీబీఓ ఫిలిప్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలి

భోగాపురం రూరల్: ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలని ఎంపీడీఓ దాసరి బంగారయ్య అన్నారు. ఈ మేరకు సచివాలయ సిబ్బందికి, వలంటీర్లు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రంలో మంగళ, బుధవారాల్లో రెండు రోజులపాటు ప్రత్యేక క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుని బయెమెట్రిక్ తప్పనిసరిగా అవసరమైన విద్యార్థులను ఆధార్ కేంద్రాల వద్దకు తీసుకువెళ్లే ఏర్పాట్లు చేయాలని సూచించారు. మండలంలోని సవరవల్లి సచివాలయ పరిధిలో మంగళవారం 25 మంది చిన్నారులకు బయోమెట్రిక్ నమోదు చేసినట్లు డిజిటల్ అసిస్టెంట్ ఎస్.వివేక్ తెలిపారు.

10 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

విజయనగరం క్రైమ్: స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో పేకాట ఆడుతున్న పది మందిని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.19,190 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదుచేసినట్లు సీఐ బి.వెంకటరావు తెలిపారు.

రాకోడులో ఆధార్ కేంద్రం ఏర్పాటు

విజయనగరం రూరల్: మండలంలోని రాకోడు గ్రామంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని సర్పంచ్ పి.వెంకటరమణ మంగళవారం తెలిపారు. వచ్చే నెల 1 వరకు ఈ కేంద్రంలో ఆధార్‌లో తప్పుల సవరణ, చిరునామా మార్పు, మొబైల్ నంబర్ అనుసంధానం, చిన్నారులకు కొత్తగా ఆధార్ నమోదు, ఐదేళ్లు దాటిన పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్ వంటి సేవలు అందిస్తారన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

భూ వివాదంపై కేసు నమోదు

విజయనగరం క్రైమ్: భూమి వివాదానికి సంబంధించి వెస్ట్ సబ్ రిజిస్ట్రార్ వన్‌టౌన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించి వన్‌టౌన్ సీఐ వెంకటరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లాకు చెందిన సూరి సింహాద్రి అనే వ్యక్తి తనకున్న మూడెకరాల భూమిని విక్రయించాడు. ఆ తరువాత విశాఖలో ఉంటున్న తన పిల్లల పేరిట మరలా రిజిస్ట్రేషన్ చేయించాడు. దీంతో విషయం తెలుసుకున్న బాధితులు జిల్లా రిజిస్ట్రార్‌ను ఆశ్రయించారు. వారి ఆదేశాలతో తనిఖీలు చేసిన సబ్ రిజిస్ట్రార్ రామకృష్ణ వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆశా పారేఖ్

సందర్భం

ఫాల్కే పారేఖ్

'కటీ పతంగ్'
'జబ్ ప్యార్ కిసీసే హోతా హై'
'తీస్రీ మంజిల్'
'కారవాన్'...
ఆశా పారేఖ్‌ను గుర్తు చేసుకుంటే ఈ సూపర్ హిట్స్ అన్నీ గుర్తుకొస్తాయి. 'జూబ్లీ గర్ల్' 'హిట్ గర్ల్' ఆశా బిరుదులు. ఆమె నటిస్తే సినిమాకు శకునం బాగుంటుందని నమ్మేవారు. ఐదు దశాబ్దాలు సినిమా రంగంలో ఉన్నా కాంట్రవర్సీలు లేవు. సినిమా రంగంలో సుదీర్ఘమైన ఆమె కృషికి నేడు 'దాదాసాహెబ్ ఫాల్కే' దక్కింది. కేంద్ర సెన్సార్‌బోర్డుకు తొలి మహిళా చైర్మన్‌గా పని చేసిన ఆశా పారేఖ్ దాదాసాహెబ్ ఫాల్కేతో సినిమా రంగంలో తన ఖ్యాతిని సంపూర్ణం చేసుకుంది.

ముంబై శాంటా క్రజ్‌లో ఆశా పారేఖ్ నడిపే హాస్పిటల్ ఉంది. వంద పడకల హాస్పిటల్ అది. పేదవారికి తక్కువ ఫీజుతో, కట్టగలిగే వారికి మామూలు ఫీజుతో వైద్యం చేస్తారక్కడ. జనంలో ఆ హాస్పిటల్‌కు మంచి పేరు ఉంది. ఎందుకంటే ఆశా పారేఖ్ దాని వ్యవహారాలు శ్రద్ధగా పట్టించుకుంటుంది. చిన్నప్పుడు పారేఖ్‌కు డాక్టర్ కావాలని ఉండేది. కాని హైస్కూల్లో చదివేప్పుడు రోడ్డు మీద ఒక యాక్సిడెంట్ చూసి– అక్కడంతా రక్తం పారి ఉంటే– డాక్టర్ అయితే ఇంత రక్తం చూడాలి కదా అని ఆ ఆలోచన విరమించుకుంది. డాన్స్ అన్నా ఆమెకు బాగా ఇష్టం. కథక్, భరత నాట్యం, ఒడిస్సీ నేర్చుకుంది. సినిమాల్లోకి వెళ్లాలని లేదు. కాని సినిమా వాళ్లు ఆమెలోని వెలుగును కనిపెట్టకుండా పోలేదు.

•••

శాంటాక్రజ్‌లో రెండు డబ్బున్న కుటుంబాలు ఉండేవి. ఒక బోహ్రా ముస్లిం కుటుంబం. మరొకటి గుజరాతీ కుటుంబం. గుజరాతీ కుటుంబంలోని అబ్బాయి– బచ్చుభాయ్ పారేఖ్ ముస్లిం కుటుంబంలోని అమ్మాయి సల్మా లఖడ్‌వాలాను ప్రేమించాడు. సల్మా ఆ రోజుల్లోనే పూణె వెళ్లి చదువుకునేది. ఆమెను కలవడానికి ప్రతి ఆదివారం బచ్చుభాయ్ పూణె వెళ్లేవాడు. వీళ్ల ప్రేమ దాగలేదు. వారూ దాచదల్చలేదు. ఇద్దరూ పెద్దల అనుమతి లేకుండా రిజిస్టర్డ్ మేరేజ్ చేసుకున్నారు. ఆ తర్వాత సల్మా పేరు సుధా అయ్యింది. వారికి 1942 అక్టోబర్ 2న ఆశా పుట్టింది.

•••

వీళ్లు ఉంటున్న ఇంటి పక్కనే ఒక చార్టర్డ్ అకౌంటెంట్ ఉంటే సినిమా వాళ్లు టాక్స్ లావాదేవీల కోసం వచ్చి అక్కడే తిరిగే ఆశాను చూశారు. కాలేజ్‌కు వచ్చిన ఆశా మెరుస్తూ ఉండేది. 'గూంజ్ ఉఠీ షెహనాయి' సినిమా కోసం ఆశాను బుక్ చేసి రెండ్రోజులు షూటింగ్ చేసి 'నీలో హీరోయిన్ అయ్యే లక్షణాలు లేవు' అని పంపించేశారు. మొదటి దెబ్బ. ఎవరైనా విలవిలలాడతారు. అది జరిగిన పది రోజులకు దర్శకుడు నాసిర్ హుసేన్ 'దిల్ దేకే దేఖో' (1959)లో హీరోయిన్‌గా బుక్ చేశాడు. 'ఒక సినిమాలో పెట్టి తీసేశారు' అని నాసిర్ హుసేన్‌కు చెప్పినా 'నాకు కావాల్సింది స్వచ్ఛంగా నవ్వే అమ్మాయి. ఆమె హాయిగా నవ్వితే చాలు' అని బుక్ చేశాడు.

■ ఆశా టాప్ టెన్ సినిమాలు

1. దిల్ దేకే దేఖో 2. జబ్ ప్యార్ కిసీసే హోతాహై 3.జిద్దీ 4. దో బదన్ 5.లవ్ ఇన్ టోక్యో 6.తీస్రీ మంజిల్ 7.ఉప్‌కార్ 8.కటీ పతంగ్ 9.కారవాన్ 10.మై తులసీ తేరే ఆంగన్ మే

■ ఆశా టాప్ టెన్ పాటలు

1. జాయియే ఆప్ కహా జాయేంగే (మేరే సనమ్)
2. సాయొనారా సాయొనారా (లవ్ ఇన్ టోక్యో)
3. పర్దే మే రెహెనే దో (షికార్)
4. అచ్చా తో హమ్ చల్తే హై (ఆన్ మిలో సజ్‌నా)
5. నా కోయి ఉమంగ్ హై (కటీ పతంగ్)
6. నిసుల్తానా రే (ప్యార్ కా మౌసమ్)
7. ఆయా సావన్ ఝూమ్ కే (ఆయా సావన్ ఝూమ్ కే)
8. కిత్ నా ప్యారా వాదా హై (కారవాన్)
9. ఆంఖోసే జో ఉత్‌రీ హై దిల్ మే (ఫిర్ వహీ దిల్ లాయా హూ)
10. తేరే ఆంఖోంకే సివా దునియామే రఖ్హా క్యా హై (చిరాగ్)

డాన్సులు, డైలాగులు ఆశాకు ఇబ్బంది కాలేదు. మొదటి సినిమా. నాసిర్ హుసేన్‌కు పాటలు ముఖ్యం. ఆ పాటల్లో లిప్ సింక్ చేయడం ఆశాకు వచ్చేది కాదు. షమ్మీ కపూర్ ఆమెకు పాటల్లో ఎలా చేయాలో చూపించాడు. తొలి గురువు. ఆ తర్వాత ఆశా పాటలకు పెట్టింది పేరు అయ్యింది. షమ్మీను ఆశా 'చాచా' (చిన్నాన్న) అని పిలిచేది. 'దిల్ దేకే దేఖో'లో 'దిల్ దేకే దేఖో దిల్ దేకే దేఖో దిల్ దేకే దేఖోజీ... దిల్ లేనే వాలో దిల్ దేనా సీఖోజీ' పాట పెద్ద హిట్.

•••

ఆశా పారేఖ్ నటనను తీర్చిదిద్దిన మరో దర్శకుడు విజయ్ ఆనంద్. ఆమె రెండో సినిమా 'జబ్ ప్యార్ కిసీసే హోతాహై'కి దర్శకుడు అతడే. దేవ్ ఆనంద్ తమ్ముడు. ఆ సినిమాకు దేవ్ ఆనంద్ హీరో. అప్పటి వరకూ దర్శకుడుగా ఉన్న నాసిర్ హుసేన్ ఈ సినిమాతో నిర్మాతగా మారాడు. 'సౌ సాల్ పెహెలే ముఝే తుమ్ సే ప్యార్ థా' పాట అందులోదే. దేవ్ ఆనంద్ వంటి సీనియర్ పక్కన ఆశా నిభాయించుకుని రాగలిగింది. దీని తర్వాత నాసిర్ హుసేన్ 'ఫిర్ వహీ దిల్ లాయాహూ' తీశాడు. ఇందులో జాయ్ ముఖర్జీ హీరో. ఆశా పారేఖ్ హీరోయిన్. సినిమా పెద్ద హిట్ అయ్యింది. కాని ఆశా పారేఖ్ 'స్టార్‌డమ్'కు చేరుకున్నది మాత్రం 'తీస్రీ మంజిల్'తోనే. దీనికి నిర్మాత నాసిర్ హుసేన్. దర్శకుడు విజయ్ ఆనంద్. హీరో షమ్మీ కపూర్. మర్డర్ మిస్టరీ అయిన ఈ సినిమా సూపర్‌డూపర్ హిట్ అయ్యింది. షమ్మీ కపూర్‌తో ఆశా జంట పూర్తిగా పండింది. 'ఓ మేరే సోనరే సోనరే సోనరే' పాటతో ఆశా పారేఖ్ సినిమా రంగానికి బంగారం అని స్థిరపడింది.

•••

ఆశా పారేఖ్ బ్లాక్ అండ్ వైట్ కాలంలో హిట్స్ ఇచ్చింది. కలర్ వచ్చాక హిట్స్ ఇచ్చింది. మహిళా అభిమానులు విపరీతంగా ఉన్న దేవ్ ఆనంద్‌తో నటించింది. ఆ తర్వాత అంతకు మించిన ఫ్యాన్స్‌ను చూసిన రాజేశ్ ఖన్నాతో నటించింది. రాజేశ్ ఖన్నాతో కలిసి ఆశా నటించిన 'బహారోంకే సప్‌నే', 'ఆన్ మిలో సజ్‌నా', 'కటీ పతంగ్' సూపర్ హిట్స్ అయ్యాయి. 'కటీ పతంగ్' లో వితంతువుగా నటిస్తూ తన ప్రేమను వ్యక్తపరచలేక సతమతమయ్యే ఆశా పారేఖ్‌ను ప్రేక్షకులు మెచ్చారు. రాజేశ్ ఖన్నాతో ఆశా పాడిన 'ఆజా పియా తుజే ప్యార్ దూ', 'అచ్చా తో హమ్ చల్తే హై'... ఎవరూ మరువలేదు.

•••

ఆశా పారేఖ్‌ను ప్రతి హీరోతో చేసింది– దిలీప్ కుమార్‌తో తప్ప. ధర్మేంద్రతో నటించిన 'ఆయే దిన్ బహార్ కే', 'ఆయా సావన్ ఝూమ్ కే' సూపర్‌హిట్లు. తాగి షూటింగ్ చేస్తే సెట్స్‌కు రాను అని ధర్మేంద్రకు వార్నింగ్ ఇచ్చి మరీ నటించింది ఆశా. మనోజ్ కుమార్‌తో చేసిన 'ఉప్‌కార్', జితేంద్రతో చేసిన 'కారవాన్', శశి కపూర్‌తో 'ప్యార్ కా మౌసమ్' పెద్ద హిట్లయ్యాయి. అలాగని అన్నీ తేలిక పాత్రలే ఆశా చేయలేదు. 'మై తులసీ తేరే ఆంగన్ మే', 'చిరాగ్' వంటి సినిమాలలో గట్టి పాత్రలు చేసింది. ఆశా పారేఖ్ సినిమాల్లోకి వచ్చినప్పుడు సాయిరా బాను, వహీదా రెహమాన్, నూతన్, మాలా సిన్హా వంటి వారు పోటీకి వచ్చేవారు. కలర్ సినిమాలు వచ్చాక గ్లామర్ పాత్రలు చేసే ముంతాజ్, హేమమాలిని వచ్చి గట్టి పోటీ ఇచ్చారు. అయినా సరే ఆశా తన వాటా సినిమాలతో దర్జాగా కొనసాగింది. ఆ తర్వాత కేరెక్టర్లు చేసినా మర్యాదగా వాటినీ విరమించింది.

ఆశా పారేఖ్ సినిమా రంగంలో నటిగా లేకపోయినా డిస్ట్రిబ్యూటర్‌గా, సినిమా నటుల అసోసియేషన్‌కు నాయకురాలిగా, టీవీ ప్రొడ్యూసర్‌గా ఎప్పుడూ సినిమా రంగంలోనే ఉంది. వహీదా రెహమాన్, హెలెన్ ఈమెకు మంచి స్నేహితులు. వహీదా రెహమాన్‌తో కలిసి అలాస్కా వెళ్లి ఆ గడ్డకట్టే మంచులో ఆ మధ్య 21 రోజులు ఉండి వచ్చింది. అప్పుడప్పుడు ఈ సీనియర్ నటీమణులంతా యాట్ మాట్లాడుకుని సముద్రంలో రోజుల తరబడి గడుపుతుంటారు. ఏ వెలితీ లేకుండా ఆమె జీవిస్తోంది. పెళ్లి చేసుకోకపోవడం వెలితి అని ఆమె భావించడం లేదు.

ఒక గ్లామర్ హీరోయిన్‌కి 'దాదాసాహెబ్ ఫాల్కే' దక్కడం వినోద రంగమైన సినిమాకు సబబైన గౌరవమే.

ఆశా పారేఖ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే

సుప్రసిద్ధ సినీ నటి ఆశా పారేఖ్‌కు 2020 సంవత్సరానికి సినిమా రంగానికి సంబంధించిన సర్వోన్నత పురస్కారం దాదాసాహెబ్ ఫాల్కే ప్రకటించారు. ఈమేరకు కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలియజేశారు. ఆశా పారేఖ్ (79)కు ఈ పురస్కారం రాబోయే శుక్రవారం నాటి 68వ జాతీయ పురస్కారాల ప్రదాన సభలో అందజేస్తారు. అవార్డుకు ఎంపిక చేసిన కమిటీలో ఆశా భోంస్లే, హేమమాలిని, పూనమ్ ఢిల్లాన్, ఉదిత్ నారాయణ్, టి.ఎస్. నాగాభరణ ఉన్నారు. 2019 సంవత్సరానికి రజనీకాంత్ ఈ పురస్కారం అందుకున్నారు.

పెళ్లెందుకు చేసుకోలేదు?

ఆశా పారేఖ్ పెళ్లి చేసుకోకపోవడం గురించి కథనాలు ఉన్నాయి. ఆమె సినిమా రంగంలో 'ఫ్లిర్ట్' అనే మాట వాస్తవం. హీరోలు ఆమె దగ్గర తోక జాడించడానికి జంకేవారు. సెట్‌లో పుస్తకం చదువుకుంటూ కనిపించిన తొలి హీరోయిన్లలో ఆమె ఒకరు. కాని తనను హీరోయిన్ చేసిన నిర్మాత–దర్శకుడు నాసిర్ హుసేన్ (ఆమిర్ ఖాన్ చిన్నాన్న) ను ఆమె ఇష్టపడింది. ప్రేమించింది. అతడు తాను తీసిన ప్రతి సినిమాలో ఆమెనే హీరోయిన్‌గా పెట్టాడు. అయితే వాళ్లు పెళ్లి చేసుకోలేదు. కారణం అప్పటికే అతడికి పెళ్లయ్యి పిల్లలు ఉన్నారు. 'ఒకరి కాపురం కూల్చి నేను పెళ్లి చేసుకోవాలని అనుకోలేదు. ఎవరినీ బాధ పెట్టని జీవితం జీవించాలని అనుకున్నాను' అంటుంది ఆశా పారేఖ్. ఆమె జీవిత కథ 'హిట్ గర్ల్' ఆవిష్కరణకు నాసిర్ హుసేన్ పిల్లలు హాజరయ్యారు. నాసిర్–ఆశా ఆత్మిక అనుబంధానికి అందరూ గౌరవం ఇచ్చారనడానికి ఇది ఉదాహరణ.


'తీస్రీ మంజిల్'లో


నాసిర్ హుస్సేన్‌తో ఆశా పారేఖ్


'దిల్ దేకే దేఖో'లో


'లవ్ ఇన్ టోక్యో'లో

సృజన

తెలుగింటి బార్బీ

పట్టులంగా, ఓణీ కట్టిన బొమ్మలు
కాళ్లకు పారాణీ, నుదుటన బాసికం కట్టిన బొమ్మలు
పసుపు కొట్టే బొమ్మలు.. పందిట్లో బొమ్మలు
అమ్మవారి బొమ్మలు, అబ్బురపరిచే బొమ్మలు..
చిందేసే బొమ్మలు.. చిదిమి దీపం పెట్టుకోవచ్చు అనిపించే బొమ్మలు ..
ఎవ్వరి చూపులనైనా కట్టిపడేసేలా ఉండే బొమ్మలేవీ అంటే..
అవి దివ్య తేజస్వి చేతుల్లో రూపుదిద్దుకున్న అందమైన బొమ్మలై ఉంటాయి.


కళ్లకు కట్టిన సంప్రదాయం



వెస్ట్రన్ బార్బీ డాల్‌ను ఇండియన్ డాల్‌గా మార్చేసి, వాటిని మన సంప్రదాయ వేడుకలకు అనువుగా మార్చేసింది హైదరాబాద్ ఎఎస్‌రావు నగర్‌కు చెందిన దివ్య తేజస్వి. అమ్మాయి పుట్టుక నుంచి షష్టిపూర్తి వరకు ప్రతి వేడుకను బొమ్మల్లో అందంగానూ, అర్థవంతంగానూ చూపుతూ పది మందికి ఉపాధి కల్పిస్తోంది. భర్త ఉద్యోగరీత్యా బెంగుళూరులో ఉంటున్న దివ్య ఈ అందమైన బొమ్మల రూప కల్పన గురించి అడిగితే ఒక చిన్న ఆలోచన తన జీవితాన్ని ఎలా నిలబెట్టిందో, పదిమందికి ఆదాయవనరుగా ఎలా మారిందో నవ్వుతూ వివరించింది. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

''దసరా వచ్చిందంటే బొమ్మల కొలువు గురించి ఆలోచన చేయకుండా ఉండరు. అలాగే, ఒక బొమ్మనైనా ఇంటికి తెచ్చుకుంటారు. నేను ఇంట్లోనే బొమ్మల తయారీ మొదలుపెట్టాను.


దివ్య తేజస్వి

పాప ముచ్చట తీర్చిన బొమ్మ

అమ్మానాన్నలది వెస్ట్ గోదావరి. నాన్న ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. బయోకెమిస్ట్రీ చేశాను. జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం చేసేదాన్ని. పెళ్లయ్యాక మా వారి ఉద్యోగరీత్యా బెంగుళూరు వెళ్లాను. అక్కడ టీచర్‌గా ఉద్యోగంలో చేరాను. మాకు ఓ పాప. హ్యాపీగా గడిచిపోతున్నాయి రోజులు అనుకున్న సమయంలో కరోనా మా జీవితాలను దెబ్బతీసింది. మా ఉద్యోగాలు పోయాయి. అద్దె కట్టడానికి కూడా కష్టంగా ఉన్న రోజులు. ఇంట్లో ఖాళీగా ఉంటున్నాను. ఓరోజు మా పాప తన బొమ్మకి డ్రెస్ వేసివ్వమంటే, నా చీర అంచుతో చీరకట్టి, అలంకరించి ఇచ్చాను. దాన్ని ఫొటో తీసి ఇన్‌స్టా పేజీలో పెట్టాను.

ఆర్డర్లు తెచ్చిన బొమ్మలు

నేను పెట్టిన బొమ్మ ఫొటో నచ్చి అమెరికా నుంచి ఒక ఎన్ఆర్ఐ ఫోన్ చేశారు. 'నాకు ఆ బొమ్మ చాలా నచ్చింది. మా అమ్మాయి ఓణీ ఫంక్షన్ ఉంది. వచ్చినవారికి రిటన్‌గిఫ్ట్ ఇవ్వాలి. నాకు అలాంటి బొమ్మలు ఒక పదిహేను కావాలి. చేసి స్తారా..' అంది. నాకు ఆశ్చర్యంతో పాటు ఆనందం కూడా వేసింది. ఆ నెల రెంట్ ఇవ్వకుండా ఓనర్‌తో మాట్లాడి, ఆ డబ్బుతో బార్బీ బొమ్మలు, వాటికి కావల్సిన మెటీరియల్ తీసుకొచ్చాను. వ్యాపారం అనుకోలేదు. కానీ, ముందు గణేషుడి బొమ్మ తయారు చేశాను. ఆ ముద్దు వినాయకుడిని చూసి ఆ రోజు కళ్లలో నీళ్లు వచ్చేశాయి. ఇక వెస్టన్ కల్చర్‌తో ఉండే బార్బీ బొమ్మను తెలుగింటి సంప్రదాయం అద్దుకునేలా తయారు చేయడానికి చాలా ప్రయోగాలే చేయాల్సి వచ్చింది. జుట్టు రంగు, స్కిన్ కలర్, కళ్లు.. వీటితో పాటు డ్రెస్సింగ్.. చాలా సమయమే తీసుకుంది. కానీ, ఒక్కో బొమ్మ తయారు చేసి, అనుకున్న సమయానికి పంపాను. ఆ ఆర్డర్ తర్వాత మరో ఆర్డర్ వచ్చింది. అలా వచ్చిన డబ్బుతో ఇంటి అద్దె కట్టాం.





సందర్భానికి తగిన కానుకలు

మా అమ్మానాన్నలకు నేను, చెల్లి సంతానం. మా చిన్నప్పుడు మేం ఆడుకోవడానికి మా అమ్మ క్లాత్‌తో బొమ్మలు కుట్టి, చీరలు కట్టి, వాటికి పూసలతో అలంకారం చేసేది. నాకు అదంతా గుర్తుకువచ్చింది. మన సంప్రదాయాల్లో ఎన్నో పండగలు ఉన్నాయి. వాటిని ఉదాహరిస్తూ బొమ్మలు తయారు చేసేదాన్ని. మొదట్లో అంతగా గుర్తింపు లేదు కానీ మెల్ల మెల్లగా గుర్తింపు రావడం మొదలైంది.

పుట్టుక నుంచి షష్టిపూర్తి వరకు

అమ్మాయి పుట్టిన నాటి నుంచి ప్రతీది వేడుకలాగే సాగుతుంది ఆమె జీవితం. ఒక ఆర్డర్ అయితే వాళ్లమ్మాయి మొదటి రోజు స్కూల్‌కి వెళుతోంది, ఆ రోజును పురస్కరించుకుని బొమ్మ కావాలని అడిగారు. ఉయ్యాల నుంచి విద్యాభ్యాసం, ఓణీ ఫంక్షన్, పెళ్లి, సీమంతం, గృహప్రవేశం, షష్టిపూర్తి ... వరకు ఇలా ప్రతి దశలోనూ జరిగే వేడుక సందర్భాన్ని తీసుకొని, దానికి అనుగుణంగా బొమ్మల సెట్స్‌ను తయారుచేయడం ప్రారంభించాను. ఆర్డర్లు పెరుగుతున్నాయి. నాతోపాటు నాకు తెలిసిన స్నేహితులు జత కలిశారు. ఆర్డర్లు పెరుగుతున్న కొద్దీ వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఒకరు డ్రెస్ కుడతారు, మరొకరు హెయిర్ బ్లాక్‌గా రావడానికి, ఇండియన్ స్కిన్ కలర్‌కి తేవడానికి, కళ్లు డిజైన్ చేయడానికి కష్టపడతారు. మొదట్లో నాకు ఒక్క బొమ్మ చేయడానికి రోజు మొత్తం పట్టేది. ఇప్పుడు 2–3 గంటలు పడుతుంది. నేను చేసిన విధానం నేర్పించి, నా పనిలోకి తీసుకున్నవారిలో కాలేజీ అమ్మాయిలు, గృహిణిలు ఉన్నారు. వాళ్ల ఇంటి వద్దే వర్క్ చేసిచ్చేవారున్నారు. హైదరాబాద్‌లో ఉన్న మా అమ్మ, చెల్లెలు కూడా ఈ బొమ్మల తయారీలో భాగమయ్యారు. మా అమ్మ, మా చెల్లెలు బొమ్మలకు జడలు, పువ్వులు కుట్టి, పంపుతారు. మా వారు షాపింగ్ చేసుకొస్తారు. ఆన్‌లైన్‌లో చూసి, నేర్చుకోవడానికి వచ్చిన అమ్మాయిలు అలంకరణలో మార్పులు చేర్పులు, ప్యాకింగ్‌లో సాయం చేస్తుంటారు. మా చెల్లెలు 'లలిత డాల్స్' అనే పేరుతో ఉన్న ఇన్‌స్టా పేజీలో ఫొటోలన్నీ అప్‌లోడ్ చేస్తూ ఉంటుంది. ఇలా కొందరి చేయూతతో నా బొమ్మలు మరింత అందంగా రూపుకడుతున్నాయి.

బడ్జెట్‌కు తగినట్టు..

ఒక బొమ్మ రూ. 200 నుంచి ధర ఉంది. వెడ్డింగ్ సెట్ అయితే రూ. 15000 వరకు ఉంటుంది. తక్కువ ధరలో సెట్ కావాలంటే అందుకు తగినట్టు కస్టమైజ్ చేసి ఇస్తున్నాను. ఇది దసరా సమయం కాబట్టి, అమ్మవారి బొమ్మలు, బతుకమ్మ ఆడుతున్న మహిళల బొమ్మల సెట్.. తయారుచేశాను. హైదరాబాద్‌లోని ఎఎస్‌రావునగర్‌లో ఇప్పుడు ఎగ్జిబిషన్ పెట్టాం. అమ్మాయి జీవితంలో ముఖ్యమైన ఘట్టాలతో పాటు పౌరాణిక గాథలు కూడా ఈ బొమ్మల ద్వారా చూపుతున్నాను'' అని వివరించింది ఈ కళాకారిణి.

– నిర్మలారెడ్డి

'అప్పు'డే కదా ఆనందం!

'అప్పు చేసి పప్పు కూడు తినవద్దు' అనే నీతి వాక్యం యువతరానికి తెలియనిదేమీ కాదు. అయితే 'అప్పు'డప్పుడు మాత్రం అప్పు చేస్తుంటారు. 'బై నౌ పే లేటర్' మెథడ్ ద్వారా తమకు ఇష్టమైన గ్యాడ్జెట్స్‌ను కొనే ధోరణి దేశవ్యాప్తంగా మిలీనియల్స్, జెనరేషన్ జెడ్‌లో పెరుగుతోంది...

యూత్ ప్లస్

'వాయిదా పద్ధతుంది దేనికైనా' అంటూ సప్లిమెంటరీ పరీక్షలను ఉద్దేశించి పాడుకుంది ఒకప్పటి యువత. ఈ తరం కూడా 'వాయిదా పద్ధతుంది దేనికైనా' అని పాడుకుంటుందిగానీ...అది పరీక్షల గురించి కాదు. షాపింగ్ గురించి!

'ఆన్‌లైన్ షాపింగ్ అంటే నాకు చాలా ఇష్టం. అయితే కరోనా వల్ల గత రెండు సంవత్సరాలుగా దీనికి చాలా దూరంగా ఉన్నాను. ఇప్పుడు ఎలాంటి టెన్షన్ లేదు కాబట్టి మళ్లీ షాపింగ్ చేయాలనుకుంటున్నాను' అంటుంది స్వర తేజస్వి. హైదరాబాద్‌లోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో కొత్తగా ఉద్యోగంలో చేరింది స్వర.

విశాఖపట్టణానికి చెందిన అంకిత ఇంజినీరింగ్ స్టూడెంట్. పండగరోజుల్లో ఏదో ఒక వస్తువు కొనడం తన హాబీ.

సాఫ్ట్‌వేర్ ప్రొఫెషన్‌లో ఉన్న స్వర, ఇంజినీరింగ్ చేస్తున్న అంకిత ఆన్‌లైన్ షాపింగ్ కోసం ఎంచుకున్న మార్గం బై నౌ పే లేటర్(బీఎన్‌పీఎల్)

రాబోయే పెద్ద పండగల నేపథ్యంలో ఇ–కామర్స్ సైట్‌లు, ఫిన్‌టెక్ స్టార్టప్‌లు, నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు(ఎన్‌బీఎఫ్‌సీ) యూత్, ముఖ్యంగా కొత్తగా ఉద్యోగంలో చేరిన వారిని ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఇ–కామర్స్ సైట్లు స్పెషల్ ఆఫర్స్‌తో ఊరిస్తున్నాయి. ఇక ఫిన్‌టెక్‌లు 'క్రెడిట్ స్కోర్'పై అంతగా దృష్టి సారించడం లేదు.

దేశవ్యాప్తంగా మిలీనియల్స్, జెనరేషన్ జెడ్ 'బీఎన్‌పీఎల్' వైపు ఆకర్షితం కావడానికి కారణం... దీన్ని అర్థం చేసుకోవడం, ఉపయోగించడం సులభం కావడం. కాంప్లికేటెడ్ రిజిస్ట్రేషన్ ప్రాసెస్, రిస్క్ లేకపోవడం. రుణగ్రహీత తన బడ్జెట్‌కు తగినట్లు ఫ్లెక్సిబుల్ రీపేమెంట్ ఆప్షన్‌ను ఎంపికచేసుకోవచ్చు. హిడెన్, ప్రాసెసింగ్ ఛార్జెస్ ఉండవు. జీరో డాక్యుమెంటేషన్ అనేది మరో ఆకర్షణ.

'బై నౌ, పే లేటర్' సర్వీసులు అన్నీ ఒకే రకంగా ఉన్నాయని కాదు. ప్రతికూలత, అనుకూలతలను పరిగణనలోకి తీసుకొని సర్వీస్‌లను ఎంపిక చేసుకుంటున్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 'ఫ్లెక్సిపే' లో ఒకే సారి పెద్ద మొత్తం చెల్లించనవసరం లేకుండా తమకు ఇష్టమైన స్నీకర్స్, ఇయర్ ఫోన్స్... మొదలైన వాటిని కొనవచ్చు. ఈ బ్యాంక్ డెబిట్ కార్డ్ ఉన్నవారు ఆటోమెటిక్‌గా 'ఫ్లెక్సీ పే' పేమెంట్ సర్వీస్‌కు అర్హులవుతారు. ఇదే బ్యాంక్ నుంచి 'ఈజీ ఈఎంఐ' సర్వీస్ కూడా అందుబాటులో ఉంది. టైట్ బడ్జెట్‌తో ఉన్నవారికి, అదే సమయంలో కాస్త ఖరీదైన గ్యాడ్జెట్‌లు కొనాలనుకునేవారికి ఈ సర్వీస్ ఉపయోగపడుతుంది అంటున్నారు.

సున్నా వడ్డీ, ప్రవేశ రుసుం లేని 'జెస్ట్ మనీ' బీఎన్‌పీఎల్‌లో పదివేల ఆన్‌లైన్ స్టోర్‌లు, డెబ్బై అయిదువేల రిటైల్ స్టోర్‌ల నుంచి కొనుగోలు చేయడానికి అంగీకారం ఉంది. ఇక 'ఫ్రీ ఛార్జ్ పే లేటర్'లో నుంచి ఇరవై అయిదు వేల ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రిటైల్ ఔట్‌లెట్స్ నుంచి కొనుగోలు చేయవచ్చు.



ఇ–కామర్స్ కంపెనీ ఫ్లిప్‌కార్ట్ తనదైన బీఎన్‌పీఎల్ వెర్షన్‌ను ప్రవేశపెట్టింది. అయితే దీనిలో ఫ్లిప్‌కార్ట్, ఫ్లిప్‌కార్ట్ రిటైల్ నుంచి మాత్రమే కొనుగోలు చేయడానికి వీలవుతుంది... ఇలా చెప్పుకుంటూ పోతే యువతను ఆకట్టుకుంటున్న బీఎన్‌పీఎల్‌లు ఎన్నో ఉన్నాయి.

అయినంత మాత్రాన 'ఎన్ని ఉన్నాయి అన్నది కాదన్నయ్యా....ఎంత సేఫ్ అనేది ముఖ్యం' అనే పాలసీని తుచ తప్పకుండా పాటిస్తోంది యూత్. ఆశగా, హడావిడిగా కొనుగోలు చేయడం కాకుండా ఈఎంఐ షెడ్యూల్ తెలుసుకుంటున్నారు. ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 'బెటర్ క్రెడిట్ లిమిట్‌కు–బెటర్ క్రెడిట్ స్కోర్ అవసరం' అనే విషయాన్ని విస్మరించడం లేదు.



జులన్... ఐదో ర్యాంక్‌తో ముగింపు

గతవారం అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన భారత మహిళల జట్టు పేస్ బౌలర్ జులన్ గోస్వామి తన కెరీర్‌ను ఐదో ర్యాంక్‌తో ముగించింది. మంగళవారం విడుదల చేసిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వన్డే ర్యాంకింగ్స్‌లో 39 ఏళ్ల జులన్ బౌలర్ల విభాగంలో 698 పాయింట్లతో తన ఐదో ర్యాంక్‌ను నిలబెట్టుకుంది. బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఐదో ర్యాంక్‌లో... స్మృతి మంధాన ఆరో ర్యాంక్‌లో నిలిచారు.



శుబ్‌మన్ గిల్ సెంచరీ

ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్ చాంపియన్‌షిప్‌లో భారత క్రికెటర్ శుబ్‌మన్ గిల్ తొలి సెంచరీ నమోదు చేశాడు. గ్లామోర్గన్ జట్టుకు ఆడుతున్న గిల్ ససెక్స్‌తో మ్యాచ్‌లో 139 బంతుల్లో 16 ఫోర్లు, 2 సిక్స్‌లతో 119 పరుగులు సాధించాడు. ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరు 91 నుంచి రెండో రోజు ఆట కొనసాగించిన గిల్ మరో 28 పరుగులు చేసి అవుట య్యాడు. మరో బ్యాటర్ క్రిస్ కుక్ (141; 14 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా సెంచరీ చేశాడు. దాంతో గ్లామోర్గన్ తొలి ఇన్నింగ్స్‌ను 533/9 వద్ద డిక్లేర్ చేసింది.

భారత్ ‘ఎ’ క్లీన్‌స్వీప్

రాణించిన తిలక్ వర్మ, సామ్సన్, శార్దుల్



చెన్నై: న్యూజిలాండ్ ‘ఎ’తో జరిగిన మూడు మ్యాచ్‌ల అనధికారిక వన్డే సిరీస్‌ను భారత్ ‘ఎ’ 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. మంగళవారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో సంజూ సామ్సన్ నాయకత్వం లోని భారత్ ‘ఎ’ 106 పరుగుల భారీ తేడాతో గెలి చింది. ముందుగా భారత్ ‘ఎ’ 49.3 ఓవర్లలో 284 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ యువ క్రికె టర్ నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ (50; 1 ఫోర్, 3 సిక్స్‌లు), సామ్సన్ (54; 1 ఫోర్, 2 సిక్స్‌లు), శార్దుల్ ఠాకూర్ (51; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెం చరీలు చేశారు. అనంతరం 285 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ ‘ఎ’ 38.3 ఓవర్లలో 178 పరుగులకే కుప్పకూలింది. భారత ‘ఎ’ బౌలర్లు రాజ్ అంగద్ (4/11), కుల్దీప్ యాదవ్ (2/29), రాహుల్ చహర్ (2/39) న్యూజిలాండ్ ‘ఎ’ జట్టును దెబ్బ తీశారు.

సఫారీతో ‘సై’


రోహిత్ శర్మ

- దక్షిణాఫ్రికాతో భారత్ తొలి టి20 నేడు
- జోరు మీదున్న రోహిత్ సేన
- ప్రపంచకప్‌కు ముందు చివరి సిరీస్
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

తిరువనంతపురం: ఆస్ట్రేలియా గడ్డపై వచ్చే నెలలో జరిగే టి20 ప్రపంచకప్ కోసం గట్టి ప్రత్యర్థులతో ఏర్పాటు చేసిన సిరీస్‌లలో ఒకటి ఆస్ట్రేలియాపై భారత్ గెలిచింది. ఇప్పుడు రెండు రోజుల వ్యవ ధిలోనే సఫారీతో రెండో వేటకు సిద్ధమైంది. మేటి జట్టయిన దక్షిణాఫ్రికాతో మూడు టి20ల సిరీస్‌లో రోహిత్ బృందం తలపడనుంది. బుధవారం జరిగే తొలి మ్యాచ్‌లో శుభారంభమే లక్ష్యంగా టీమిం డియా బరిలోకి దిగుతోంది. ఈ టోర్నీ హోరాహోరీ పోటీ కోసమే కాదు... తుది కసరత్తుకు ఆఖరి సమరంగా టీమ్ మేనేజ్‌మెంట్‌కు ఉపయోగపడ నుంది. ఇప్పటికే 11 మంది ఎవరనే ప్రాథమిక అం చనాకు వచ్చిన జట్టు మేనేజ్‌మెంట్‌కు డెత్ ఓవర్ల బెంగ పట్టి పీడిస్తోంది. బుమ్రా వచ్చాక కూడా ఆఖరి ఓవర్లలో ధారాళంగా పరుగులు సమర్పించు కోవడం బౌలింగ్ దళంపై కంగారు పెట్టిస్తోంది. ఈ సమస్యను అధిగమిస్తేనే కసరత్తు పూర్తి అవుతుంది.

బ్యాటింగ్ భళా

భారత బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా ఉంది. మరీ ముఖ్యంగా అనుభవజ్ఞులైన కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఫామ్‌లో ఉండటం కాదు... సూపర్ ఫామ్‌లోకి వచ్చేశారు. ఇన్నేళ్లయినా ఇద్దరి షాట్లు కుర్రాళ్లను మించి చుక్కలు చూపిస్తున్నాయి. సూర్య కుమార్ ఇప్పుడు మెరుపుల్లో తురుపుముక్కలా మారాడు. ఆసీస్‌తో ఆఖరి మ్యాచ్ గెలుపునకు అతని ఇన్నింగ్సే అసలైన కారణం. రిషభ్ పంత్, దినేశ్ కార్తీక్ ఇలా బ్యాటింగ్‌లో అంతా మెరుగ్గానే ఉంది. నిలకడగా మెరిపిస్తోంది. ఈ సిరీస్ నుంచి హార్దిక్ పాండ్యా, భువనేశ్వర్‌లకు విశ్రాంతి ఇచ్చారు. బౌలర్లే కీలకమైన దశలో డీలాపడటం, యథేచ్ఛగా పరుగులు కాదు వరుసబెట్టి బౌండ రీలు, సిక్సర్లు ఇచ్చుకోవడం జట్టు భారీ స్కోర్లను కూడా సులువుగా కరిగిస్తున్నాయి.

సవాల్‌కు సిద్ధం

జోరు మీదున్న భారత్‌కు దీటైన సవాల్ విసిరేం దుకు పర్యాటక దక్షిణాఫ్రికా జట్టు సిద్ధమైంది. ఓపెనింగ్‌లో డికాక్, కెప్టెన్ బవుమాలతో పాటు మిడిలార్డర్‌లో హార్డ్ హిట్టర్లు మార్క్‌రమ్, మిల్లర్ లతో బ్యాటింగ్ లైనప్ ఆతిథ్య జట్టులాగే పటిష్టంగా ఉంది. ఇందులో ఏ ఇద్దరు భారత్ బౌలింగ్‌పై మెరి పించినా కష్టాలు తప్పవు. ఇక సఫారీ బౌలింగ్ ఒకిం త మనకంటే మెరుగనే చెప్పాలి. ప్రిటోరియస్, రబడ, నోర్జేలు అద్భుతంగా రాణిస్తున్నారు. టి20 సమరానికి సరైన సరంజామాతోనే దక్షిణాఫ్రికా భారత్‌కు వచ్చింది. ఆసీస్‌పై గెలిచిన ధీమాతో ఏమాత్రం ఆదమరిచినా టీమిండియాకు కోలు కోలేని దెబ్బ తప్పదు.

భారత క్రికెటర్లపై పూల వాన

కేరళ అభిమానులు భారత క్రికెటర్లకు అడుగడు గునా జేజేలు పలికారు. విమానం దిగగానే మొద లైన హంగామా బస చేసే హోటల్ వద్దకు చేరేదాకా సాగింది. అక్కడ ఆటగాళ్లపై పూల వాన కురిసింది. కేరళ కళాకారుల నుంచి సంప్రదాయ స్వాగతం లభించింది.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), కేఎల్ రాహుల్, కోహ్లి, సూర్యకుమార్, రిషభ్ పంత్, దినేశ్ కార్తీక్, అక్షర్ పటేల్, దీపక్ చహర్, అర్ష్‌దీప్, బుమ్రా, చహల్. **దక్షిణాఫ్రికా:** బవుమా (కెప్టెన్), డికాక్, రోసో, మార్క్‌రమ్, మిల్లర్, స్టబ్స్, ఫెలుక్‌వాయో/ప్రిటోరియస్, జెన్సెన్, రబడ, నోర్జే, షమ్సీ.

పిచ్, వాతావరణం

ఈ గ్రీన్‌ఫీల్డ్ మైదానం పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. ఇక్కడ రెండు టి20 మ్యాచ్‌లు జరి గాయి. 2017లో న్యూజిలాండ్‌తో ఎనిమిది ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో భారత్ గెలిచింది. 2019లో వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో భారత్ ఎనిమిది వికెట్లతో ఓడింది. బుధవారం వర్షంతో మ్యాచ్‌కు అంతరాయం కలిగే అవకాశముంది.

3 స్వదేశంలో దక్షిణాఫ్రికాతో మూడు ద్వైపాక్షిక టి20 సిరీస్‌లు ఆడినా భారత్ ఒక్క సిరీస్‌నూ గెలవలేకపోయింది. 2015లో దక్షిణాఫ్రికా 2–0తో సిరీస్‌ను దక్కించుకోగా... 2019లో, 2022లో సిరీస్‌లు ‘డ్రా’గా ముగిశాయి.

11 దక్షిణాఫ్రికాతో ఇప్పటివరకు భారత్ 20 టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 11 మ్యాచ్‌ల్లో భారత్, 8 మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా గెలిచాయి. మరో మ్యాచ్ రద్దయింది.

1 భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య తొలి టి20 మ్యాచ్ 2006లో డిసెంబర్ 1న జరిగింది. ఆ మ్యాచ్‌లో ఆడిన ఆటగాళ్లలో ప్రస్తుతం దినేశ్ కార్తీక్ ఒక్కడే తాజా సిరీస్ లోనూ ఆడుతున్నాడు.



క్వార్టర్స్‌లో సాకేత్ జోడీ

సియోల్: కొరియా ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నమెంట్‌లో సాకేత్ మైనేని–యూకీ బాంబ్రీ (భారత్) జోడీ శుభారంభం చేసింది. మం గళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌం డ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్–యూకీ బాంబ్రీ ద్వయం 4–6, 7–6 (7/5), 10–6తో ‘సూపర్ టైబ్రేక్’లో జొనాథన్ ఎసెరిక్ (ఫ్రాన్స్)–ఆర్టెమ్ సితాక్ (న్యూజిలాండ్) జోడీని ఓడించింది. గంటా 49 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్–యూకీ జోడీ ఆరు ఏస్‌లు సంధించింది.

స్పెయిన్‌తో భారత్ తొలి పోరు



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జనవరిలో భారత్ వేదికగా జరిగే పురుషుల హాకీ ప్రపంచకప్ టోర్నీ షెడ్యూల్ ప్రకటించారు. ఒడిశాలోని రూర్కెలా, భువనేశ్వర్‌లలో ఈ మెగా ఈవెంట్ జరుగుతుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఐదో స్థానంలో ఉన్న భారత్ తమ తొలి మ్యాచ్‌ను జనవరి 13న స్పెయిన్‌తో ఆడుతుంది. పూల్ ‘డి’లో ఉన్న భారత్ తమ తదుపరి లీగ్ మ్యాచ్‌ల్లో జనవరి 15న ఇంగ్లండ్‌తో, జనవరి 19న వేల్స్‌తో తలపడుతుంది. పూల్ ‘ఎ’లో ఆస్ట్రేలియా, అర్జెంటీనా, ఫ్రాన్స్, దక్షిణాఫ్రికా... పూల్ ‘బి’లో బెల్జియం, జర్మనీ, కొరియా, జపాన్... పూల్ ‘సి’లో నెదర్లాండ్స్, న్యూజిలాండ్, మలేసియా, చిలీ జట్లు ఉన్నాయి. జనవరి 29న ఫైనల్ జరుగుతుంది.

శుభి, చార్వీలకు స్వర్ణాలు


శుభి
చార్వీ

బాతూమి (జార్జియా): ప్రపంచ క్యాడెట్ చెస్ చాంపి యన్‌షిప్‌లో భారత్‌కు రెండు స్వర్ణ పతకాలు లభిం చాయి. మంగళవారం ముగిసిన ఈ టోర్నీలో అండర్–12 బాలికల విభాగంలో శుభి గుప్తా... అండర్–8 బాలికల విభాగంలో చార్వీ విజేతలుగా నిలిచారు. ఘజియాబాద్‌కు చెందిన శుభి గుప్తా నిర్ణీత 11 రౌండ్ల తర్వాత 8.5 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానాన్ని సంపాదించింది. బెంగళూరుకు చెందిన చార్వీ నిర్ణీత 11 రౌండ్ల తర్వాత 9.5 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. సంహిత పుంగవనం 7.5 పాయింట్లతో పదో స్థానంలో నిలి చింది. అండర్–8 ఓపెన్ కేటగిరీలో సఫిన్ సఫ రుల్లాఖాన్ కాంస్య పతకం గెలిచాడు. కేరళకు చెం దిన సఫిన్ తొమ్మిది పాయింట్లు స్కోరు చేశాడు.

నీమన్ మోసం చేస్తున్నాడు

అమెరికా టీనేజ్ గ్రాండ్‌మాస్టర్‌పై ప్రపంచ చెస్ చాంప్ కార్ల్‌సన్ ఆరోపణ


నీమన్

ఓస్లో (నార్వే): అమెరికా టీనేజ్ గ్రాండ్‌మాస్టర్ హన్స్ నీమన్ మోసపూరితంగా ఆడుతున్నాడని ప్రపంచ చెస్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) ఆరోపించాడు. టోర్నీల్లో అతను ఆధునిక సాంకేతికతతో ఆడుతున్నాడని సందేహం వ్యక్తం చేశాడు. రెండేళ్లుగా ఓటమెరుగని నార్వే సూపర్ గ్రాండ్‌మాస్టర్ ఇటీవల సెయింట్ లూయిస్‌లో జరి గిన సింక్వెఫీల్డ్ కప్‌లో 19 ఏళ్ల నీమన్ చేతిలో ఓడిపో యాడు. వెంటనే ఆ టోర్నీ నుంచి కార్ల్‌సన్ తప్పు కున్నాడు. అనంతరం ఆన్‌లైన్‌లో జరిగిన జూలి యస్ బేర్ జనరేషన్ కప్ టోర్నీలో నీమన్‌తో ఆడిన గేమ్‌లో కార్ల్‌సన్ కేవలం ఒక ఎత్తు మాత్రమే వేసి ఓటమి అంగీకరించి వైదొలిగాడు. ఈ సంఘటనపై ట్విటర్‌లో కార్ల్‌సన్ స్పందించాడు. ‘ఇటీవల టోర్నీ ల్లో నీమన్ తెలివిగా చీటింగ్ చేస్తున్నాడు. గతంలో ఆన్‌లైన్ టోర్నీల సందర్భంగా మోసపూరితంగా ఆడినట్లు అతను ఒప్పుకున్నాడు. సింక్వెఫీల్డ్ టోర్నీ లో నీమన్‌తో జరిగిన పోరులో ఎత్తులు వేసేట ప్పుడు అతని ముఖ కవళికల్ని గమనించాను. ఆట పై, తదుపరి వేసే ఎత్తులపై అతను ఎలాంటి ఆలో చన చేయట్లేదు. కీలకమైన దశలోనూ ఏకాగ్రత కనబర్చ డం లేదు. అప్పుడే అనుకు న్నాను అతని ఆటతీరు సం దేహస్పదమని... అందుకే ఓడిన తర్వాత మరో గేమ్ ఆడకుండా తప్పుకున్నాను’ అని కార్ల్‌సన్ వివరించాడు.


కార్ల్‌సన్

సినిమా

బయోపిక్ తారలు


కంగనా రనౌత్



హ్యూమా ఖురేషీ



అనుష్కా శర్మ

బాలీవుడ్‌లో కొంతకాలంగా బయోపిక్ ట్రెండ్ బాగా నడుస్తోంది. అయితే ఈ ట్రెండ్ పట్ల హీరోయిన్స్ కూడా మొగ్గు చూపుతుండటం విశేషం. ఇటీవల ‘సైనా’, ‘తలైవి’, ‘గంగూబాయి కతియావాడి’, ‘శభాష్ మిథూ’ వంటి బయోపిక్స్ తెరపైకి వచ్చాయి. తాజాగా మరికొందరు మహిళల బయోపిక్‌లు రూపొందుతున్నాయి. అందులో నటించే తారలు, ఇతర విశేషాలపై ఓ లుక్కేద్దాం...

భారతదేశ దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జీవితం ఆధారంగా బాలీవుడ్‌లో రూపొందుతున్న సినిమా ‘ఎమర్జెన్సీ’. ప్రధానంగా ఎమర్జెన్సీ టైమ్‌లో 1975–1977లో జరిగిన సంఘటనలు ఈ చిత్రంలో ఉంటాయి. ఈ మూవీలో ఇందిరాగాంధీ పాత్రలో నటించడంతో పాటు, డైరెక్షన్ చేస్తున్నారు కంగనా రనౌత్. అనుపమ్ ఖేర్, మిలింద్ సోమన్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ మూవీ షూటింగ్ మొదలైంది. అలాగే ‘దంగల్’ ఫేమ్ ఫాతిమా సనా షేక్ కూడా వెండితెరపై ఇందిరా గాంధీగా కనిపించనున్నారు. మేఘనా గుల్జార్ దర్శకత్వంలో దివంగత ఫీల్డ్ మార్షల్ సామ్ మానెక్షా జీవితం ఆధారంగా ‘శామ్‌బహదూర్’ అనే చిత్రం రూపొందుతోంది. విక్కీ కౌశల్ టైటిల్ రోల్‌లో నటిస్తుండగా, ఇందిరాగాంధీ పాత్రని ఫాతిమా చేస్తున్నారు. అదేవిధంగా భారత మాజీ మహిళా క్రికెటర్ జులన్ గోస్వామి బయోపిక్ కూడా తెరపైకి రానుంది. ఆమె పాత్రలో అనుష్కా శర్మ నటిస్తున్నారు. ఈ చిత్రానికి ‘చెక్దా ఎక్స్‌ప్రెస్’ అనే టైటిల్ ఖరారు చేశారు. ప్రోసిత్ రాయ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు అభిషేక్ బెనర్జీ కథ, స్క్రీన్ ప్లే అందించారు. జులన్ గోస్వామి పాత్ర కోసం ఇంగ్లాండ్‌లో క్రికెట్‌కు సంబంధించిన ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు అనుష్కా శర్మ. నెట్‌ఫ్లిక్స్‌లో ‘చెక్దా ఎక్స్‌ప్రెస్’ స్ట్రీమింగ్ కానుంది. అలాగే 2018లో వచ్చిన ‘జీరో’ సినిమా తర్వాత అనుష్కా శర్మ ఓకే చెప్పిన ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం. మరోవైపు రీసెంట్ టైమ్స్‌లో విభిన్నరకాలైన వంటకాలు వండారు హీరోయిన్ హ్యూమా ఖురేషీ. ఎందుకంటే ‘తర్లా’ బయోపిక్ కోసం. దివంగత చెఫ్, వంటల పుస్తకాల రచయిత, వ్యాఖ్యాత తర్లా దలాల్ జీవితం ‘తర్లా’గా రానుంది. ‘చిఛోరే’, ‘దంగల్’ లకు రచనా విభాగంలో పనిచేసిన పీయూష్ గుప్తా ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. హ్యూమా ఖురేషీ టైటిల్ రోల్ చేసిన ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. రిలీజ్‌పై త్వరలో ఓ స్పష్టత రానుంది. ఇక బాలీవుడ్ ప్రముఖ యాక్టర్ నీనా గుప్తా బయోపిక్ తెరపైకి రానుంది. ‘నా బయోపిక్ తీసేందుకు సన్నాహాలు చేస్తున్నారు’ అని రీసెంట్‌గా ఓ సందర్భంలో నీనా గుప్తా వెల్లడించారు. ఆమె పాత్రలో ఎవరు నటిస్తారు? అనే విషయంపై క్లారిటీ రావాల్సి ఉంది. అదేవిధంగా 2000 సంవత్సరం మార్చిలో హత్య చేయబడ్డారు హీరోయిన్ ప్రియా రాజ్ వంశ్. ఆమె జీవితంలోని కొన్ని ముఖ్య సంఘటనలు వెండితెరపైకి రానున్నాయి. లీడ్ రోల్‌లో జాక్వెలిన్ ఫెర్నాండెజ్ నటించనున్నారని సమాచారం. దివంగత దర్శక–నిర్మాత, నటుడు చేతన్ ఆనంద్, ప్రియా రాజ్ వంశ్ మధ్య నెలకొన్న సంఘటనలతో ఈ సినిమా ఉంటుందట. ప్రదీప్ సర్కార్ ఈ మూవీకి దర్శకత్వం వహిస్తారు. వీరే కాదు.. ఈ తరహా బయోపిక్స్‌లో నటించేందుకు మరికొందరు హీరోయిన్స్ రెడీ అవుతున్నారని టాక్.


జాక్వెలిన్ ఫెర్నాండెజ్


నాగ చైతన్య

చలో మైసూర్

హీరో నాగచైతన్య మైసూర్‌కు మకాం మార్చారు. వెంకట్ ప్రభు దర్శకత్వంలో నాగచైతన్య హీరోగా తెలుగు, తమిళ భాషల్లో ఓ చిత్రం తెరకెక్కుతోంది. కృతీశెట్టి హీరోయిన్. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైంది. అయితే ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ మైసూర్‌లో జరుగుతోంది. దాదాపు 25రోజులు ఈ షెడ్యూల్ కొనసాగుతుందట. ఈ సినిమాలో నటుడు అరవింద్ స్వామి ఓ కీ రోల్ చేయనున్నారని, మైసూర్ షెడ్యూల్‌లోనే ఆయన కూడా పాల్గొంటారనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది.

హత్య చేసిందెవరు?

ఆది సాయికుమార్, మిషా నారంగ్ జంటగా శివశంకర్ దేవ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘సీఎస్ఐ సనాతన్’. చాగంటి ప్రొడక్షన్స్‌పై అజయ్ శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమా నవంబర్ రెండో వారంలో ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ‘సీఎస్ఐ సనాతన్’ గ్లింప్స్‌ను విడుదల చేసింది యూనిట్. దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ‘‘సరికొత్త ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. ఇందులో క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ (సీఎస్ఐ) ఆఫీసర్‌గా ఆది నటించారు. ఓ హత్య కేసును ఛేదించేందుకు రంగంలోకి దిగిన ఆయన చిన్న క్లూస్‌తో నేరస్తులను ఎలా పట్టుకున్నారు? అనేది ఆసక్తిగా ఉంటుంది.


ఆది సాయికుమార్

సస్పెన్స్ థ్రిల్లర్


అపూర్వ, శ్రీకర్

శ్రీకర్, అపూర్వ జంటగా హరికృష్ణ జినుకల స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం ‘హౌస్ హజ్బెండ్’. ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. శ్రీకర్ మాట్లాడుతూ– ‘‘ఒక హౌస్ హజ్బెండ్’ కావాలనుకున్న ఓ అమ్మాయికి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి? అన్నదే కథ’’ అన్నారు. ‘‘సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్ ఇది’’ అన్నారు హరికృష్ణ. ‘‘ఈ చిత్రంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా నటిస్తున్నాను’’ అన్నారు అపూర్వ. ఈ కార్యక్రమంలో టీఎఫ్‌సీసీ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్, నిర్మాత రామసత్యనారాయణ, వైయస్‌ఆర్ టీపీ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నా కల నెరవేరింది - సత్యదేవ్

‘‘నాకు ఊహ తెలిసినప్పటి నుంచి అన్నయ్యకి(చిరంజీవి) నేను పెద్ద అభిమానిని. ఆయన స్ఫూర్తితో నటుడు కావాలని కలలుకని, అయ్యాను. నా నటనని అన్నయ్య ప్రశంసించడం మాటల్లో వర్ణించలేని గొప్ప అనుభూతి. ఆయనతో నటించాలనే నా ఇన్నేళ్ల కల ‘గాడ్‌ఫాదర్’ చిత్రంతో నెరవేరింది’’ అని హీరో సత్యదేవ్ అన్నారు. చిరంజీవి హీరోగా మోహన్ రాజా దర్శకత్వం వహించిన చిత్రం ‘గాడ్ ఫాదర్’. హీరో సల్మాన్ ఖాన్, హీరోయిన్ నయనతార, సత్యదేవ్ ముఖ్య పాత్రల్లో నటించారు. కొణిదెల సురేఖ సమర్పణలో ఆర్‌బీ చౌదరి, ఎన్వీ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా అక్టోబర్ 5న తెలుగు, హిందీలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలో కీలక పాత్ర చేసిన సత్యదేవ్ పంచుకున్న విశేషాలు...

- అన్నయ్య(చిరంజీవి) ఒక షూటింగ్‌లో లంచ్‌కి రమ్మని పిలిస్తే వెళ్లాను. ఒక సినిమా(గాడ్‌ఫాదర్) ఉందని కథ చెప్పడం మొదలుపెట్టారు. నేను ఆయనకి వీరాభిమానిని.. గురువుగా భావించిన వ్యక్తి ఆయన. అలాంటిది ఆయన నాకు కథ, నా పాత్ర గురించి చెప్పడం ఆశ్చర్యమనిపించింది.. వెంటనే చేస్తాను అని చెప్పా. ఆ క్షణం చాలా గొప్పగా అనిపించింది. అయితే ఆ పాత్ర చేస్తున్నపుడు అందులోని లోతు అర్థమైంది.. అప్పుడు చిన్న టెన్షన్ మొదలైంది. కానీ, అన్నయ్యగారు నటుడిగా నాపై పెట్టిన బాధ్యత ముందు భయాలు తొలగిపోయాయి. గతంలో ఎప్పుడూ చేయని పాత్ర ఈ సినిమాలో చేశా.
- అన్నయ్య గ్రేస్, ఆరాకి వంద శాతం సరిపడే కథ ‘గాడ్‌ఫాదర్’. చిరంజీవిగారిని మెగాస్టార్ అని ఎందుకు అంటారో ఆయనతో పనిచేస్తున్నప్పుడు అర్థమైంది. ఆయన చాలా క్రమశిక్షణగా, మా కంటే చాలా ఎనర్జిటిక్‌గా ఉంటారు. ప్రతి డైలాగ్ నేర్చుకుంటూ తర్వాతి సన్నివేశం గురించి ఆలోచించడం గ్రేట్.



- సల్మాన్‌ఖాన్‌గారు సెట్స్‌లో చాలా సింపుల్‌గా, సరదాగా ఉంటారు. దర్శకుడు మోహన్ రాజాగారు నా పాత్రని చాలా స్టయిలిష్, పవర్ హంగ్రీ, గ్రీడీ.. ఇలా చాలా పవర్ ఫుల్‌గా డిజైన్ చేశారు. అందరిలానే సోలో హీరోగా చేయాలనే ఉంటుంది. అయితే మంచి పాత్ర వస్తే క్యారెక్టర్స్ కూడా చేస్తాను.
- అన్ని భాషల్లో సినిమాలు చేయాలని ఉంది. తన సినిమాలతో సౌత్, నార్త్ అనే బౌండరీలు లేకుండా ఇండియన్ సినిమా అనేలా చేసిన రాజమౌళిగారికి హ్యాట్సాఫ్. నేను నటించిన ‘గుర్తుందా శీతాకాలం, కృష్ణమ్మ, రామ్ సేతు’ విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ‘ఫుల్ బాటిల్’ మూవీ పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉంది. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో డాలీ ధనుంజయతో కలసి ఓ యాక్షన్ థ్రిల్లర్ చేయబోతున్నాను.

యువత అంతరంగం


మనీషా, సునీల్ కుమార్, మనోజ్ నందన్

‘‘చిన్న సినిమాలు హిట్ అయితే చిత్ర పరిశ్రమకు అద్భుతమైన ఆదరణ లభిస్తుంది. ‘వెల్కమ్ టు తీహార్ కాలేజ్’ విజయం సాధించాలి’’ అని నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు అన్నారు. మనోజ్ నందన్, ఫణి చక్రవర్తి, కృష్ణ తేజ, సోనీ రెడ్డి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం ‘వెల్కమ్ టు తీహార్ కాలేజ్’. పి.సునీల్ కుమార్ రెడ్డి దర్శకత్వంలో శ్రావ్య ఫిలిమ్స్‌పై డా.ఎల్ఎస్ రావు, యెక్కలి రవీంద్ర బాబు నిర్మించిన ఈ సినిమా అక్టోబర్ 28న విడుదలకానుంది. ప్రవీణ్ ఇమ్మడి సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియోని విడుదల చేశారు. ‘‘ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలో విద్య పేరుతో జరుగుతున్న బందీఖానా నేపథ్యంలో తీసిన చిత్రమిది’’ అన్నారు సునీల్ కుమార్ రెడ్డి. ‘‘మా చిత్రం యువతకి, వారి తల్లితండ్రులకి నచ్చుతుంది’’ అన్నారు యెక్కలి రవీంద్ర బాబు. సంగీత దర్శకులు ఎం ఎం శ్రీలేఖ, ప్రవీణ్ ఇమ్మడి, నిర్మాత బాపిరాజు పాల్గొన్నారు.

వాస్తవ సంఘటనలతో...


రామ్ కార్తీక్, హెబ్బా పటేల్

రామ్ కార్తీక్, హెబ్బా పటేల్ జంటగా నటి ంచిన చిత్రం ‘తెలిసినవాళ్లు’. కేఎస్వీ సమర్పణలో సిరెంజ్ సినిమా పతాకంపై విప్లవ్ కోనేటి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదలకానుంది. తాజాగా ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. ‘‘కొన్ని వాస్తవ సంఘటనలతో రొమాన్స్, ఫ్యామిలీ, థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం ఇది’’ అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: అజయ్ వి. నాగ్, అనంత్ నాగ్ కావూరి, సంగీతం: శ్రీ చరణ్ పాకాల, లైన్ ప్రొడ్యూసర్: డా.జేకే సిద్ధార్థ.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▽	38	57,108
నిఫ్టీ ▽	9	17,007

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (భారత కాలమానం రాత్రి 11.30 ముగింపు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	10,773	▽	30
డోజోన్స్	29,067	▽	193
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,985	▽	36
డాక్స్	12,140	▽	88
షాంఘై	3,094	△	43
నికాయ్	26,572	△	140

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ నిల్వలు పుష్కలం

ప్రస్తుత పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనగలం: సేథ్

న్యూఢిల్లీ: విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు భారీగా తగ్గిపోతున్నాయంటూ నెలకొన్న ఆందోళనలను కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి అజయ్ సేథ్ తోసిపుచ్చారు. దీన్ని 'మరీ ఎక్కువగా' చేసి చూపుతున్నారని ఆయన మంగళవారం వ్యాఖ్యానించారు. ప్రస్తుత పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత్ దగ్గర పుష్కలంగా ఫారెక్స్ నిల్వలు ఉన్నాయని సేథ్ చెప్పారు.



విదేశీ నిధుల ప్రవాహం తగ్గడం, వాణిజ్య లోటు అధికంగా ఉండటం వల్ల మారక నిల్వలు తగ్గాయని, దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరమేమీ లేదని ఆయన చెప్పారు. వరుసగా ఏడో వారం ఫారెక్స్ నిల్వలు తగ్గిన నేపథ్యంలో సేథ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సెప్టెంబర్ 16తో ముగిసిన వారంలో అంతక్రితం వారంతో పోలిస్తే 2.23 బిలియన్ డాలర్లు తగ్గి 545.65 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 81ని కూడా దాటేసి ఆల్‌టైం కనిష్టానికి పడింది. మరోవైపు, దేశ ఆర్థిక మూలాలు పటిష్టంగానే ఉన్నాయని, అంతర్జాతీయంగా డాలరు బలపడుతుండటమే రూపాయి క్షీణతకు కారణమని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే స్పష్టం చేశారు.

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	49,529	▼	61
బంగారం (99.5 స్వచ్ఛత)	49,331	▼	60
వెండి (కిలో)	55,391	▲	17

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-9-2022	
విశాఖ	435-00
చిత్తూరు	443-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	435-00
విజయవాడ	435-00
రిటైల్ ధర (డజను)	66.00
27-9-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	400-00
వరంగల్	402-00
రిటైల్ ధర	4.60

టొరంట్ ఫార్మా చేతికి క్యురేషియో

- డెర్మటాలజీ, కాస్మెటిక్ బ్రాండ్ల కంపెనీ
- ఒప్పందం విలువ రూ. 2,000 కోట్లు

న్యూఢిల్లీ: చర్మ పరిరక్షణ(డెర్మటాలజీ) విభాగంలో సేవలందిస్తున్న క్యురేషియో హెల్త్‌కేర్‌ను కొనుగోలు చేయనున్నట్లు ప్రయివేట్ రంగ కంపెనీ టొరంట్ ఫార్మాస్యూటికల్స్ పేర్కొంది. ఇందుకు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలియజేసింది. డీల్ విలువను రూ. 2,000 కోట్లుగా వెల్లడించింది. దీనిలో భాగంగా ఒప్పందంపై సంతకాలు చేసిన రోజున రూ. 115 కోట్లను నగదు రూపేణా చెల్లించనున్నట్లు తెలియజేసింది. వెరసి రూ. 1,885 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో ఒప్పందం కుదిరినట్లు వివరించింది. కాగా.. క్యురేషియోను సొంతం చేసుకోవడం ద్వారా డెర్మటాలజీ పోర్ట్‌ఫోలియోను విభిన్నంగా విస్తరించేందుకు వీలు చిక్కనున్నట్లు టొరంట్ ఫార్మా డైరెక్టర్ అమన్ మెహతా తెలియజేశారు. ఇది వ్యూహాత్మక కొనుగోలుగా పేర్కొన్నారు.



50 బ్రాండ్లకుపైగా: చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న క్యురేషియో కాస్మెటిక్, పిడియాట్రిక్ డెర్మటాలజీ విభాగాలలో అధిక మార్కెట్ వాటాను కలిగి ఉన్నట్లు వెల్లడించారు. టిడిబార్, అటోగ్లా, స్పూ, బీ4 నప్పి, పెర్మైట్ తదితర 50 బ్రాండ్లకుపైగా పోర్ట్‌ఫోలియోను కలిగి ఉన్నట్లు తెలియజేశారు. గతేడాది(2021-22)లో రూ. 224 కోట్ల టర్నోవర్‌ను సాధించింది.క్యురేషియో ప్రమోటర్లతోపాటు.. క్రిస్‌క్యాపిటల్, సీక్వోయా సైతం కంపెనీ నుంచి వైదొలగనున్నట్లు ప్రస్తావించింది.

ఈ వార్తల నేపథ్యంలో టొరంట్ ఫార్మా షేరు 1.5 శాతం లాభపడి రూ. 1,535 వద్ద ముగిసింది.

లాభాల నుంచి వెనకడుగు

- స్వల్ప నష్టాలతో ముగిసిన మార్కెట్లు
- 38 పాయింట్లు డౌన్; 57,108కు సెన్సెక్స్
- 9 పాయింట్లు తగ్గి 17,007కు చేరిన నిఫ్టీ

ముంబై: వరుసగా అయిదో రోజూ దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. అయితే 4 రోజుల అమ్మకాలకు చెక్ పెడుతూ ట్రేడర్లు షార్ట్ కవరింగ్‌కు దిగడంతో లాభాలతో ప్రారంభమయ్యాయి. ఆపై తిరిగి అమ్మకాలు ఊపందుకోవడంతో ఇంట్రాడేలో ఆటుపోట్లను చవిచూశాయి. చివరికి స్వల్ప నష్టాలతో నిలిచాయి. 38 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్ 57,108 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 9 పాయింట్లు నీరసించి 17,007 వద్ద ముగిసింది. ఒక దశలో సెన్సెక్స్



గరిష్టంగా 57,700ను అధిగమించింది. ఆపై 750 పాయింట్లు కోల్పోయి 56,950 వరకూ జారగా.. నిఫ్టీ 17,000 దిగువన 16,942 వద్ద కనిష్టాన్ని తాకింది. తొలుత 17,176కు ఎగసింది. చమురు ధరలు 9 నెలల కనిష్టానికి క్షీణించడంతోపాటు రూపాయి పుంజుకోవడం ఇన్వెస్టర్లకు ప్రోత్సాహం ఇచ్చినట్లు నిపుణులు పేర్కొన్నారు.

మెటల్, ఆటో వీక్

ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా చమురు- గ్యాస్, ఫార్మా, ఐటీ రంగాలు 1 శాతం స్థాయిలో పుంజుకోగా.. మెటల్, బ్యాంకింగ్, ఆటో 1-0.5 శాతం మధ్య క్షీణించాయి. నిఫ్టీ దిగ్గజాలలో హీరోమోటో, అదానీ పోర్ట్స్, టైటాన్, టాటా స్టీల్, ఎస్‌బీఐ లైఫ్, జేఎస్‌డబ్ల్యూ, కొటక్ బ్యాంక్, బజాజ్ ఆటో, ఎస్‌బీఐ 3-1 శాతం మధ్య నష్టపోయాయి. ఇతర బ్లూచిప్స్‌లో సిప్లా, టాటా కన్జూమర్, శ్రీసిమెంట్, పవర్‌గ్రిడ్, ఇండస్‌ఇండ్, బీపీసీఎల్, గ్రాసిమ్, ఐషర్, డాక్టర్ రెడ్డీస్, ఇన్ఫోసిస్ 3.4-1.5 శాతం మధ్య ఎగశాయి.

చిన్న షేర్లు ఓకే

చిన్న షేర్లకు డిమాండ్ పుట్టడంతో బీఎస్‌ఈలో స్మాల్ క్యాప్ 0.5 శాతం పుంజుకుంది. ట్రేడైన షేర్లలో 1,639 నష్టపోగా.. 1,769 లాభపడ్డాయి.

పదేళ్లలో 100 బిలియన్ డాలర్లు

- పునరుత్పాదక విద్యుత్, డేటా సెంటర్లపై భారీగా పెట్టుబడులు
- వచ్చే దశాబ్దకాలంలో అదానీ గ్రూప్ లక్ష్యం
- ఫోర్బ్స్ సదస్సులో గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ వెల్లడి

న్యూఢిల్లీ: వివిధ రంగాల్లో విస్తరించిన దేశీ దిగ్గజం అదానీ గ్రూప్ వచ్చే దశాబ్ద కాలంలో 100 బిలియన్ డాలర్లకు పైగా (సుమారు రూ. 8,10,000 కోట్లు) పెట్టుబడులు పెట్టనుంది. ప్రధానంగా పునరుత్పాదక విద్యుత్, డిజిటల్ వ్యాపారాల్లో ఇన్వెస్ట్ చేయనుంది. ఈ పెట్టుబడుల్లో సింహభాగం (దాదాపు 70 శాతం) వాటా పునరుత్పాదక విద్యుత్‌పైనే ఉండనుంది. సింగపూర్‌లో జరిగిన ఫోర్బ్స్ గ్లోబల్ సీఈవో సదస్సులో పాల్గొన్న సందర్భంగా అదానీ గ్రూప్ వ్యవస్థాపకుడు, చైర్మన్ గౌతమ్ అదానీ ఈ విషయాలు తెలిపారు. 'గ్రూప్ స్థాయిలో వచ్చే దశాబ్ద కాలంలో 100 బిలియన్ డాలర్ల పైగా పెట్టుబడులు పెట్టబోతున్నాం. ప్రస్తుతం మాకు 20 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ పోర్ట్‌ఫోలియో ఉంది. హైబ్రిడ్ విధానంలో దీన్ని మరో 45 గిగావాట్ల మేర పెంచుకోనున్నాం. ఇందుకోసం సింగపూర్‌తో విస్తీర్ణంతో పోలిస్తే 1.4 రెట్లు అధికంగా 1,00,000 హెక్టార్ల స్థలాన్ని వినియోగించుకోబోతున్నాం. అలాగే 3 గిగా ఫ్యాక్టరీలు



నిర్మిస్తున్నాం. హరిత హైడ్రోజన్‌ను తక్కువ వ్యయాలతో ఉత్పత్తి చేయడమనేది మా లక్ష్యం' అని అదానీ పేర్కొన్నారు.

డిజిటల్‌కు దన్ను..: హరిత విద్యుత్‌కు మారుతుండటం అటు డిజిటల్ వ్యాపార విభాగానికి కూడా తోడ్పడుతుందని అదానీ చెప్పారు. 'దేశీయంగా డేటా సెంటర్ మార్కెట్ భారీగా వృద్ధి చెందుతోంది. మిగతా ఏ రంగంలోనూ లేనంతగా ఈ పరిశ్రమ గణనీయంగా విద్యుత్ వినియోగిస్తుంది. కాబట్టి పర్యావరణ అనుకూల డేటా సెంటర్ల నిర్మాణానికి మేము చేస్తున్న ప్రయత్నాలతో పెను మార్పులు వస్తాయి' అని ఆయన పేర్కొన్నారు. డేటా సెంటర్లను భూమి ఉపరితలంపైనా, సముద్ర అంతర్భాగం నుంచి వేసే కేబుల్స్‌తో అనుసంధానం చేస్తామని, లక్షల కొద్దీ వినియోగదారులను ఒకే డిజిటల్ ప్లాట్‌ఫాంపైకి తెచ్చేందుకు సూపర్ యాప్‌లను రూపొందిస్తున్నామని అదానీ చెప్పారు. 'భారత్‌లో పుష్కలంగా అవకాశాలు ఉన్నాయి. సిసలైన భారత వృద్ధి గాథ ఇప్పుడే మొదలవుతోంది. ఇది పలు దశాబ్దాల పాటు కొనసాగుతుంది. దేశ ఆర్థిక పునరుత్థానంలో భాగం అవ్వడానికి కంపెనీలకు ఇదే సరైన సమయం' అని ఆయన పేర్కొన్నారు.

చైనా ఒంటరవుతోంది..

గతంలో గ్లోబలైజేషన్‌కు సారథ్యం వహించిన చైనా ప్రస్తుతం అనేక సవాళ్లు ఎదుర్కొంటోందని అదానీ చెప్పారు. మరింతగా ఒంటరి అవుతోందన్నారు. జాతీయవాదం పెరుగుతుండటం, సరఫరా వ్యవస్థలో రిస్కులు, టెక్నాలజీపరమైన ఆంక్షలు మొదలైనవి ప్రతికూలాంశాలుగా మారుతున్నాయని ఆయన చెప్పారు. చైనా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టుకు పలు దేశాల్లో అవరోధాలు ఎదురవుతున్నాయన్నారు. 'కేవలం 36 నెలల్లో ప్రపంచమంతా మారిపోతుందని ఎవరైనా ఊహించి ఉంటారా? ఒకవైపు డిమాండ్ పెరిగిపోయి, సరఫరా తగ్గిపోవడంతో 40 ఏళ్లలో ఎన్నడూ లేనంత స్థాయికి ద్రవ్యోల్బణం పెరిగిపోతోంది. ఇదంతా అసాధారణంగా సంక్లిష్టమైన పరిస్థితులకు దారి తీస్తోంది. చాలా మటుకు సెంట్రల్ బ్యాంకులు ఊహించనలవి కాని చర్యలు తీసుకుంటున్నాయి. ఆర్థిక వ్యవస్థను మాంద్యంలోకి తోసేలా వడ్డీ రేట్లను పెంచేస్తున్నాయి. ఇది నేటి వాస్తవ పరిస్థితి' అని ఆయన చెప్పారు. అంతర్జాతీయంగా సంక్షోభం నెలకొన్న తరుణంలో భారత్‌లో అత్యంత ఆశావహ పరిస్థితులు ఉన్నాయని అదానీ చెప్పారు.

రేట్ల పెంపు ఖాయమే..!

- నేటి నుంచి ఆర్‌బీఐ ఎంపీసీ భేటీ
- అర శాతం వరకు పెంపు ఉండొచ్చు
- రూపాయి మారకం కూడా కీలకమే
- మెజారిటీ నిపుణుల అంచనాలు

ముంబై: ఆర్‌బీఐ ఎంపీసీ ద్వైమాసిక పరపతి సమీక్ష బుధవారం ప్రారంభం కానుంది. ఇందులో తీసుకున్న నిర్ణయాలను ఈ శుక్రవారం (30న) ఉదయం ఎంపీసీ ప్రకటించనుంది. గరిష్టంగా 0.50 శాతం వరకు రెపో రేటును పెంచొచ్చని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గరిష్ట పరిమితి అయిన 6 శాతానికి పైనే ఏడు నెలలుగా ద్రవ్యోల్బణం కొనసాగుతోంది. ఆగస్ట్ నెలకు కూడా 7 శాతానికి పైనే నమోదైంది. దీంతో ద్రవ్యోల్బణం కట్టడికి రేట్ల పెంపు అనివార్యమే అని తెలుస్తోంది. ఇప్పటికే ఈ ఏడాది మే నుంచి మూడు విడతల్లో ఆర్‌బీఐ రెపో రేటును 1.4 శాతం మేర పెంచడంతో అది 5.4 శాతానికి చేరింది. యూఎస్ ఫెడ్ కూడా ప్రతి పర్యాయం 0.75 శాతం మేర రేట్లను పెంచుతూ వస్తుండడం తెలిసిందే. అంతేకాదు రానున్న సమీక్షల్లోనూ రేట్ల పెంపు ఉంటుందని సంకేతాలు ఇచ్చింది. అటు యూకే, ఈయూ కూడా రేట్ల పెంపు బాటలోనే నడుస్తున్నాయి. ఇది రూపాయి మారకం విలువపై ప్రభావం చూపిస్తోంది. తాజా సమీక్షలో రూపాయి మారకం, ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధిపై ఎంపీసీ కీలక చర్చ నిర్వహించనుంది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని రేట్ల పెంపు నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ద్రవ్యోల్బణాన్ని 4 శాతం (ప్లస్ 2, మైనస్ 2) పరిధిలో నియంత్రించాలన్నది ఆర్‌బీఐ లక్ష్యం.



పెంపు తప్పదు..

50 బేసిస్ పాయింట్ల (0.50 శాతం) పెంపు ఉంటుందని ఇక్రా ముఖ్య ఆర్థిక వేత్త అదితి నాయర్ అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందిన దేశాలు సైతం రేట్ల పెంపు నిర్ణయాలు తీసుకుంటున్నందున.. ఆర్‌బీఐ నుంచి మరిన్ని రేటు పెంపు చర్యలు కొనసాగుతాయని భావిస్తున్నట్టు మాజీ గవర్నర్ సి.రంగరాజన్ సైతం ఇటీవలే అభిప్రాయం వ్యక్తం చేశారు. రిటైల్, టోకు ధరల ద్రవ్యోల్బణం అధిక స్థాయిల్లోనే కొనసాగుతుండడాన్ని బార్‌క్లేస్ సెక్యూరిటీస్ ఇండియా ముఖ్య ఆర్థికవేత్త రాహుల్ బజోరియా గుర్తు చేశారు ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ నెల చివర్లో జరిగే సమీక్షలో 0.50 శాతం మేర రేటు పెంపు ఉంటుందన్నారు. సెప్టెంబర్ 30న ఆర్‌బీఐ రెపో రేటును 0.35 శాతం మేర పెంచొచ్చని మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది. జపాన్ బ్రోకరేజీ సంస్థ అయిన నోమురా సైతం ఈ నెల చివర్లో 0.35 శాతం, డిసెంబర్ సమీక్షలో 0.25 శాతం చొప్పున రేట్ల పెంపు ఉంటుందని అంచనాతో ఉంది.

భవిత

- ప్రభుత్వ ఉద్యోగాల సమాచారం- జాబ్ పాయింట్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

175 టౌన్ ప్లానింగ్ కొలువులు

తెలంగాణ రాష్ట్రంలోని డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ పరిధిలోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో.. టౌన్ బిల్డింగ్ ఓవర్‌సీర్ పోస్టుల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) ప్రకటన విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హతలు

డిప్లొమా(డీసీఈ/ఎల్‌సీఈ/ఎల్‌ఏఏ) లేదా బీఆర్క్ లేదా బీఈ, బీటెక్ (సివిల్) లేదా బీటెక్(ప్లానింగ్) ఉత్తీర్ణత ఉండాలి. **వయసు:** 01.07.2022 నాటికి 18-44 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాలకు వయోపరిమితిలో సడలింపు వర్తిస్తుంది.

వేతనాలు: ఎంపికైన వారికి రూ.32,810-96,890 వరకు వేతన శ్రేణి లభిస్తుంది.

ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష లేదా ఓఎంఆర్ రాత పరీక్ష ఆధారంగా అభ్యర్థుల ఎంపిక చేస్తారు. రాత పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1లో జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీ 150 ప్రశ్నలకు 150 మార్కులు ఉంటాయి. పేపర్-2లో సంబంధిత సబ్జెక్ట్ నుంచి 150 ప్రశ్నలు 150 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. రెండు పేపర్లకు కలిపి పరీక్షకు 300 నిమిషాల సమయం కేటాయిస్తారు.

జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీ: ఈ పేపర్‌కు సంబంధించి కరెంట్ అఫైర్స్-ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ అంశాల నుంచి ప్రశ్నలను అడుగుతారు. అలాగే అంతర్జాతీయ సంబంధాలు, సదస్సులు, జనరల్ సైన్స్; సైన్స్ అండ్ టెక్నాలజీలో భారతదేశం సాధించిన విజయాలు, ఎన్విరాన్‌మెంటల్ ఇష్యూస్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఎకానమీ ఆఫ్ ఇండియా అండ్ తెలంగాణ, ఇండియా అండ్ తెలంగాణ జాగ్రఫీ, ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ అండ్ పాలిటీ విత్ ఏ ఫోకస్ ఆన్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్, సొసైటీ, కల్చర్, హెరిటేజ్, ఆర్ట్స్ అండ్ లిటరేచర్ ఆఫ్ తెలంగాణ, పాలసీస్ ఆఫ్ తెలంగాణ స్టేట్, హిస్టరీ ఆఫ్ మోడ్రన్ ఇండియా విత్ ఆన్ ఇండియన్ నేషనల్ మూవ్‌మెంట్, హిస్టరీ ఆఫ్ తెలంగాణ, తెలంగాణ రాష్ట్ర ఉద్యమం, లాజికల్ రీజనింగ్, అనలిటికల్ ఎబిలిటీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్, బేసిక్ ఇంగ్లిష్(8వ తరగతి స్థాయి). **పేపర్-2:** ఈ పేపర్‌కు సంబంధించిన పరీక్ష సంబంధిత సబ్జెక్టును అనుసరించి నిర్వహిస్తారు. ఇది ఇంటర్మీడియట్ ఒకేషనల్ స్థాయిలో ఉంటుంది.

ముఖ్యమైన సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌ద్వారా.
» దరఖాస్తులకు చివరి తేదీ: అక్టోబర్ 13, 2022
» పరీక్ష తేదీ: జనవరి, 2023
» పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్‌లో మాత్రమే
» వెబ్‌సైట్: https://www.tspsc.gov.in

సీఐఎస్‌ఎఫ్‌లో 540 ఏఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్ పోస్టులు

ఇంటర్ పూర్తిచేసి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూసే అభ్యర్థుల కోసం సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్‌ఎఫ్) ప్రకటన విడుదల చేసింది. దీనిలో భాగంగా 540 ఏఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతుంది.

» **మొత్తం పోస్టులు:** 540

అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (స్టెనోగ్రాఫర్)-122: పురుషులకు-94, మహిళలు-10, డిపార్ట్‌మెంటల్-18). **హెడ్‌కానిస్టేబుల్ (మినిస్ట్రీ)-418:** పురుషులకు -319, మహిళలు-36, డిపార్ట్‌మెంటల్-63.

» **వేతనాలు:** ఏఎస్‌ఐ పోస్టులకు నెలకు రూ. 29,200-92,300,హెడ్ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన వారు రూ.25,500-81,100 వరకు వేతనంగా పొందవచ్చు.

అర్హతలు

ఇంటర్మీడియట్ లేదా తత్సమాన విద్యార్హత (10+2)లో ఉత్తీర్ణులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. » **వయసు:** 25.10.2022 నాటికి 18-25ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/ఎక్స్‌సర్వీస్‌మెన్‌లకు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది. » **ఎత్తు:** పురుష అభ్యర్థులు 165 సెం.మీ, మహిళలు 155 సెం.మీ ఉండాలి. చెస్ట్ 77-82 సెం.మీ మధ్య ఉండాలి. ఎస్టీ సహా కొన్ని రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులకు ఎత్తు విషయంలో మినహాయింపులు ఉంటాయి.

ఎంపిక విధానం

రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్‌టీ) ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. వీటిలో ఎంపికైన అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన, వైద్యపరీక్షలు ఉంటాయి.

» **రాత పరీక్ష ఇలా:** ఈ పరీక్షను 100 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం 120నిమిషాలు. నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. హిందీ, ఇంగ్లిష్ మాధ్యమాల్లో పరీక్ష ఉంటుంది.

నాలుగు విభాగాలు: జనరల్ ఇంటెలిజెన్స్-25 ప్రశ్నలు 25 మార్కులు, జనరల్ నాలెడ్జ్ 25 ప్రశ్నలు 25 మార్కులు, అర్థమెటిక్ -25 ప్రశ్నలు 25 మార్కులు,జనరల్ ఇంగ్లిష్/హిందీల నుంచి 25 మార్కులకు 25 ప్రశ్నల చొప్పున అడుగుతారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులు ప్రారంభ తేదీ: 26.09.2022
» దరఖాస్తులకు చివరి తేదీ: 25.10.2022
» వెబ్‌సైట్: https://www.cisfrectt.in

ఇంజనీరింగ్ కొలువుల పిలుపు

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ).. పలు ప్రభుత్వ శాఖల్లో.. ఇంజనీరింగ్, టెక్నికల్ విభాగాల్లో.. కొలువుల భర్తీకి శ్రీకారం చుట్టింది. డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణతగా.. పోటీ పడే అవకాశం కల్పిస్తోంది. తాజాగా.. ఈ నోటిఫికేషన్‌కు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. ఆయా పోస్ట్‌ల వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్షలో విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..



టీఎస్‌పీఎస్సీ జాబ్స్

» పలు శాఖల్లో ఏఈ, జేటీఓ పోస్టులు
» 833 పోస్టల భర్తీకి నోటిఫికేషన్
» డిప్లొమా,బీటెక్ అర్హతలతో పోటీ పడే అవకాశం

టీఎస్‌పీఎస్సీ తాజా నోటిఫికేషన్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖల్లో 833 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ బ్రాంచ్‌లతో డిప్లొమా/బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి. ఇప్పటికే ఇంజనీరింగ్ ఉద్యోగాలకు ప్రిపరేషన్ సాగిస్తున్న అభ్యర్థులకు ఇది మరో చక్కటి అవకాశంగా పేర్కొనవచ్చు. దీన్ని అందిపుచ్చుకుంటే..ఆకర్షణీయ వేతనంతోపాటు సుస్థిర భవిష్యత్తు, సర్కారీ కొలువు కల సాకారం చేసుకునే అవకాశం సొంతం చేసుకోవచ్చు.

- మొత్తం 833 పోస్టులు

అర్హతలు

- సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ బ్రాంచ్‌లతో డిప్లొమా/బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** అన్ని పోస్టులకు వయో పరిమితిని 18 నుంచి 44 ఏళ్లుగా నిర్దేశించారు.
- రిజర్వేషన్ వర్గాల అభ్యర్థులకు గరిష్ఠ వయో పరిమితిలో అయిదేళ్ల సడలింపు లభిస్తుంది.

వేతన శ్రేణి

- అసిస్టెంట్ ఇంజనీర్ పోస్ట్‌లకు రూ.45,960-రూ.1,24,150; జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్ట్‌లకు రూ.32,800-రూ.96,890గా వేతన శ్రేణిని పేర్కొన్నారు.

రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా

పలు శాఖల్లో ఏఈ, జేటీఓ పోస్ట్‌లకు చేపట్టనున్న ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహించి.. అందులో చూపిన ప్రతిభ ఆధారంగా నియామకాలు ఖరారు చేయనున్నారు. రాత పరీక్షను రెండు పేపర్లుగా నిర్వహించనున్నారు. వివరాలు..

పేపర్	సబ్జెక్ట్	ప్రశ్నలు	మార్కులు
పేపర్-1	జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీ	150	150
పేపర్-2	సబ్జెక్ట్ పేపర్ (సివిల్/ఈఈఈ/మెకానికల్)	150	150
మొత్తం		300	300

- పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది.
- **పరీక్షకు కేటాయించిన సమయం:** ప్రతి పేపర్‌కు రెండున్నర గంటలు.
- రెండో పేపర్‌ను ఇంగ్లిష్ మీడియంలోనే నిర్వహిస్తారు.

విజయం సాధించాలంటే

జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీ

- పేపర్-1గా పేర్కొన్న జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీలో రాణించేందుకు అభ్యర్థులు ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలి. అదే విధంగా అంతర్జాతీయ సంబంధాలు, పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.
- జనరల్ సైన్స్‌కు సంబంధించి ఇటీవల కాలంలో దేశంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురోగతి, తాజా పరిస్థితులు, రక్షణ రంగంలో పరిశోధనలు, ఇస్రో ప్రయోగాలు తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.
- పర్యావరణ అంశాలకు సంబంధించి విపత్తు నిర్వహణ, నివారణ వ్యూహాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- భారత్, తెలంగాణకు సంబంధించి ఆర్థిక, సామాజిక అభివృద్ధిపై దృష్టి సారించాలి. తాజాగా అమలవుతున్న అభివృద్ధి పథకాలను తెలుసుకోవాలి.
- తెలంగాణ ప్రాంత భౌగోళిక స్వరూపం, విశిష్టతలు తెలుసుకోవాలి.
- చరిత్రకు సంబంధించి.. తెలంగాణ, భారత చరిత్రలను అధ్యయనం చేయాలి.
- ముఖ్యంగా తెలంగాణకు సంబంధించిన చరిత్రపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తెలంగాణ తొలి ఉద్యమ దశ నుంచి తెలంగాణ ఆవిర్భావం వరకు పలు ముఖ్యమైన అంశాలను ఔపోసన పట్టాలి.
- వీటితోపాటు తెలంగాణ సంస్కృతి, సామాజిక పరిస్థితులు, కళలు, సాహిత్యం వంటి అంశాలను కూడా చదవాలి.
- ఇటీవల కాలంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- అనలిటికల్ ఎబిలిటీలో గ్రాఫ్స్, డేటా అనాలిసిస్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి.
- వీటితోపాటు భారత రాజ్యాంగం, ప్రభుత్వ పాలన విధానం, భారత భౌగోళిక శాస్త్రంలోని ముఖ్యమైన అంశాలను చదవాలి.
- పదో తరగతి స్థాయిలో ఇంగ్లిష్ గ్రామర్‌ను అభ్యసనం చేయాలి.

పేపర్-2కు ఇలా

- అభ్యర్థుల అర్హతలు, దరఖాస్తు చేసుకున్న పోస్ట్ ఆధారంగా రాయాల్సిన పేపర్-2 (సబ్జెక్ట్ పేపర్)లో రాణించేందుకు.. డిప్లొమా స్థాయిలో ఆయా బ్రాంచ్‌ల అకడమిక్ పుస్తకాలను అధ్యయనం చేయాలి.
- సివిల్ ఇంజనీరింగ్ అభ్యర్థులు సర్వేయింగ్, కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్ అండ్ ప్రాక్టీస్, ఇంజనీరింగ్ మెకానిక్స్ అండ్ స్ట్రెంగ్త్ ఆఫ్ మెటీరియల్స్, హైడ్రాలిక్స్, క్వాంటిటీ సర్వేయింగ్, డిజైన్ ఆఫ్ స్ట్రక్చర్స్, ఇరిగేషన్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లోని అంశాల్లో దృష్టి పెట్టాలి.
- మెకానికల్ అభ్యర్థులు థర్మల్ ఇంజనీరింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ మెకానిక్స్ అండ్ స్ట్రెంగ్త్ ఆఫ్ మెటీరియల్స్, మెషీన్ డిజైన్, ఇంజనీరింగ్ మెటీరియల్స్, హైడ్రాలిక్స్ అండ్ హైడ్రాలిక్స్ మెషినరీ, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- ఎలక్ట్రికల్ అభ్యర్థులు బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ బ్యాటరీస్, ఎలక్ట్రికల్ సర్క్యూట్స్, డీసీ మెషీన్స్, మెజరింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఏసీ మెషీన్స్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, పవర్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్ అండ్ ఎస్టిమేషన్, యుటిలైజేషన్ అండ్ ట్రాక్షన్, పవర్ ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించిన అన్ని అంశాలపై పట్టు సాధించాలి.

అప్లికేషన్ ఓరియెంటేషన్

ప్రిపరేషన్ సమయంలో అభ్యర్థులు అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ముందుకు సాగాలి. ముఖ్యంగా పేపర్-2 సబ్జెక్ట్‌లకు సంబంధించి బీటెక్ లేదా డిప్లొమా స్థాయిలోని అకడమిక్ పుస్తకాలను ఆధారంగా చేసుకుని ప్రిపరేషన్ సాగించాలి.

మోడల్ పేపర్లు, మాక్ టెస్ట్‌లు రాయడం కూడా పరీక్షలో మెరుగైన ప్రతిభ చూపేందుకు దోహదం చేస్తుంది. పేపర్-2లోని ప్రశ్నలు డిప్లొమా స్థాయిలోనే ఉంటాయని నోటిఫికేషన్‌లో పేర్కొన్నప్పటికీ.. అభ్యర్థులు బీటెక్ స్థాయిలోని అంశాలపైనా దృష్టిపెడితే విజయావకాశాలు మెరుగవుతాయి. ప్రిపరేషన్‌ను అప్లికేషన్ అప్రోచ్‌తో సాగించాలని, దీని వల్ల ప్రాక్టికల్ థింకింగ్ అలవడి, ప్రశ్నను ఎలా అడిగినా సమాధానం ఇవ్వగలిగే నేర్పు లభిస్తుందని సూచిస్తున్నారు. అదే విధంగా టీఎస్‌పీఎస్సీ గతంలో నిర్వహించిన ఏఈ/ఏఈఈ ప్రశ్న పత్రాలను సాధన చేయడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 21 వరకు
- **పరీక్ష తేదీ:** 2023 జనవరి/ఫిబ్రవరిలో నిర్వహించే అవకాశం.
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ నిజామాబాద్
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://tspsc.gov.in

క్లుప్తంగా

తిరుపతికి ప్రత్యేక రైలు

భువనేశ్వర్: ప్రయాణికుల సౌకర్యార్థం భువనేశ్వర్ నుంచి తిరుపతికి ప్రత్యేక ఏసీ వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్(02809 / 02810)ను నడిపిస్తున్నట్లు తూర్పు కోస్తా రైల్వే ప్రకటించింది. బరంపురం, పలాస, శ్రీకాకుళం, విజయనగరం తదితర ప్రాంతాల ప్రజలకు తిరుపతి రైలు ప్రయాణం సులభం చేసేందుకు ఈ సదుపాయం కల్పించినట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీ మధ్య ఈ సదుపాయం ఉంటుందని వెల్లడించారు. 02809 నంబర్ కలిగిన భువనేశ్వర్–తిరుపతి వీక్లీ సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ రైలు అక్టోబర్ 1వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ప్రతి శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు భువనేశ్వర్ నుంచి బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో 02810 నంబర్ కలిగిన ట్రైన్ సేవలు అక్టోబరు 2వ తేదీ నుంచి 30వ తేదీ వరకు లభిస్తాయి. ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు తిరుపతి నుంచి ఈ ట్రైన్ బయల్దేరుతుంది. ఈ రైళ్లు ఖుర్దా రోడ్, బలుగావ్, బరంపురం, పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం, దువ్వాడ, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతాయి. మొత్తం 16 తృతీయ శ్రేణి ఎయిర్ కండీషన్ బోగీలు ఉంటాయి.

పోస్టాఫీసుల్లో ‘న్యాయ సహాయం’ దరఖాస్తులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్థానిక తపాలా శాఖ అధికారులతో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు మంగళవారం సమావేశమయ్యారు. తపాలా కార్యాలయాల ద్వారా న్యాయ సహాయం కోసం దరఖాస్తులు పంపించే విధానంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని తపాలా కార్యాలయాల్లోనూ దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, న్యాయ సహాయం కోసం నేరుగా న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

సెలవు రోజుల్లో స్కూల్స్ తెరిస్తే కఠిన చర్యలు

శ్రీకాకుళం న్యూకాలనీ: దసరా సెలవుల్లో పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ తెలిపారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈ ఏడాది దసరా సెలవులను సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు 12 రోజులపాటు ప్రకటించిన విషయం తెలిసిందే. సెలవు రోజుల్లో ప్రైవేటు పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాగుకు డ్రోన్ సాయం



డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

- జిల్లాకు 656 డ్రోన్ల మంజూరు
- 40 శాతం రాయితీపై మండలానికి 3 డ్రోన్ల కేటాయింపు

సరుబుజ్జిలి: సాగుకు అధునాతన సాయం అందుతోంది. ఖర్చులను నియంత్రించడం, శ్రమను తగ్గించడం, సురక్షిత పద్ధతులను అలవాటు చేయడంలో భాగంగా డ్రోన్ల ద్వారా పంటకు క్రిమిసంహారక మందులు స్ప్రే చేసేందుకు వ్యవసాయ శాఖ శ్రీకారం చుట్టింది. ఈ డ్రోన్లను రైతులకు 40 శాతం రాయితీపై అందించేందుకు వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తుంది. జిల్లాకు 656 డ్రోన్లు మంజూరు చేయగా, ఇప్పటివరకు 325 గ్రౌండింగ్ అయ్యాయి. మరో 331 గ్రౌండ్ చేయాల్సి ఉంది.

డ్రోన్లు ఎలా పొందాలి..?

ముందుగా ఐదారుగురు రైతులు సంఘంగా ఏర్పాటు కావాలి. ఇందుకు సంఘం వాటా కింద 10 శాతం నగదు చెల్లిస్తే, ప్రభుత్వం 40 శాతం భరిస్తుంది. మిగతా 50 శాతం బ్యాంకు రుణంగా అందిస్తారు. డ్రోన్ పరిధి ప్రకారం వీటి ధర రూ.6 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఉంటుంది. సంఘ సభ్యుల్లో ఒక రైతు ఇంటర్ వరకు చదివి ఉండాలి. వారికి డ్రోన్ వినియోగంపై వ్యవసాయశాఖ యంత్రాంగం శిక్షణ ఇస్తారు.

పని చేసే విధానం

ఈ డ్రోన్‌లో రసాయన మందులు నింపడానికి ప్రత్యేక ట్యాంకు ఉంటుంది. ద్రావణం మిక్స్ చేసి నింపిన తర్వాత రిమోట్ యంత్రాన్ని ఆపరేట్ చేసి, భూమి నుంచి పైకి 3 మీటర్ల ఎత్తున, 10కిలోల లోడ్‌ను మోసుకొని, రోజుకు 7గంటల పాటు ఉపయోగించి సుమారు 25 ఎకరాలు పిచికారీ చేయవచ్చు. నిర్దేశించిన లక్ష్యాన్ని ఆపరేటర్ ఫిక్స్ చేసిన ప్రకారం పిచికారీ జరుగుతుంది. ఆపరేటర్ చేతిలో ఉన్న రిమోట్ మిషన్ ప్రకారం ఈ డ్రోన్ పనిచేయడం మొదలు పెడుతుంది.

సీహెచ్‌సీల ద్వారా పంపిణీ..

రైతు సంఘాలు ఏర్పడిన తర్వాత కస్టమర్ హైరింగ్ కేంద్రాల ద్వారా ఈ డ్రోన్లు పంపిణీ చేస్తారు. డ్రోన్ సామర్థ్యం బట్టి బట్టి దాని ధర మారుతుంది. సంఘం సభ్యులు ముందుగా తన వ్యవసాయ పనులకు వినియోగించుకొని తదుపరి, ఇతరులకు అద్దెకు ఇచ్చేందుకు వెసులుబాటు ఉంది. ఆ తర్వాత వచ్చిన నగదును బ్యాంకులకు వాయిదా పద్ధతిలో చెల్లించి గడువులోగా రుణం తీర్చాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో సబ్ డివిజన్ వారీగా..

సబ్ డివిజన్	మంజూరైనవి	గ్రౌండ్ అయినవి
సోంపేట	81	40
పలాస	95	41
టెక్కలి	104	52
నరసన్నపేట	91	39
శ్రీకాకుళం	104	60
రణస్థలం	99	47
పాలకొండ	16	13
కొత్తూరు	66	33

రైతులు వినియోగించుకోవాలి



ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు వినియోగించుకోవాలి. రానున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విధానం చాలా ప్రయోజనకరం. స్ప్రేయర్ల కంటే డ్రోన్ల ద్వారా పూర్తిస్థాయి మందుల పిచికారీ జరుగుతాయి. ఒకే సారి పదుల ఎకరాలకు మందులు స్ప్రే చేయవచ్చు. ఇప్పటికే రైతులకు గ్రామాల్లో మా సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

– కె.శ్రీధర్, జిల్లా జాయింట్ డైరెక్టర్, వ్యవసాయశాఖ

వ్యవసాయ గణనతో అన్నదాతకు మేలు



మందసలో వర్షపాతాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఉపగణాంకాధికారి దూసూళ సురేంద్ర

మందస:

ప్రతీ ఐదేళ్లకొకసారి జరిగే వ్యవసాయ గణన ఈ ఏడాది కూడా సక్రమంగా జరగాలని జిల్లా ఉప గణాంకాధికారి డి.సురేంద్ర కోరారు. మందస తహసీల్దార్ బడే పాపారావు అధ్యక్షతన మంగళవారం మందసలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 11వ ప్రపంచ వ్యవసాయ సాగు కమతాల లెక్కింపు సందర్భంగా ఈసారి ఆన్‌లైన్ ద్వారా లెక్కింపు జరుగుతుందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మీ భూమి వెబ్‌పోర్టల్‌కు ఈ డేటాను అనుసంధానం చేస్తామని పేర్కొన్నారు. సన్న, చిన్న, మధ్య తరగతి, పెద్ద తరగతి, అతి పెద్ద తరగతి సాగుదారు రైతులతో పాటు ఎస్సీ, ఎస్టీ, ఓసీ కేటగిరిలో ఎంతమంది ఉన్నారో గుర్తిస్తామని తెలిపారు. ఒక రెవెన్యూ గ్రామం యూనిట్‌గా లెక్కింపు చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం ఏఎస్‌ఓ వర్క్ రికార్డులను, వర్షపాత నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సంతోష్‌కుమార్, ఎంఆర్ఐ సవర చిన్నారావు, ఏఎస్‌ఓ ఎం.గణపతి, వీఆర్వోలు పాల్గొన్నారు.

జీఆర్పీ సంరక్షణలో యువతి

కాశీబుగ్గ:

పలాస రైల్వేస్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 18 ఏళ్ల యువతిని జీఆర్పీ పోలీసులు సంరక్షించారు. జీఆర్పీ ఎస్ఐ షరీఫ్ తెలిపిన వివరాల మేరకు.. జీఆర్పీ, ఆర్పీఎఫ్, స్టేషన్ మేనేజర్, చైల్డ్‌లైన్ కలిపి మంగళవారం 24 గంటల స్పెషల్‌డ్రైవ్ చేపట్టారు. అక్రమ రవాణా, మద్యం రవాణా, చిన్నారులు, బాలికలు తరలింపు వంటి వాటిపై తనిఖీలు నిర్వహించగా.. చత్తీస్‌గఢ్‌కు చెందిన మునిత జగత్ అనే యువతి వారి కంటపడింది. చత్తీస్‌గఢ్ నుంచి ఈ యువతి తప్పిపోయి పలాస రైల్వేస్టేషన్‌కు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఆమెను అబ్జర్వేషన్ గదిలో ఉంచారు. నాగ్‌పూర్‌లో ఉన్న ఆమె అక్క సరస్వతి జగత్‌కు ఫోన్‌లో సమాచారం అందించారు. ఆమె బుధవారం పలాసకు వస్తే యువతిని అప్పగించనున్నారు.



మహిళా జీఆర్పీ పోలీసుల సంరక్షణలో యువతి

‘డచ్ బంగ్లా చరిత్ర చెబుదాం’

శ్రీకాకుళం కల్చరల్:

జిల్లా కేంద్రంలోని డచ్ బంగ్లా చరిత్రను జిల్లా వాసులకు వివరించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఇంటాక్ సర్వసభ్య సమావేశం మంగళవారం స్థానిక డచ్ బంగ్లా వద్ద జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. రానున్న ఆరు మాసాల్లో డచ్ బంగ్లా చరిత్ర ప్రజలకు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే జనవరి 26 నాటికి దీన్ని సిద్ధం చేయాలన్నారు. అలాగే జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక కట్టడాలు ఉన్నాయని, వాటిపై చాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో దాదాపు 140 వరకు చారిత్రక కట్టడాలు ఉన్నట్లు సభ్యులు తెలిపారని, వాటిలో కనీసం 60 ప్రదేశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా డచ్ బంగ్లాలో తొలిసారిగా ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. తొలుత నృత్య కళాకారుడు లీలాకృష్ణ నేతృత్వంలో జరిగిన వివిధ కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం నృత్య కళాకారులను, మరికొందరిని కలెక్టర్ సత్కరించారు. పూర్వపు ఇంటాక్ కన్వీనర్ కేవీజే రాధాప్రసాద్, ప్రస్తుత కన్వీనర్ నూక సన్యాసిరావులు ప్రసంగిస్తూ దేవదాయశాఖ పర్యాటక శాఖల సమన్వయంతో బాధ్యతను స్వీకరించి చారిత్రక ఉద్యానవనంగా డచ్ బంగ్లాను తీర్చిదిద్దుతామని అన్నారు.



కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

తెలవారి‘నది’



తొలి పొద్దు పొడిచే సమయానికి నాగావళి నిశ్శబ్దంగా ప్రవహిస్తోంది. లేలేత కిరణాలు పలకరించే సమయానికి ఇలా వర్ణాలు పులుముకుని సముద్రం వైపు సాగిపోతోంది. శ్రీకాకుళంలో మంగళవారం సూర్యోదయ సమయంలో నాగావళి మనోహరంగా కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

నేటి నుంచి కృష్ణా ట్రిబ్యునల్ సమావేశం



సాక్షి, అమరావతి: ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన నీటి వనరులను ఏపీ, తెలంగాణలకు పంపిణీ చేయడంపై జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కేడబ్ల్యూడీటీ–2(కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్) బుధవారం సమావేశమవుతోంది. మూడు రోజులపాటు ఈ దఫా విచారణ కొనసాగించనుంది. ఇప్పటికే ఏపీ ప్రభుత్వ సాక్షిని క్రాస్ ఎగ్జామినేషన్ చేసే ప్రక్రియను పూర్తి చేసిన ట్రిబ్యునల్..ఈ దఫా విచారణలో తెలంగాణ ప్రభుత్వ సాక్షిని క్రాస్ ఎగ్జామినేషన్ చేసే ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉంది. అక్టోబర్‌లో నిర్వహించే సమావేశాల్లో ప్రధాన విచారణ చేపట్టనుంది.

వెబ్ ఆప్షన్‌ల నమోదుకు నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: పీజీ మెడికల్ డిగ్రీ/డిప్లొమో కోర్సుల్లో 2022–23 విద్యా సంవత్సరానికి రాష్ట్ర కోటా సీట్లలో ప్రవేశాలకు మొదటి కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఆప్షన్‌ల నమోదుకు ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. 29న సాయంత్రం 4 గంటల వరకు ఆప్షన్‌ల నమోదుకు తుది గడువు అని పేర్కొంది. సర్వీస్, నాన్–సర్వీస్ అభ్యర్థులు https://pgcq.ntruhsadmissions.com వెబ్‌సైట్ ద్వారా ఆప్షన్‌లు నమోదు చేసుకోవాలి. ఆప్షన్‌ల నమోదులో సాంకేతికపరమైన సమస్యలు తలెత్తితే 7416563063, 7416253073 నంబర్‌లను సంప్రదించాలి.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు పోస్టింగ్ కోసం కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖలోని డీఎంఈ పరిధిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాల్లో భాగంగా ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇవ్వడం కోసం మంగళవారం ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. 622 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయగా ఇందులో 247 లేటరల్ ఎంట్రీ, 375 పోస్టులు ప్రత్యక్ష పద్ధతిలో భర్తీ చేస్తున్నారు. లేటరల్ ఎంట్రీ పోస్టులకు ఎంపికైన 113 మందికి పోస్టింగ్‌ల కోసం ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. వీరిలో సుమారు 1000 మంది మాత్రమే పోస్టింగ్‌లు కావాల్సిన ప్రాంతాలను ఎంపిక చేసుకోగా, మిగిలిన వారు ఎటువంటి ఎంపిక చేసుకోలేదు.


షీలా కమిటీ సిఫార్సులే దిక్సూచి

ఆ మేరకు విభజించుకుందాం ■ ఏపీ భవన్ ఆస్తులను ఇరు రాష్ట్రాలకు త్వరగా పంచాలి

విభజన సమస్యల పరిష్కారంపై తెలుగు రాష్ట్రాలతో కేంద్ర హోంశాఖ భేటీలో ఏపీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన చట్టం షెడ్యూల్ 9లో పొందుపరచిన ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్ల మొత్తం ఆస్తులు, అప్పులను షీలా భిడే కమిటీ సిఫార్సుల మేరకు ఇరు రాష్ట్రాలూ విభజించుకుందామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర హోంశాఖ వద్ద ప్రతిపాదించింది. విభజన సమస్యల పరిష్కారంపై ఆంధ్రప్రదేశ్ అడుగు ముందుకు వేసినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం ఇందుకు విముఖత వ్యక్తం చేసింది. కేంద్ర హోంశాఖ మాత్రం ఏపీ ప్రతిపాదనల పట్ల సానుకూలత వ్యక్తం చేస్తూ న్యాయ శాఖ సలహా తీసుకోనున్నట్లు తెలిపింది. రాష్ట్ర విభజనకు సంబంధించి పెండింగ్ సమస్యల పరిష్కారంపై ఢిల్లీలో మంగళవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి అధ్యక్షతన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సీఎస్‌లతోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారుల సమావేశం జరిగింది.

- షెడ్యూల్ 9లో పేర్కొన్న 90 ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్ల ఆస్తులు, అప్పులను ఇరు రాష్ట్రాలకు విభజిస్తూ షీలా భిడే నిపుణుల కమిటీ సిఫార్సులు చేసింది. అయితే 68 సంస్థలకు సంబంధించిన సిఫార్సులను తెలంగాణ ప్రభుత్వం, వీటిలో 53 సంస్థల సిఫార్సులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇన్ని రోజులుగా అంగీకరిస్తూ వచ్చినా విభజన మాత్రం జరగలేదు. తాజాగా జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొత్తం 90 సంస్థలకు సంబంధించి షీలా భిడే సిఫార్సులను యథాతథంగా అమలు చేయాలని కేంద్ర హోంశాఖను కోరింది. ఇందుకు తెలంగాణ ప్రభుత్వం విముఖత వ్యక్తం చేసింది. దీనిపై నిర్ణయం తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కోరగా న్యాయ సలహా తీసుకుంటామని కేంద్ర హోంశాఖ కార్యదర్శి తెలిపారు.
- విభజన చట్టం షెడ్యూల్ 10లో పేర్కొన్న ఇన్‌స్టిట్యూట్స్ ఆస్తులు, అప్పుల పంపిణీకి సంబంధించి 2016లో కేంద్ర హోంశాఖ జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిమాండ్ చేసింది. పదో షెడ్యూల్‌లోని 142 ఇన్‌స్టిట్యూషన్ల ఆస్తులు, అప్పుల పంపిణీ జనాభా ప్రాతిపదికన జరగాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరుతూ వస్తోంది. అందుకు అనుగుణంగా ఒక సంస్థ విషయంలో సుప్రీం కోర్టు తీర్పు కూడా ఇచ్చింది. అయితే కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు సుప్రీం తీర్పునకు విరుద్ధంగా ఉన్నందున ఆ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ డిమాండ్ చేసింది. దీనిపై సొలిసిటర్ జనరల్ అభిప్రాయాన్ని తీసుకోవాలని కేంద్ర హోంశాఖను కోరింది.
- ఢిల్లీలోని ఏపీ భవన్ ఆస్తులను ఇరు రాష్ట్రాలకు త్వరగా పంపిణీ చేయాలని ఏపీ ప్రభుత్వం కోరగా కేంద్ర హోంశాఖ కార్యదర్శి సానుకూలంగా స్పందించారు. విభజన చట్టం నిబంధనల మేరకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేయాలని, జాప్యం చేయవద్దని ఏపీ ప్రభుత్వం కోరింది. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమీర్‌శర్మ, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, రాష్ట్ర పునర్విభజన ముఖ్యకార్యదర్శి ఎల్.ప్రేమచంద్రారెడ్డి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఏపీ సీఎస్, అధికారులు

వ్యయం భారీగా పెరుగుతోంది..

- నూతన రాజధాని కోసం రూ.25 వేల కోట్ల వ్యయం అవుతుందని శివరామకృష్ణన్ కమిటీ నివేదికలో పేర్కొన్నారని, ఆ నివేదిక ఇచ్చి చాలా సంవత్సరాలైనందున వ్యయం భారీగా పెరుగుతుందని, ఆ మేరకు నిధులివ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిమాండ్ చేసింది. మీరిచ్చే రూ.2,500 కోట్లు ఏ మూలకూ సరిపోవని ఏపీ ప్రభుత్వం కేంద్ర హోంశాఖకు స్పష్టం చేసింది.
- నూతన రాజధానికి ర్యాపిడ్ రైల్ కనెక్టివిటీ ఏర్పాటును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రస్తావించగా వయబుల్ కాదని రైల్వే శాఖ పేర్కొంది. దీనిపై ఏపీ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టలేని కారణంగానే విభజన చట్టంలో చేర్చారని, వయబుల్ కాకపోయినప్పటికీ కేంద్రం చేపట్టాలని ఏపీ ప్రభుత్వం పేర్కొంది. ఏపీ వాదనతో కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఏకీభవిస్తూ సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని రైల్వే శాఖకు సూచించారు.

అటవీ శాఖలో భారీగా బదిలీలు

సాక్షి, అమరావతి: ఏపీలో కొత్త జిల్లాలకు అనుగుణంగా అటవీ శాఖను పునర్వ్యవస్థీకరించిన ప్రభుత్వం అక్కడ కొత్తగా అటవీ శాఖాధికారులను నియమించింది. 26 జిల్లాల్లో 32 టెరిటోరియల్ డివిజన్లు, 12 సోషల్ ఫారెస్ట్ డివిజన్లు, వైల్డ్ లైఫ్ డివిజన్లకు డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ (డీఎఫ్‌వో)లను నియమించింది. ఇందుకోసం ఇప్పుడు పనిచేస్తున్న డీఎఫ్‌వోలను బదిలీ చేసింది. ఆ డివిజన్లలో ఇతర అధికారులు, సిబ్బందిని కూడా నియమించింది. బుధవారం నుంచి కొత్త డివిజన్ల ప్రకారం అటవీ శాఖ పనిచేయనుంది. అటవీ, ఎక్సైజ్, అగ్నిమాపక శాఖల స్వరూపం జిల్లాల వారీగా, రెవెన్యూ డివిజన్లకు అనుగుణంగా ఉండదు. ఒక జిల్లాలో 3, 4 డివిజన్లు.. కొన్నిచోట్ల 2 జిల్లాలకు కలిపి ఒక డివిజన్ ఉండే అవకాశం ఉంటుంది. ఈ కారణంగానే జిల్లాల పునర్విభజన సమయంలో అటవీ శాఖ పునర్వ్యవస్థీకరణ జరగలేదు. అటవీ శాఖ స్వరూపాన్ని బట్టి పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం సమయం ఇచ్చింది. దీంతో 2 నెలల్లో కసరత్తు చేసి ఇటీవలే అటవీ శాఖను పునర్వ్యవస్థీకరించారు. వాటి ప్రకారం మంగళవారం సిబ్బందిని బదిలీ చేశారు.

ప్రతి జిల్లాకు ఒక డివిజన్

పునర్వ్యవస్థీకరణ తర్వాత ప్రతి జిల్లాకు ఒక డివిజన్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి జిల్లాలో కలెక్టర్, ఎస్పీ ఉన్నట్లే జిల్లా అటవీ శాఖాధికారి ఒకరు ఉండేలా చూశారు. ఆయా జిల్లాల్లో ఎక్కువ అడవి ఉంటే అక్కడ అదనంగా డివిజన్లు సృష్టించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో జిల్లా అటవీ శాఖాధికారిని నియమించారు. ఆ జిల్లాలో అటవీ విస్తీర్ణం ఎక్కువ ఉండడంతో మరో 3 డివిజన్లు సృష్టించి వాటికి డీఎఫ్‌ఓలను నియమించారు. జిల్లాలో అటవీ శాఖను సమన్వయం చేసేది పాడేరులోని జిల్లా అటవీ శాఖాధికారే. ఇలా అన్ని జిల్లాలను అటవీ విస్తీర్ణాన్ని బట్టి పునర్వ్యవస్థీకరించారు. ఆ డివిజన్ల ప్రకారం బుధవారం నుంచి పరిపాలన ప్రారంభం కానున్నట్లు అటవీ దళాల అధిపతి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ వై.మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

చెత్తను జల్లెడ పట్టి.. ఉంగరాన్ని వెతికిపట్టి

- పొరపాటున ప్రభుత్వ చెత్త బుట్టలో ఉంగరాన్ని పడేసుకున్న మహిళ
- వెతికివ్వాలంటూ 'స్పందన'లో ఫిర్యాదు
- 5 గంటల పాటు ఉంగరాన్ని వెతికి అప్పగించిన పారిశుధ్య కార్మికులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి ఓ చిత్రమైన ఫిర్యాదు అందింది. ఒక మహిళ ఫోన్ చేసి తన ఉంగరం పొరపాటున ప్రభుత్వ చెత్త బుట్టలో పడిపోయిందని చెప్పింది. ఆ ఉంగరాన్ని వెతికించి.. ఇవ్వాలని కోరింది. దీంతో శానిటేషన్ సిబ్బంది చెత్తనంతా జల్లెడ పట్టి.. చివరకు ఉంగరాన్ని ఆమెకు అప్పగించారు. వివరాలు.. ఇన్నీస్‌పేటకు చెందిన నాగలక్ష్మి సోమవారం తన ఇంట్లోని చెత్తను తీసుకెళ్లి.. సమీపంలోని ప్రభుత్వ చెత్త తొట్టెలో వేసింది. ఆ తర్వాత కొంతసేపటికి.. తన చేతికి ఉన్న 6 గ్రాముల బంగారు ఉంగరం కనబడకపోవడంతో ఆమె ఆందోళన చెందింది. చెత్త బుట్టలో జారిపోయి ఉంటుందన్న సందేహంతో.. అక్కడకు వెళ్లింది. కానీ అదంతా చెత్తతో నిండిపోయి ఉండటంతో.. నాగలక్ష్మి 'స్పందన' కార్యక్రమాన్ని ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న కమిషనర్ దినేశ్‌కుమార్.. స్థానిక సచివాలయ సిబ్బందిని, పారిశుధ్య కార్మికులను అప్రమత్తం చేశారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బుద్ధ శ్రీను, శానిటేషన్ సెక్రటరీ ఎం.రాజేశ్, పారిశుధ్య కార్మికులు బంగారు శ్రీను, జయకుమార్, మేస్త్రీ శ్రీను దాదాపు 5 గంటల పాటు చెత్తనంతా వెతికి.. ఉంగరాన్ని బాధితురాలికి అందజేశారు. దీంతో నాగలక్ష్మి వారికి కృతజ్ఞతలు తెలిపింది.



బంగారు ఉంగరం

ఇంటింటా సంక్షేమ కాంతులు

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో ఇంటింటా సంతోషం వెల్లివిరుస్తోందని నేతలతో ప్రజలు చెబుతున్నారు. అన్ని జిల్లాల్లోనూ మంగళవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.



కృష్ణా జిల్లా కోలవెన్నులో ఎమ్మెల్యే పార్థసారథి



నంద్యాల జిల్లా 10 బొల్లవరంలో ఎమ్మెల్యే ఆర్థర్



విశాఖ జిల్లా అయ్యన్నపాలెంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి..

మీ ఇల్లు చల్లగుండ!

జగనన్న కాలనీల్లోని ఇళ్లలో ఉష్ణోగ్రతలు తగ్గించడంపై ప్రయోగం

ఎంపిక చేసిన 12 ఇళ్లకు కూల్ రూఫ్ పెయింట్

సాక్షి, అమరావతి: కూల్ రూఫ్ పెయింట్ ద్వారా జగనన్న కాలనీల్లోని ఇళ్లలో ఉష్ణోగ్రతలు తగ్గించడంపై ప్రయోగం చేపడుతున్నట్లు గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) సహకారంతో ఇండో–స్విస్ బిల్డింగ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ప్రాజెక్ట్ (బీఈఈపీ) ద్వారా జగనన్న కాలనీల్లోని ఇళ్లల్లో ఇంధన సామర్థ్య కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం), అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ) చేపడుతున్న కూల్ రూఫ్ ప్రాజెక్టుపై మంగళవారం విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. దీనికి అజయ్‌జైన్ వర్చువల్‌గా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం వార్షిక విద్యుత్ డిమాండ్ 60,943 మిలియన్ యూనిట్లు ఉంటే, అందులో భవనాలకు వాడుతున్నది 17,514 మిలియన్ యూనిట్లు (28 శాతం) ఉందన్నారు. దీన్ని తగ్గించేందుకు జగనన్న ఇళ్లల్లో విద్యుత్ ఆదా చర్యలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కూల్ రూఫ్‌ను విశాఖపట్నం, గుంటూరు, కాకినాడ జిల్లాల్లోని పన్నెండు ఇళ్లపై వేసి వచ్చే ఫలితాలను అధ్యయనం చేస్తామన్నారు.

3.5 లక్షల మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

సాక్షి అమరావతి: ఏపీలోని 3.5 లక్షల మంది విద్యార్థులు అక్టోబర్ 1 నుంచి తమ ఇంటర్న్‌షిప్‌లను ప్రారంభిస్తారని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. హేమచంద్రారెడ్డి తెలిపారు. మండలి కార్యాలయంలో లింక్డ్‌ఇన్ ద్వారా చేకూరే ప్రయోజనాలపై మంగళవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలి అభివృద్ధి చేసిన లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎల్ఎంఎస్) ప్లాట్‌ఫారమ్ గురించి వివరిస్తూ.. ఇప్పటికే 9 లక్షల మంది విద్యార్థులు ఈ ప్లాట్‌ఫారమ్‌లో నమోదు చేసుకున్నారని తెలిపారు. ఇక నుంచి ఎల్ఎంఎస్‌లో ఉద్యోగావకాశాలు కనిపిస్తాయని చెప్పారు. లింక్డ్‌ఇన్ ఇండియా హెడ్ సబాకరీం మాట్లాడుతూ.. ఏపీ లో చాలా టాలెంట్ పూల్ ఉందని.. రాష్ట్రంలో విద్యార్థుల అవకాశాలు పెంచడానికి, యజమానులను ఆకర్షించడానికి లింక్డ్‌ఇన్ సహాయపడుతుందని చెప్పారు. లింక్డ్‌ఇన్ సీనియర్ డైరెక్టర్ రుచీ ఆనంద్ మాట్లాడుతూ.. లింక్డ్‌ఇన్ లెర్నింగ్ సొల్యూషన్స్ నుండి విద్యార్థులు ప్రతివారం 60 కోర్సులు నేర్చుకుంటున్నారని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ ఐటీ సలహాదారు శ్రీనాథ్ దేవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.